PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 43 సంచిక : 74 | విజయవాడ, శనివారం 14 అక్టోబర్ 2023 | 8 + 8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Saturday 14 October 2023 | Rs

యుఎపిఎ, ఆర్థిక నిబంధనల

దారుణమైన దుర్వినియోగం!

- అంతర్జాతీయ మానవ హక్కుల గ్రూపుల ఖండన

7




8

ఢీ.. అంటే ఢీ...

- నేడు భారత్ × పాకిస్తాన్ వన్డే మ్యాచ్

అదాని మరో మోసం



- బొగ్గు ధర మార్కెట్ రేటు కంటే రెండు రెట్లు పెంచి కోట్లు కొల్లగొట్టారు
- కరెంటు ఉత్పత్తి వ్యయం పెరిగేలా చేసి కోట్లాది మంది వినియోగదారుల నడ్డివిరిచారు
- 'ఫైనాన్షియల్ టైమ్స్' వెల్లడి

న్యూఢిల్లీ : తీవ్ర ఆర్థిక మోసాల ఆరోపణలు ఎదుర్కొంటున్న అదానీ గ్రూపు బొగ్గు దిగుమతుల్లోనూ మోసాలకు పాల్పడింది. ఇతర దేశాల నుండి బొగ్గును మార్కెట్ ధర కంటే రెట్టింపు ధరలకు కొనుగోలు చేసినట్టు దొంగలెక్కలు చూపి కోట్ల రూపాయలు కొల్లగొట్టిందని లండన్ నుంచి వెలువడే ప్రముఖ 'ఫైనాన్సియల్ టైమ్స్' పత్రిక తాజాగా వెల్లడించింది. అదానీ బొగ్గు బాగోతానికి సంబంధించి ఇదివరకే హిండెన్‌బర్గ్ వెల్లడించింది. అయితే, ఆ ఆరోపణలను ప్రధాని మోడీకి అత్యంత ప్రీతిపాత్రుడైన అదాని తిరస్కరించారు. ఈ నేపథ్యంలో ఫైనాన్షియల్ టైమ్స్ 2019-2021 మధ్య 32 నెలల పాటు అదానీ కంపెనీ 30 సార్లు జరిపిన బొగ్గు దిగుమతుల వ్యవహారాలకు సంబంధించి కస్టమ్స్ రిపోర్టులను, డైరక్టరేట్ ఆఫ్ రెవిన్యూ ఇంటెలిజెన్స్ రిపోర్టులను పరిశీలించి హిండెన్‌బర్గ్ బయటపెట్టిన విషయాలు నిజమేనని తేల్చింది. మధ్యవర్తులను ఉపయోగించి అధిక ధరలకు దిగుమతి చేసుకున్న బొగ్గును భారత విద్యుత్ కంపెనీలకు ఎలా అంటగట్టింది, బొగ్గు ధరను వాస్తవిక వ్యయం కన్నా రెండు రెట్లు అధికంగా ఇన్‌వాయిస్‌లలో చూపి కోట్ల రూపాయలు ఎలా కొల్లగొట్టింది, తద్వారా బొగ్గు ఆధారిత విద్యుత్ ఉత్పత్తి వ్యయం అమాంతంగా పెంచి, కోట్లాది మంది విద్యుత్ వినియోగదారులు, చిన్న పరిశ్రమలు, వ్యాపారులపై ఎడాపెడా భారాలను ఎలా మోపినదీ ఫైనాన్షియల్ టైమ్స్ విపులంగా వివరించింది. ఆ కథనం ప్రకారం 'ప్రధాని మోడీ అండతో అదానీ గ్రూపు దేశ ఆర్థిక వ్యవస్థలో ఆధిపత్యం చెలాయిస్తూ.. మార్కెట్ విలువ కంటే ఎక్కువ ధరలకు బిలియన్ డాలర్ల బొగ్గును దిగుమతి చేసుకున్నట్లు కనిపిస్తోంది. దేశంలోని అతిపెద్ద ప్రయివేటు బొగ్గు దిగుమతిదారు అయిన అదానీ ఇంధన ఖర్చులను పెంచి, కోట్లాది వినియోగదారులు, వ్యాపారాలను విద్యుత్ కోసం అధికంగా చెల్లించేలా చేస్తోంది.

గత రెండేళ్లుగా తైవాన్, దుబాయ్, సింగపూర్‌లలో విదేశీ మధ్యవర్తులను ఉపయోగించి అదానీ కంపెనీలు 5 బిలియన్ల (దాదాపు రూ.40వేల కోట్లు) విలువైన బొగ్గును మార్కెట్ ధర కంటే రెట్టింపు ధరలకు దిగుమతి చేసుకున్నట్లు రికార్డులు చూపిస్తున్నాయి. ఈ కంపెనీలలో ఒకటి తైవాన్‌కు చెందిన వ్యాపారవేత్తకు చెందినది ఉంది. ఆ కంపెనీ యజమాని ఇటీవల అదానీ కంపెనీలలో తెరచాటు వాటాదారుగా ఉన్నట్లు మిగతా 7లో



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న సిఎం జగన్‌మోహన్ రెడ్డి

రక్తహీనత బాధితులకు పౌష్టికాహారం

ప్రకాశంలో కిడ్నీ రీసెర్చ్ సెంటర్

సురక్ష క్యాంపుల్లోనే వికలాంగుల సర్టిఫికెట్లు జారీ

జగనన్న ఆరోగ్య సురక్షపై ప్రతి వారం సమీక్ష : ముఖ్యమంత్రి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రక్త హీనతతో ఉన్నవారిని గుర్తించిన అనంతరం వారికి పౌష్టికాహారం అక్కడే అందించేలా ఎస్‌పిఒ రూపొందించాలని అధికారులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. తిరుపతి తరహాలోనే చిన్న పిల్లల కోసం అత్యాధునిక వైద్య సౌకర్యం కలిగిన ఆస్పత్రులను విజయవాడ, గుంటూరు, విశాఖపట్నంలలో ఏర్పాటు చేయాలన్నారు. క్యాంపు కార్యాలయంలో జగనన్న ఆరోగ్య సురక్షపై వైద్యారోగ్యశాఖ అధికారులతో శుక్రవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో సిఎం మాట్లాడారు. ప్రకాశం జిల్లాలో కూడా కిడ్నీ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేయాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులకు వచ్చే రోగులకు కల్పిస్తున్న సదుపాయాలు మెరుగ్గా ఉండేలా చూసేందుకు కలెక్టర్లకు నిధులివ్వాలని ఆదేశించారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడు తున్న పాత పేషెంట్లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. చికిత్స అనంతరం వాడాల్సిన మందులు అతి ఖరీదైనా సరే అందించాలని, క్రమం తప్పకుండా వారికి చెకప్‌లు నిర్వహించాలని చెప్పారు. ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాకుండా గతంలో చికిత్స చేయించుకున్న పాత రోగులకు చేయూత అందించాలన్నారు. నెలలో మండలంలో నాలుగు సచివాలయాల్లో హెల్త్ క్యాంపులు నిర్వహించాలన్నారు. ఆరోగ్యశ్రీ చికిత్సల కోసం వెళ్లే రోగులకు ప్రయాణ ఛార్జీలు కూడా ఇవ్వాలన్నారు. ఆరోగ్య సురక్ష శిబిరాల్లోనే వికలాంగులకు సర్టిఫికెట్లు జారీ చేయాలన్నారు. కొత్త మెడికల్ కళాశాలల నిర్మాణాల పనుల్లో పురోగతిని సిఎంకు అధికారులు వివరించారు. ఈ సమావేశంలో వైద్యారోగ్యశాఖ మంత్రి విడదల రజిని, సిఎస్ కెఎస్ జవహర్‌రెడ్డి, వైద్యారోగ్యశాఖ స్పెషల్ సిఎస్ (ఎఫ్ఎసి) అజయ్‌జైన్, తదితరులు హాజరుకాగా, వైద్యారోగ్యశాఖ స్పెషల్ సిఎస్ ఎమ్‌టి కృష్ణబాబు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు.

నిర్వహణకు రూ.11.11 కోట్లు మంజూరు

'జగనన్న ఆరోగ్య సురక్ష' నిర్వహణకు ప్రభుత్వం రూ.11.11 కోట్లు మంజూరు చేసింది. గ్రామ సచివాలయాలు, మున్సిపల్ కమిషనర్లకు ఈ మొత్తాన్ని చెల్లించాలని పేర్కొంటూ గ్రామ, వార్డు సచివాలయాలశాఖ ఎమ్‌డి జి లక్ష్మీశ ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామ సచివాలయం, గ్రామ ఆరోగ్య క్లినిక్ (విహెచ్‌సి)కి రూ.20 వేలు, యుపిహెచ్‌సికి రూ.40 వేలు చొప్పున విడుదల చేయాలని పేర్కొన్నారు. ఖర్చు చేయలేకపోతే ఆయా మొత్తాలను చలానా ద్వారా హెచ్‌ఒఎ, డిడిఒలకు పంపాలని తెలిపారు.

క్షేమంగా స్వదేశానికి

- ఇజ్రాయిల్ నుంచి తొలి విడతలో 212 మంది భారతీయుల రాక
- వారిలో 10 మంది ఆంధ్రప్రదేశ్ వాసులు

7



నేటి నుంచి పాఠశాలలకు దసరా సెలవులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని పాఠశాలలకు శనివారం నుంచి దసరా సెలవులు ప్రారంభం కానున్నాయి. పాఠశాల విద్యాశాఖ అకడమిక్ క్యాలెండర్ ప్రకారం ఈ సెలవులు ఉన్నాయి. క్యాలెండర్ ప్రకారం ఈ నెల 24వ తేదీ వరకు దసరా సెలవులు ఉంటాయి. ఈ నెల 25వ తేదిన తిరిగి పాఠశాలలు పున:ప్రారంభం కానున్నాయి. మైనార్టీ విద్యాసంస్థలకు ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు దసరా సెలవులు ఉంటాయి.

బిజెపికి, ఇండియాకు టిడిపి సమదూరం అర్థరహితం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మతోన్మాద బిజెపి ఆధ్వర్యంలో ఎన్‌డిఎ కూటమికి, లౌకికవాద ఇండియా పక్షానికి సమదూరంలో ఉంటామని తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ప్రకటన అర్థరహితమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు అన్నారు. అమిత్‌షా మాటలు నమ్మి బిజెపి వలలో పడితే టిడిపి నష్టపోవడం తప్ప సాధించేదేమీ ఉండదన్నారు. తనను కలిసిన మీడియా వారితో శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఇండియా కూటమిలో చేరుతారా? లేదా? అనేది తెలుగుదేశం పార్టీ ఇష్టమని, సమదూరం పేరుతో మతోన్మాద బిజెపికి సానుకూలంగా వ్యవహరించడం ప్రమాదకరమని పేర్కొన్నారు. మతోన్మాదానికి, లౌకికవాదానికి సమదూరం పాటించడమంటే మతోన్మాదానికి మేలు చేయడమేనని, రాష్ట్రానికి బిజెపి చేసిన ద్రోహాన్ని విస్మరించడం అన్యాయమని విమర్శించారు. చంద్రబాబు అరెస్టుతో తమకు సంబంధం లేదని చెబుతున్న బిజెపి అధినాయకత్వం ఇంతకాలం ఎందుకు మౌనంగా ఉన్నదో చెప్పాలన్నారు. దాన్ని టిడిపి శ్రేణుల చేత నమ్మేలా చూడడం మోసకారితనం అవుతుందని అన్నారు. బిజెపి మతోన్మాదం, రాష్ట్రానికి చేసిన ద్రోహంపై టిడిపి శ్రేణులను తప్పుదారి పట్టించొద్దని టిడిపి నాయకత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇప్పటికైనా టిడిపి భవిష్యత్తు, రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని మతోన్మాద బిజెపిని వ్యతిరేకిస్తూ ముందుకు రావాలని కోరారు.

'అమరా ల్యాబ్'లో భారీ పేలుళ్లు : నలుగురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో : సంగారెడ్డి జిల్లా ఐడిఎ బొల్లారం పారిశ్రామికవాడలోని అమరా ల్యాబ్ పరిశ్రమలో శుక్రవారం రాత్రి పది గంటల సమయంలో భారీ పేలుళ్లు సంభవించాయి. రియాక్టర్లు పేలడంతో ఒక్కసారిగా భారీ శబ్దం వచ్చింది. దీంతో, పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులు భయంతో బయటకు పరుగులు తీశారు. పేలుళ్ల ధాటికి నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరికి 50 శాతంపైగా శరీరం కాలినట్లు సమాచారం. బొల్లారం సిఐ నయీముద్దీన్ ఘటనా స్థలానికి చేరుకుని వారిని ఆస్పత్రికి తరలించారు. ప్రమాద సమయంలో షిఫ్ట్‌లో 15 మంది ఉన్నట్టు సమాచారం.

బదిలీలైన సచివాలయ ఉద్యోగులకు వేతనాలు

- 'ప్రజాశక్తి' వార్తకు స్పందన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గడువు ముగిసిన తర్వాత బదిలీలైన ఉద్యోగులకు కూడా వేతనాలు చెల్లించాలంటూ గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్ స్పష్టం చేశారు. ఈ మేరకు ప్రభుత్వం జిఓ ఎంఎస్ నెంబరు 6ను విడుదల చేసింది. సబ్ ట్రెజరీ అధికారులు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో వేతనాలు చెల్లింపులు నిలిచిపోయిన సంగతి పాఠకులకు విదితమే. ఈ నేపథ్యంలో గ్రామ, వార్డు సచివాలయాల శాఖ విడుదల చేసిన జిఓలో10.06.2023 నుంచి 31.07.2023 వరకు బదిలీలైన ఉద్యోగులకు సంబంధించి రాటిఫికేషన్ ఇస్తూ రాష్ట్ర ట్రెజరీస్ అండ్ అకౌంట్స్, డైరెక్టరుకు ఉత్తర్వులిచ్చారు. 'బదిలీలు సరే.. రిలీవింగ్ ఎప్పుడు?' పలు ప్రాంతాల్లో ఉత్తర్వులివ్వని కలెక్టర్లు, బదిలీపై వెళ్లినా.. 3 నెలలుగా అందని వేతనాలు' అనే శీర్షికతో ఈ నెల 7న 'ప్రజాశక్తి'లో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఇబ్బందులను, బదిలీల గడువు దాటిన తర్వాత రిలీవైన వారికి మూడు నెలలుగా వేతనాలు అందని వైనాన్ని ప్రచురించిన సంగతి తెలిసిందే.

వాడిగా.. వేడిగా.. వాదనలు

- చంద్రబాబు పిటిషన్లపై విచారణ వాయిదా



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు దాఖలు చేసిన స్కిల్ డవలప్‌మెంట్ కేసులో క్వాష్ పిటిషన్, ఫైబర్ నెట్ కేసులో ముందస్తు బెయిల్ పిటిషన్‌పై సుప్రీంకోర్టులో వాడిగా.. వేడిగా.. వాదనలు సాగాయి. తదుపరి విచారణ మంగళవారానికి వాయిదా పడింది. స్కిల్ డవలప్‌మెంట్ కేసులో తనపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లను కొట్టేయాలని చంద్రబాబు సుప్రీంకోర్టులో దాఖలు చేసిన క్వాష్ పిటిషన్, ఫైబర్ నెట్ కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలని దాఖలు చేసిన పిటిషన్‌ను శుక్రవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ బేలా ఎం త్రివేదితో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. చంద్రబాబు తరపున న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా, సిఐడి తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి వాదనలు వినిపించారు. తొలుత క్వాష్ పిటిషన్‌పై సుదీర్ఘ వాదనలు జరిగాయి. ఎఫ్ఐఆర్ రద్దు చేయాలన్న అంశంపై ఎంపి గుప్తా కేసును ముకుల్ రోహత్గీ ప్రస్తావించారు. 'చట్టం అమలులో ఉన్నప్పుడు జరిగిన నేరాలకు పాత చట్టంలోని సెక్షన్స్ వర్తిస్తాయి. చట్టాన్ని రద్దు చేసినా.. వెనక్కి తీసుకున్నప్పటికీ నేరం జరిగినప్పటి చట్టమే వర్తిస్తుంది. కొత్త చట్టం అమలులోకి రాకముందే నేరం జరిగింది కాబట్టి సవరణ చట్టం ఈ కేసుకు వర్తించదు' అని రోహత్గి తెలిపారు. చంద్రబాబు తరపున సిద్ధార్థ లూథ్రా వాదిస్తూ.. 'కేసులపై కేసులు పెట్టి మమ్మల్ని సర్కస్ ఆడిస్తున్నారు. స్కిల్ కేసు విచారణకు ఫైబర్‌నెట్ కేసుతో సంబంధం ఉంది. మరో కేసులో చంద్రబాబును 16న ప్రవేశపెట్టేందుకు వారెంటు తీసుకున్నారు' అని లూథ్రా పేర్కొన్నారు. ఇక్కడ కూడా 17ఏను ఛాలెంజ్ చేస్తున్నారా? అని లూథ్రాను జస్టిస్ త్రివేది ప్రశ్నించగా.. అవును.. 17ఏ ప్రతిచోటా వర్తిస్తుందని లూథ్రా తెలిపారు. ఫైబర్ నెట్ కేసులో చంద్రబాబు ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ తరువాత చేస్తామని ధర్మాసనం పేర్కొంది. 17ఏ పూర్తిస్థాయి రక్షణేమీ కాదని, అది కేవలం చిన్నపాటి రక్షణే అని, కేసుపెట్టే అధికారమే పోలీసులకు లేనప్పుడు కేసు ఎలా ఫైల్ చేస్తారని జస్టిస్ బోస్ ప్రశ్నించారు. సుదీర్ఘ వాదనలు తరువాత తదుపరి విచారణను వచ్చే మంగళవారం (అక్టోబరు 17) మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేసింది.

ఆ తరువాత జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ బేలా ఎం త్రివేదితో కూడిన ధర్మాసనం ముందు ఫైబర్ నెట్ కేసులో చంద్రబాబు ముందస్తు మిగతా 2లో

చంద్రబాబు 5 కిలోల బరువు తగ్గారు

- ఏదైనా జరిగితే సిఎం, ప్రభుత్వానిదే బాధ్యత : టిడిపి నేతలు

కేజీ బరువు పెరిగారు

- సజ్జల రామకృష్ణారెడ్డి

రాజకీయ పార్టీ కార్యాలయాలుగా విశ్వవిద్యాలయాలు

బిజెపి, వైసిపి ప్రభుత్వాలు విద్యారంగానికి తీవ్ర ద్రోహం చేశాయి

సిపిఎం రాష్ట్ర స్థాయి విద్యారంగ సదస్సులో ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు

ప్రజాశక్తి- ఒంగోలు కలెక్టరేట్

కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వాలు విద్యారంగానికి తీరని ద్రోహం చేశాయని, మేధావులకు కేంద్రాలుగా ఉండాల్సిన విశ్వవిద్యాలయాలు వైసిపి హయాంలో రాజకీయ పార్టీ కార్యాలయాలుగా మారాయని పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు పేర్కొన్నారు. 'నేటి విద్యా రంగం-ప్రత్యామ్నాయ విధానాలు' అనే అంశంపై సిపిఎం ప్రకాశం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఒంగోలులోని అంబేద్కర్ భవన్‌లో శుక్రవారం జరిగిన రాష్ట్ర స్థాయిలో ఆయన ముఖ్యవక్తగా పాల్గొని ప్రసంగించారు. విశ్వవిద్యాలయాల అభివృద్ధిని పాలకులు గాలికి వదిలేశారని విమర్శించారు. ఖాళీ పోస్టులను భర్తీ చేయడం లేదని, వివిధ కోర్సులను ఎత్తివేస్తున్నారని వివరించారు. ప్రయివేటు, డీమ్డ్ విశ్వవిద్యాలయాలపై ప్రభుత్వ అజమాయిషీ తగ్గడంతో ఆ యూనివర్సిటీలు విద్యను వ్యాపారంగా మార్చేశాయని విమర్శించారు. అన్ని విద్యాసంస్థల్లో టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. విద్యా దీవెన, వసతి దీవెన ఫీజులు సకాలంలో రాక విద్యార్థులు ఫీజులు భారం మోయాల్సి వస్తోందన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ ఉన్నత విద్యలో కోర్సుల మూసివేతతో ప్రభుత్వ విద్య పేదవారికి దూరమవుతోందని తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీలు ప్రతి నియోజకవర్గంలో ఒకటి ఏర్పాటు చేయాలని కోరారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేరళ రాష్ట్రంలో అనుసరిస్తోన్న విద్యా విధానం దేశానికి గర్వకారణంగా నిలుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యావేత్త, మంగమ్మ కాలేజీ రిటైర్డ్ ప్రిన్సిపల్ ఎవి పుల్లారావు, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ పేరయ్య, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివి కొండారెడ్డి, సిపిఎం రాష్ట్ర నాయకులు కెప్రసన్నకుమార్, ఎ అశోక్ మాట్లాడారు. సదస్సుకు పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కంకణాలు ఆంజనేయులు అధ్యక్షత వహించారు.

పలు తీర్మానాలు ఆమోదం

రాష్ట్ర స్థాయి విద్యారంగ సదస్సులో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మిగతా 2లో

ఆ 95 మంది ఎత్తు మాన్యువల్‌గా కొలవండి

- నేడు, రేపు ఎస్ఐ మెయిన్స్ పరీక్షలు యథాతథం : హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి, అమరావతి బ్యూరో

ఎస్ఐ నియామక అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు తిరిగి నిర్వహించాలని పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డుకు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. డిజిటల్ మీటర్ సాయంతో కాకుండా పాత పద్ధతిలో మాన్యువల్‌గా ఎత్తు, ఛాతీ పరీక్షలు నిర్వహించాలని పేర్కొంది. 2019లో మాన్యువల్‌గా పరీక్ష నిర్వహించినప్పుడు అర్హత సాధించి, 2023లో అనర్హులైన అభ్యర్థులు పిటిషన్ దాఖలు చేసిన నేపథ్యంలో... ఆ 95 మందికి ఎత్తును తిరిగి కొలవాలని, ఈ ప్రక్రియ మూడు రోజుల్లో పూర్తి చేయాలని జస్టిస్ వి సుజాత శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 14, 15 తేదీల్లో మెయిన్స్ యథాతథంగా నిర్వహించాలని, అర్హత సాధించిన వారిని తదుపరి దశకు అనుమతించాలని ఆదేశించారు. హైకోర్టు అనుమతి నేపథ్యంలో ఈ నెల 14, 15 తేదీల్లో ఎస్ఐ మెయిన్స్ పరీక్షలు ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, తిరిగి మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు నిర్వహించనున్నారు.

వలంటీర్లతో ఇ-క్రాప్!

- రైతుమిత్ర పేరిట ఆర్‌బికెల పని
- సచివాలయాల నుంచి కేటాయింపు
- అక్రమాలకు ఆస్కారం
- వాస్తవ రైతులకు నష్టం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

వ్యవసాయశాఖ చేపట్టిన పంట నమోదుల ప్రక్రియ (ఇ-క్రాప్ బుకింగ్)లో గ్రామ వలంటీర్లు కీలకంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలొస్తున్నాయి. లబ్ధిదారుల ఇళ్లకు పథకాలను చేర్చేందుకు ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయ వలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టగా, ఆ వ్యవస్థను అధికార వైసిపి దుర్వినియోగం కావించి పార్టీ, వ్యక్తిగత ప్రయోజనాలకు ఉపయోగపెట్టుకుంటోందన్న విమర్శలున్నాయి. ఈ తరుణంలో రైతుల అన్ని పథకాలకూ తప్పనిసరి చేసిన ఇ-క్రాప్ బుకింగ్‌కు వలంటీర్లను వినియోగించడం వివాదాస్పదం అవుతోంది. రెగ్యులర్ ఉద్యోగులైన రైతు భరోసా కేంద్రాల (ఆర్‌బికె) సిబ్బంది (విఎఎ/విహెచ్ఎ/ విఎస్ఎ) కాకుండా వారి కనుసన్నల్లో పనిచేసే వలంటీర్లతో ఇ-క్రాప్ చేయిస్తున్నట్లు సమాచారం. దాంతో చాలా చోట్ల వాస్తవ సాగుదారుల స్థానంలో బోగస్, అనర్హులైన రైతుల పేర్లు ఎక్కిస్తున్నారు. ఈ తంతుకు పలు జిల్లాల్లోని ఉన్నతాధికారుల ప్రోత్సాహమూ ఉంటోంది. ఇ-క్రాప్‌నకు సర్కారు విధించిన డెడ్‌లైన్ చేరాలంటే వలంటీర్ల అవసరం తప్పనిసరి అవుతోందని చెబుతున్నారు. నకిలీ రైతులు రికార్డుల్లోకెక్కడంతో అనర్హులు ప్రభుత్వ లబ్ధిని కాజేస్తున్నారు. అర్హులు పథకాలు అందక నష్టపోతున్నారు. చివరికి తాము పండించిన పంటలను అమ్ముకోలేని దుస్థితి నిజమైన రైతులకు దాపురిస్తోంది.

ప్రత్యేక సేవా కార్యకర్తలు

ప్రభుత్వం ప్రతి సచివాలయ పరిధిలో నెలకొల్పిన ఆర్‌బికెల నిర్వహణకు (విఎఎ/విహెచ్ఎ/ విఎస్ఎ)లను శాశ్వత ప్రాతిపదికన నియమించింది. వీరు ఇ-క్రాప్, ఇతర ఫీల్డ్‌వర్క్‌లో ఉన్నప్పుడు ఆర్‌బికెలను నిర్వహించేందుకు గ్రామ సచివాలయ పరిధిలో పని చేసే వలంటీర్లలో ఒకరిని డిప్యూటేషన్‌పై ఆర్‌బికెలకు కేటాయిస్తూ గతేడాది ఆగస్టులో ప్రభుత్వం నిర్ణయించింది. స్థానిక ఎఒ, పంచాయతీ కార్యదర్శి, ఆర్‌బికె సహాయకుల సూచనల మేరకు ఎంపిడిఒ ఈ వలంటీర్లను వేయాలంది. పంటల సేకరణ సహా ఆర్‌బికెలలో పని చేసే వలంటీర్లకు 'రైతుమిత్ర'లుగా వ్యవహరించాలని స్వయాన ముఖ్యమంత్రే పేరు పెట్టారు. కొన్ని చోట్ల 'ఆర్‌బికె మిత్ర' అని కూడా మిగతా 2లో

స్వీపర్లకు జీతాలు చెల్లించాలి

- ఎపి ప్రభుత్వ పాఠశాలల, కళాశాలల శానిటేషన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు)

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మున్సిపల్ స్కూల్స్‌లో పనిచేస్తున్న స్వీపర్లకు ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాలల, కళాశాలల శానిటేషన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) కోరింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్‌కు యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయా రమాదేవి శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కనీస వేతనం అమలు చేయాలని, ప్రతినెలా ఐదో తేదీలోపు వేతనాలు చెల్లించాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. శానిటేషన్ పరికరాలు ప్రభుత్వమే సరఫరా చేయాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సంవత్సరానికి రెండు జతల యూనిఫాం ఇవ్వాలని కోరారు. స్కూల్ స్వీపర్స్ అందరినీ నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని, రాజకీయ వేధింపులు ఆపాలని కోరారు.

'స్కిల్' కేసును సిబిఐకి ఇవ్వాలి

- హైకోర్టులో ఉండవల్లి పిల్‌పై వాదనలు
- కేంద్ర, రాష్ట్రాలకు నోటీసులు

ప్రజాశక్తి-అమరావతి

ఎపి స్కిల్ డెవలప్‌మెంట్ కేసు దర్యాప్తును సిబిఐకి బదిలీ చేయాలంటూ మాజీ ఎంపి ఉండవల్లి అరుణ్ కుమార్ దాఖలు చేసిన పిల్‌లో ప్రతివాదులైన సిబిఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి), కేంద్ర హోంశాఖ కార్యదర్శి, సిఐడితో పాటు టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు ఇతరులకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది.

మాజీ మంత్రి అచ్చెన్నాయుడు, అప్పటి అధికారులు గంటా సుబ్బారావు, కె లక్ష్మీనారాయణ, నిమ్మగడ్డ వెంకట కృష్ణ ప్రసాద్, డిజైన్ టెక్ ఎమ్‌డి వికాస్ వినయ్ కన్వీల్కర్, సిమెన్స్ మాజీ ఎమ్‌డి సుమన్ బోస్, సంజయ్ డాగా, ఐఎఎస్ అధికారి అపర్ణ ఉపాధ్యాయ సహా మొత్తం 44 మందికి నోటీసులు ఇచ్చింది. కౌంటర్ దాఖలు చేయాలని వారిని ఆదేశించింది. విచారణను నవంబరు పదికి వాయిదా వేస్తూ శుక్రవారం జస్టిస్ యు దుర్గాప్రసాదరావు, జస్టిస్ ఎవి రవీంద్రబాబుతో కూడిన డివిజన్ బెంచ్ ఉత్తర్వులు జారీ చేసింది.

మరో పిటిషన్ మూసివేత

స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో నిందితుడిగా లేని కిలారి రాజేష్ తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు విచారణను మూసేసింది. నారా లోకేష్‌కు అత్యంత సన్నిహితుడైన కిలారి రాజేష్ వేసిన పిటిషన్‌ను జస్టిస్ కె సురేష్‌రెడ్డి విచారించారు. రాజేష్‌ను ఇప్పటి వరకు నిందితునిగా చేర్చలేదని, ఒకవేళ నిందితుడిగా చేర్చితే 41ఏ నోటీసు ఇస్తామని సిఐడి తరపున న్యాయవాది చెప్పారు. దీంతో రాజేష్ పిటిషన్‌పై విచారణ అవసరం లేదని, పిటిషన్‌ను మూసేస్తున్నామని హైకోర్టు ప్రకటించింది.

సోమవారం 'ట్యాబ్‌డే'

- విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రతి సోమవారం 'ట్యాబ్‌డే'గా నిర్వహించాలని ఉపాధ్యాయులను పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల పలు పాఠశాలలను సందర్శించిన సందర్భంలో విద్యార్థులు బైజూస్ యాప్, ట్యాబ్‌లను తక్కువగా వినియోగిస్తున్నారనే విషయాన్ని గమనించానని తెలిపారు. ఈ నేపథ్యంలో సైన్స్, సోషల్ సైన్స్, మేథ్స్ ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రతి వారాంతంలో హోంవర్క్ ఇవ్వాలని పేర్కొన్నారు. ఇచ్చిన ఎక్సర్ సైజులను ఎంతమంది విద్యార్థులు చేశారన్నది ప్రతి సోమవారం పాఠశాల ప్రారంభమైన మొదటి 15 నిమిషాల్లో విశ్లేషించాలని తెలిపారు.

వాడిగా.. వేడిగా వాదనలు

(మొదటి పేజీ తరువాయి)

బెయిల్ పిటిషన్‌పై వాదనలు జరిగాయి. చంద్రబాబు తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపిస్తూ.. ఫైబర్ నెట్ కేసులో ముగ్గురికి బెయిల్ వచ్చిందని తెలిపారు. ఇద్దరికి రెగ్యులర్ బెయిల్ వచ్చిందని, మరికొంతమంది ప్రస్తావన లేదని అన్నారు. అలాంటప్పుడు చంద్రబాబుకు బెయిల్ ఎందుకివ్వరని ప్రశ్నించారు. ఈ కేసులో సెక్షన్ 17ఏ ప్రస్తావన కూడా ఉన్నందున తదుపరి విచారణను మంగళవారం మధ్యాహ్నానికి వాయిదా వేస్తున్నట్లు జస్టిస్ అనిరుద్ధ బోస్ తెలిపారు. ఈ నేపథ్యంలో జోక్యం చేసుకున్న సిద్ధార్థ లూథ్రా 'మంగళవారానికి విచారణ వాయిదా వేయడం వల్ల ప్రయోజనం లేదు. చంద్రబాబును సోమవారం ఎసిబి కోర్టులో హాజరుపరుస్తున్నారు. కోర్టులో హాజరుపరిచాకా ముందస్తు బెయిల్ అన్న పదమే ఉత్పన్నం కాదు' అని అన్నారు. దీనికి స్పందించిన జస్టిస్ బోస్ 'మేం ఆర్డర్ పాస్ చేయట్లేదు కానీ, సోమవారం వరకు అరెస్టు చేయొద్దని చెప్పండి' అని సిఐడి తరపున న్యాయవాది రోహత్గీకి సూచించారు. 17ఏపై ఇంకా వాదనలు పూర్తి కానందున ఫైబర్ నెట్ కేసులో ఆదేశాలు ఇవ్వలేమని స్పష్టం చేశారు. విజయవాడ ఎసిబి కోర్టులో ఫైబర్ నెట్ కేసును బుధవారానికి వాయిదా వేయాలని, అప్పటి వరకు అరెస్టు చేయొద్దని సమాచారమిస్తామని సిఐడి తరపు న్యాయవాది రోహత్గీ కోర్టుకు తెలిపారు. అనంతరం కేసు తదుపరి విచారణను సుప్రీంకోర్టు మంగళవారానికి వాయిదా వేసింది.

చేతి వృత్తిదారులందరికీ సబ్సిడీ రుణాలివ్వాలి

- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్
- నవంబరు 27న కలెక్టరేట్ల వద్ద ఆందోళనలు



ఎంబివికెలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రధాన మంత్రి విశ్వకర్మ కౌసల్య యోజన పథకం కింద చేతివృత్తిదారులందరికీ 50 శాతం సబ్సిడీతో రుణాలు మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ చేతి వృత్తిదారుల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్ చేశారు. ఈ పథకానికి కేంద్ర ప్రభుత్వం రూ.50 వేలకోట్లు మంజూరు చేయాలని కోరారు. ఈ డిమాండ్లపై రౌండ్ టేబుల్ సమావేశాలు, సదస్సులు నిర్వహించాలని, నవంబరు 27 నుంచి 30 వరకు కలెక్టరేట్ల వద్ద ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని సమావేశం పిలుపునిచ్చింది. విశ్వకర్మ కౌసల్య యోజన పథకంపై ఎపి చేనేత కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి పి బాలకృష్ణ అధ్యక్షతన ఎంబి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎపి చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ కన్వీనరు ఎం భాస్కరయ్య మాట్లాడుతూ.. విశ్వకర్మ కౌసల్య యోజన ద్వారా కేంద్రప్రభుత్వం వడ్డీతో రుణాలు ఇవ్వడం వృత్తిదారులను మోసగించడమేనని అన్నారు. పెట్టుబడిదారులకు సుమారు రూ.10 లక్షల కోట్ల బ్యాంకు రుణాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 40 శాతంగా ఉన్న బిసి, వృత్తిదారులకు కేవలం రూ.13 వేల కోట్లను ఐదు శాతం వడ్డీతో రుణాలివ్వడం మోసగించడమేనని అన్నారు. కేంద్రం నిబంధనలు వల్ల రాష్ట్రంలో కేవలం 2.50 లక్షల మందికి మాత్రమే వర్తిస్తుందన్నారు. 50 శాతం సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని, 50 ఏళ్లు నిండిన వారికి సామాజిక సంక్షేమ వృద్ధాప్య పెన్షన్ పథకం అమలు చేయాలనే తీర్మానాలను ఎపి మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి కె శ్రీనివాసరావు, ఎపి కల్లుగీత కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి యర్ర దేముడు ప్రవేశపెట్టారు.

అనారోగ్యానికి గురైన చేనేత కార్మికునికి హెల్త్ ప్యాకేజీ రూపంలో ఐసిఐసిఐ లంబార్డు పథకం ద్వారా ఇచ్చే రూ.30 వేలను వెంటనే పునరుద్ధరించాలని సమావేశం తీర్మానించింది. సముద్ర, నదీ జల్లాల్లో 100 మీటర్ల లోతు వరకు ఇసుక, మోనోసైట్, గార్నెట్ 138 మిలియన్ ఖనిజ లోహాలు వెలికి తీసే విధానం వల్ల మత్స్య కార్మికుల ఉపాధికి నష్టం కలుగుతుందని, దీనిని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది. చేతి వృత్తి వస్తువులు, ఉత్పత్తి చేసే వృత్తిదారులకు మార్కెట్ సౌకర్యం కల్పించాలని తీర్మానించింది. మోడరైజేషన్ పేరుతో గ్రామాలు, పట్టణాల్లో ఉన్న ఖాళీ స్థలాలు, చెరువులు, కుంటలు పారిశ్రామిక వేత్తలకు అప్పగించడం, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల అభివృద్ధి కార్యక్రమాలకు ఉపయోగించుకోవడం విరమించుకోవాలని కోరింది. ఈ కార్యక్రమంలో ఎపి కల్లుగీత సంఘం రాష్ట్ర అధ్యక్షులు జె నర్సింహమూర్తి, ఆంధ్రప్రదేశ్ పెయింటింగ్ ఆర్టిస్టు వర్కర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రవి, ఎపి రజక వృత్తిదారుల సంఘం ఉపాధ్యక్షులు లింగాల నిర్మలమ్మ, రాష్ట్ర కోశాధికారి వి వెంకటేశ్వరావు, కౌరవృత్తిదారుల సంఘం నాయకులు చలపతిరావు తదితరులు పాల్గొని ప్రసంగించారు.

చంద్రబాబు 5 కిలోల బరువు తగ్గారు

- ఏదైనా జరిగితే సిఎం, ప్రభుత్వానిదే బాధ్యత
- టిడిపి నేతలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తమ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు డీహైడ్రేషన్, చర్మ సంబంధిత సమస్యల వల్ల జైల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, దీనివల్ల సుమారు ఐదు కిలోల బరువు తగ్గారని టిడిపి ముఖ్యనేతలు అన్నారు. ఆయన ప్రాణాలతో రాష్ట్ర ప్రభుత్వం చెలగాటమాడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. టిడిపి కార్యాలయంలో చంద్రబాబు ఆరోగ్య పరిస్థితిపై టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు, నేతలు కళా వెంకట్రావు, నక్కా ఆనంద్‌బాబు, దేవినేని, బోండా ఉమామహేశ్వరరావులు, వర్ల రామయ్య, పంచుమర్తి అనురాధ, బుద్దా వెంకన్న శుక్రవారం సమావేశమయ్యారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబు ఆరోగ్య పరిస్థితిపై ప్రభుత్వం వాస్తవాలు తొక్కిపెడుతోందని ఆరోపించారు. ఒకేసారి ఐదు కిలోల బరువు తగ్గడం ప్రమాదకరమని అన్నారు. చంద్రబాబును పరిశీలించిన ప్రభుత్వ వైద్యులు వాస్తవాలు చెప్పకుండా ప్రభుత్వం వారి గొంతు నొక్కేసిందని చెప్పారు. వచ్చిన సమస్యకు, వైద్యులు రాసిచ్చిన మందులకు సంబంధం లేదన్నారు. స్టెరాయిడ్స్ అధికంగా ఉన్న మందులను ఆయనకు రాసిచ్చారని పేర్కొన్నారు. ఉత్తమమైన వైద్య సేవలు అందించేలా చూడాలని న్యాయస్థానాన్ని కోరారు. తక్షణమే చంద్రబాబు వ్యక్తిగత వైద్యుల పర్యవేక్షణలో ఉండే ఏర్పాట్లు చేసి ఎయిమ్స్‌లో గానీ, ప్రైవేటు ఆస్పత్రిలో గానీ నాణ్యమైన వైద్య సేవలు అందే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. చంద్రబాబుకు ఏదైనా జరిగితే రాష్ట్రప్రభుత్వం, ముఖ్యమంత్రే బాధ్యత వహించాలని హెచ్చరించారు. చంద్రబాబు ఆరోగ్యం గురించి మాట్లాడేందుకు సమయం ఇవ్వాలని జైళ్లశాఖ డిజితోపాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హోంశాఖ ముఖ్య కార్యదర్శి, రాజమండ్రి జైల్ సూపరింటెండెంటుకు అచ్చెన్నాయుడు లేఖ రాశారు.

చంద్రబాబు ప్రాణాలకు ముప్పు : లోకేష్, బాలకృష్ణ

చంద్రబాబు ప్రాణాలకు ముప్పు ఉందని టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, పొలిట్‌బ్యూరో సభ్యులు నందమూరి బాలకృష్ణ, చంద్రబాబు సతీమణి భువనేశ్వరి వేర్వేరు ప్రకటనల్లో ఆందోళన వ్యక్తం చేశారు. నెల రోజుల్లో ఐదు కేజీల బరువు తగ్గడం ఆందోళన కలిగిస్తోందన్నారు. చంద్రబాబుకు స్టెరాయిడ్స్ ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. చంద్రబాబు ఆరోగ్యం పట్ల తమకు ఆందోళనగా ఉందని నారా బ్రాహ్మణి మరో ప్రకటనలో పేర్కొన్నారు.

చంద్రబాబు భద్రత, ఆరోగ్య పరిస్థితిపై గవర్నరుకు లేఖ

చంద్రబాబుకు భద్రత, ఆరోగ్యం విషయంలో జోక్యం చేసుకోవాలని కోరుతూ గవర్నరు ఎస్ అబ్దుల్ నజీర్‌కు వైసిపి ఎంపి రఘురామ కృష్ణరాజు లేఖ రాశారు. ఆయన ఆరోగ్యాన్ని దెబ్బతీసేందుకు హానికర స్టెరాయిడ్లు ఇస్తున్నట్లు వార్తలు వస్తున్నాయని, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో వైద్యం అందించేలా ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు.

కేజీ బరువు పెరిగారు

- సజ్జల రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

టిడిపి అధ్యక్షులు చంద్రబాబునాయుడు బరువు తగ్గలేదని, ఒక కేజీ బరువు పెరిగారని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. తాడేపల్లిలోని వైసిపి రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్‌లోని స్టార్ ఆసుపత్రుల్లో చేర్పించాలనేది టిడిపి నేతల స్కెచ్ అని, అందుకే చంద్రబాబు ప్రాణాలకు ముప్పు అంటూ దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. షర్ట్ కూడా విప్పని చంద్రబాబుకు ఉక్కపోతతో స్కిన్ ర్యాషెస్ వచ్చాయని, వైద్యులు అవసరమైన అన్ని ఔషధాలు అందిస్తున్నారని తెలిపారు. ఇదే విషయాన్ని జైళ్లశాఖ డిఐజి స్వయంగా చెప్పారన్నారు. జైలులో ఎసిలు పెట్టడానికి జైలు మీ అత్తగారిల్లా? డీ హైడ్రేషన్ ఏమైనా ప్రాణాంతకమా? అని ఆయన ప్రశ్నించారు. చంద్రబాబుకు డీ హైడ్రేషన్ వచ్చిందని నిన్న మొదలు పెట్టి, నేడు దానికి పరాకాష్టగా తన తండ్రికి స్టెరాయిడ్స్ ఇచ్చి చంపే ప్రయత్నం చేస్తున్నారని లోకేష్ ట్వీట్ చేశారన్నారు. కక్షసాధింపు చర్యలు తమకు అలవాటు లేదని అన్నారు. పూర్తి సాక్ష్యాధారాలతో చంద్రబాబును సిఐడి అరెస్టు చేసి కోర్టు ముందు ప్రవేశపెట్టిందని, వాటిని పరిశీలించిన అనంతరమే రిమాండ్‌కు పంపారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థలు స్కామ్‌ను వెలికితీశాయని చెప్పారు. అసలు విషయాలను డైవర్ట్ చేయడానికి చంద్రబాబు అరెస్టుకు రాజకీయ ఉద్దేశాలు ఆపాదిస్తున్నారని ఆరోపించారు.



భువనేశ్వరిని పరామర్శిస్తున్న అశోక్‌గజపతిరాజు, కుటుంబ సభ్యులు

ప్రజాస్వామ్యాన్ని కాపాడే బాధ్యత కేంద్రానిదే

- కేంద్ర మాజీ మంత్రి అశోక్‌గజపతిరాజు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం ప్రతినిధి

దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత కేంద్రానిదేనని కేంద్ర మాజీ మంత్రి, టిడిపి సీనియర్ నేత పూసపాటి అశోక్‌గజపతిరాజు అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరిని ఆయన కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం పరామర్శించారు. అనంతరం మీడియాతో అశోక్‌గజపతిరాజు మాట్లాడుతూ.. చంద్రబాబును అరెస్టు చేసిన రోజు, ఆయనపై రేప్ కేసు తప్ప అన్ని సెక్షన్లు పెట్టారన్నారు. 'అక్రమంగా జైల్లో పెట్టిన వ్యక్తికి కనీసం మంచినీళ్లు కూడా ఇవ్వరా? చంద్రబాబు పట్ల ఈ ప్రభుత్వం అమానుషంగా వ్యవహరిస్తోంది' అని విమర్శించారు. ఎవరి బెదిరింపులకు లొంగేది లేదని, న్యాయం కోసం పోరాడతామని పేర్కొన్నారు. రాష్ట్రంలో రాజ్యాంగ హక్కుల ఉల్లంఘన జరుగుతోందని, మానవ హక్కులను సైతం హరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చట్టాలు ఎవరికీ చుట్టాలు కాదని, ప్రజాస్వామ్యాన్ని కాపాడడం అందరి బాధ్యత అని అన్నారు. తెలుగువారి కోసం ఎన్‌టిఆర్ టిడిపిని స్థాపించారు.. తెలుగు ప్రజల కోసం టిడిపి ఎప్పుడూ పోరాడుతూనే ఉంటుందని పేర్కొన్నారు.

తెలుగు రాష్ట్రాల్లో దళితులపై పెరిగిన దాడులు

15న కాకినాడలో రాష్ట్ర దళిత సదస్సు : మాల్యాద్రి



దళిత సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాల్యద్రి, తదితరులు

ప్రజాశక్తి - కాకినాడ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉదాసీనత వైఖరి వల్లే తెలుగు రాష్ట్రాల్లో దళితులపై దాడులు, హత్యలు, అత్యాచారాలు పెరిగిపోయాయని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అంద్ర మాల్యాద్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 15న కాకినాడలో రాష్ట్ర దళిత సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్యవక్తలుగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు పాల్గొననున్నారని తెలిపారు. కాకినాడలోని సుందరయ్య భవన్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో రెండోసారి బిజెపి అధికారంలోకొచ్చిన తర్వాత దేశ వ్యాప్తంగా మతోన్మాదమూకలు పేట్రేగిపోతున్నాయన్నారు. దళితులకు రక్షణగా ఉన్న చట్టాలను బిజెపి సర్కారు నీరుగారుస్తోందని విమర్శించారు. ఇంతవరకు బిజెపి పాలిత రాష్ట్రాలకే పరిమితమైన దాడులు, నేడు తెలుగు రాష్ట్రాలకూ విస్తరించాయని తెలిపారు.

అనంతరం రాష్ట్ర దళిత సదస్సు పోస్టర్‌ను నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కెఎస్.శ్రీనివాస్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కె.సింహాచలం పాల్గొన్నారు.

ప్రముఖ పర్యాటక కేంద్రంగా కొండవీడు

- సిఎస్ జవహర్‌రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పల్నాడు జిల్లా దగ్గర్లోని కొండవీడు కోటను ప్రముఖ పర్యాటక కేంద్రంగా అన్ని విధాలా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి పేర్కొన్నారు. కొండవీడు కోట ఇకో టూరిజం పార్కు సహా ఇతర అభివృద్ధి పనులపై శుక్రవారం విజయవాడ క్యాంపు కార్యాలయంలో ఆయన సంబంధిత శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. 13, 14 శతాబ్దాలకు చెందిన ఈ కొండవీడు కోటను దేశ, విదేశీ పర్యాటకులను ఆకర్షించే రీతిలో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఇప్పటి వరకూ చేపట్టిన అప్రోచ్ రోడ్లు, ఇతర అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. అదే విధంగా పర్యాటకానికి కనీస వసతులైన తాగునీరు, మరుగుదొడ్లను అందుబాటులోకి తేవాలని సిఎస్ ఆదేశించారు. దేవాదాయశాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న లక్ష్మీ నరసింహస్వామి ఆలయం, ఆర్కియాలజీ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న శివాలయం పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. కోట ఆవరణలో సౌండ్ అండ్ లైటింగ్ వంటి సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురావాలని, కోట చుట్టూ పెద్దఎత్తున సుందరీకరణతోపాటు పార్కులు, ల్యాండ్ స్కేపింగ్ వంటివి అభివృద్ధి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పిసిసిఎస్ వై మధుసూదన్‌రెడ్డి, ఆర్కియాలజీ శాఖ ముఖ్య కార్యదర్శి వాణీమోహన్, పర్యాటకశాఖ ఎమ్‌డి కన్నబాబు, దేవాదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఎయిర్‌పోర్టులో దాడి కేసుపై అప్పీల్

ప్రజాశక్తి-అమరావతి / లీగల్ రిపోర్టర్ (విశాఖపట్నం)

విశాఖ ఎయిర్‌పోర్టులో తనపై జరిగిన హత్యాయత్నం వెనుక కుట్ర కోణాన్ని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) విచారణ చేసేలా ఉత్తర్వులు ఇవ్వాలన్న పిటిషన్‌ను విజయవాడ ఎన్ఐఎ కోర్టు కొట్టేయడాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హైకోర్టులో సవాల్ చేశారు. విశాఖలోఘటనపై అక్కడి ఎన్ఐఎ కోర్టు విచారణ చేయాలని, పరిధి లేని విజయవాడ కోర్టు విచారణ చేయడం చెల్లదని గురువారం దాఖలు చేసిన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై హైకోర్టు రిజిస్ట్రీ అభ్యంతరం తెలిపి, పిటిషన్‌కు నెంబరు కేటాయించేందుకు నిరాకరించింది. శుక్రవారం జస్టిస్ కె శ్రీనివాస్‌రెడ్డి విచారణ జరిపి రిజిస్ట్రీ అభ్యంతరాన్ని తోసిపుచ్చారు. పిటిషన్‌కు నెంబరు కేటాయించాలని రిజిస్ట్రీని ఆదేశించారు. విచారణను ఈ నెల 17కు వాయిదా వేశారు.

హత్యాయత్నం కేసు 27కు ఎన్ఐఎ కోర్టు వాయిదా

జగన్‌మోహన్‌రెడ్డిపై కోడి కత్తితో హత్యాయత్నం కేసు విచారణ వాయిదా పడింది. ఈ కేసు విచారణను ఎన్ఐఎ కేసుల విచారణ ప్రత్యేక కోర్టు ఈ నెల 27కు వాయిదా వేసింది. ఈ కేసును మూడో అదనపు జిల్లా న్యాయమూర్తి, ఎన్ఐఎ కేసుల విచారణ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి శుక్రవారం విచారణ చేపట్టారు. విచారణ అనంతరం ఆ కేసును న్యాయమూర్తి వాయిదా వేశారు. తొలుత నిందితుడు శ్రీనివాసరావును విశాఖ సెంట్రల్ జైలు నుంచి తీసుకొచ్చి కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసుపై మరింత లోతుగా దర్యాప్తు చేయాలని జగన్ తరపున న్యాయవాదులు వేసిన పిటిషన్‌ను కోర్టు తిరస్కరించింది. ఈ ఉత్తర్వులపై జగన్‌మోహన్‌రెడ్డి హైకోర్టులో ఛాలెంజ్ చేశారు.



సదస్సును జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న వాణిమోహన్

శాస్త్రీయ అవగాహనతో మానసిక రుగ్మతలకు విముక్తి

- సీనియర్ సైకియాట్రిస్ట్ డాక్టర్ రమణారావు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రస్తుత సమాజంలో మానసిక వ్యాధులు బాగా పెరిగిపోతున్నాయని సీనియర్ సైకియాట్రిస్ట్ డాక్టర్ ఎన్.వి.రమణారావు ఆవేదన వ్యక్తం చేశారు. శాస్త్రీయ అవగాహనతోనే మానసిక రుగ్మతలకు విముక్తి అని తెలిపారు. గుంటూరులోని శ్రీ కన్వెన్షన్ సెంటర్‌లో ఇండియన్ సైకియాట్రి సొసైటీ సౌత్ జోన్ నిర్వహించిన తొలి రోజు శుక్రవారం నిరంతర వైద్యవిద్యా కార్యక్రమాన్ని డాక్టర్ రమణారావు ప్రారంభించారు. సైకియాట్రి సొసైటీ సౌత్ జోన్ అధ్యక్షులు డాక్టర్ కె ఉదయ్ కుమార్ అధ్యక్షత వహించారు. డాక్టర్ రమణారావు ప్రసంగాన్ని కొనసాగిస్తూ.. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ తగ్గిపోవడం, చిన్న వయసులోనే స్వతంత్రత పెరిగిపోవడంతో జీవితంలో ఎదురయ్యే సమస్యలను ఎదుర్కొనే అనుభవంలేక నేటి యువత మానసిక వ్యాధుల బారినపడుతున్నారని తెలిపారు. శాస్త్రీయ అవగాహనతో మానసిక వ్యాధులను నిరోధించాలని సూచించారు. సాయంత్రం జరిగిన సదస్సును రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి వాణిమోహన్ ప్రారంభించి మాట్లాడారు. పిల్లలకు తల్లిదండ్రులు తగిన సమయం కేటాయించకపోవడం, వారిపై విపరీతమైన ఒత్తిడి పెంచడంతో పాఠశాల స్థాయిలోనే మానసిక రుగ్మతలకు గురవుతారని తెలిపారు. మధ్యతరగతి ప్రజల జీవన విధానంలో తలెత్తుతున్న ఆర్థిక ఇబ్బందులు, వృత్తిపర విషయాలు, సమాజంలోని క్రమశిక్షణ రాహిత్యం, వృత్తిపరమైన నైపుణ్యత లోపాలు మానసిక ఆందోళనకు కారణమవుతాయని వివరించారు. చివరకు మానసిక వ్యాధులుగా బయటపడుతున్నాయని చెప్పారు. తొలిదశలోనే మానసిక వైద్యులను సంప్రదించడం ద్వారా మానసిక వ్యాధుల ప్రమాదాలను అరికట్టవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ సౌత్ జోన్ అధ్యక్షులు డాక్టర్ కె ఉదయ్, సౌత్ జోన్ ఉపాధ్యక్షులు డాక్టర్ అభయ్ మత్కర్, సౌత్ జోన్ కాన్ఫరెన్స్ చైర్మన్ డాక్టర్ ఐ.వి.ఎల్ నరసింహారావు, సైకియాట్రిస్టులు డాక్టర్ శరత్ చంద్ర, డాక్టర్ ఫణిభూషణ్‌రావు పాల్గొన్నారు.

చంద్రబాబు ఆరోగ్యంగానే ఉన్నారు

- తప్పుడు వార్తలు ప్రచారం చేస్తే చర్యలు తప్పవు
- జైళ్లశాఖ డిఐజి రవికిరణ్

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

స్కిల్ స్కామ్ కేసులో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న చంద్రబాబు నాయుడు ఆరోగ్యంగానే ఉన్నారని జైళ్ల శాఖ డిఐజి రవికిరణ్ తెలిపారు. ఆయన ఆరోగ్యంపై ఉద్దేశపూర్వకంగా ఎవరైనా తప్పుడు వార్తలు ప్రచారం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సెంట్రల్ జైలులోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా ఎస్‌పి జగదీష్‌తో కలిసి జైళ్ల శాఖ డిఐజి రవికిరణ్ శుక్రవారం మీడియాతో మాట్లాడారు. చంద్రబాబును హై ప్రొఫైల్ ఖైదీగానే ట్రీట్ చేస్తున్నామని తెలిపారు. ఆయన ఉంటున్న బ్యారక్ చాలా విశాలంగా ఉంటుందని, ఎనిమిది ఫ్యాన్లు ఏర్పాటు చేశామని చెప్పారు. జైలు నిబంధనల ప్రకారం ఎసిలు, కూలర్లు ఏర్పాటు చేయలేమని చెప్పారు. జైలులో తాగునీటికి ఎలాంటి సమస్య లేదని, జైలులో ఉన్న 2,100 మంది ఖైదీలూ అదే నీటిని తాగుతున్నారని తెలిపారు. కలుషితమై ఉంటే వారందరికీ కూడా అనారోగ్య సమస్య తలెత్తేవని చెప్పారు. చంద్రబాబుకు స్కిన్ సమస్య రావడంతో ప్రభుత్వ వైద్యులతో వైద్యం చేయించామని తెలిపారు. తాగునీరు, భోజన విషయంలో నిబంధనల మేరకు వ్యవహరిస్తున్నామన్నారు. జైలులోకి డ్రోన్ వచ్చిందనే వార్త అవాస్తవమని, జైలులో ఎటువంటి భద్రతా లోపాలూ లేవని, తమపై ఎలాంటి వత్తిళ్లూ లేవని చెప్పారు. చంద్రబాబుకు రోజుకు మూడుసార్లు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. చంద్రబాబును జైలుకు తీసుకొచ్చినప్పుడు 66 కిలోలు ఉన్నారని, ప్రస్తుతం 67 కిలోల బరువు ఉన్నారని తెలిపారు. విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇస్తూ ఏ మందులు ఇస్తున్నారనేది డాక్టర్‌కు, పేషెంట్‌కు మధ్య ఉండే ప్రైవసీ అని అన్నారు. 'చంద్రబాబుకు థ్రెట్' అంటూ లోకేష్ చేసిన ట్వీట్ పూర్తిగా అవాస్తవమని అన్నారు. డీ హైడ్రేషన్‌కు గురి కాకుండా ఉండేందుకు చంద్రబాబుకు ఒఆర్ఎస్ అందిస్తున్నామని తెలిపారు.

నిర్మాణాత్మకంగా సిబిఎస్ఇ పాఠ్య ప్రణాళికలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో సిబిఎస్ఇ ప్రవేశపెట్టిన ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు మార్గదర్శకంగా ఉండేలా పాఠ్య ప్రణాళికలను నిర్మాణాత్మకంగా, ప్రభావవంతంగా ఆకర్షణీయంగా తయారు చేయాలని పాఠశాల విద్యాశాఖ కమిషనరు ఎస్ సురేష్‌కుమార్ అన్నారు. సిబిఎస్ఇ పాఠశాలల ఉపాధ్యాయులకు బోధన నైపుణ్యాన్ని మెరుగుపరిచేందుకు సమగ్ర శిక్షా ఆధ్వర్యాన విజయవాడలో మూడు రోజులపాటు జరిగిన రాష్ట్రస్థాయి శిక్షణ శిబిరం శుక్రవారం ముగిసింది. ఈ కార్యక్రమంలో కమిషనరు మాట్లాడుతూ.. సిబిఎస్ఇ అమలుతీరుపై జవహర్ నవోదయ, కేంద్రీయ విద్యాలయ, ఏకలవ్య మోడల్ పాఠశాలల ప్రిన్సిపల్స్‌తో చర్చించి తమ పాఠశాలలను కూడా తదనుగుణంగా తీర్చిదిద్దేందుకు ఆలోచిస్తున్నామన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రాష్ట్రప్రభుత్వం తీసుకొస్తున్న మార్పులను సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. మార్పులకు అనుగుణంగా నైపుణ్యాలు మెరుగుపరుచుకునేందుకు అవసరమైన శిక్షణ ఇస్తామన్నారు.

రాజకీయ పార్టీ కార్యాలయాలుగా విశ్వవిద్యాలయాలు

(మొదటి పేజీ తరువాయి)

జివి.కొండారెడ్డి ప్రవేశపెట్టిన తీర్మానాలను ప్రతినిధులంతా ఆమోదించారు.

- కెజి నుంచి పిజి వరకు ఉచిత విద్య ప్రభుత్వమే అందించాలి.
- కేంద్రం తీసుకొచ్చిన కొత్త విద్యా విధానం రద్దు చేసి తక్షణం 3, 4, 5 తరగతుల విలీనం ఆపాలి
- ఉన్నత విద్యలో సామాజిక అవసరాలకు అనుగుణంగా కొత్త కోర్సులు ప్రవేశపెట్టాలి.
- యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిని కాపాడి నిధులు కేటాయించాలి. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలి.
- ప్రభుత్వ బడులను అభివృద్ధి చేయాలి. కార్పొరేట్ విద్యాసంస్థలపై ప్రభుత్వ జోక్యం పెరగాలి. ఫీజు నియంత్రణ చట్టం అమలు చేయాలి.
- బడ్జెట్ విద్యా సంస్థలకు ప్రభుత్వం ప్రోత్సాహం అందించాలి.
- హాస్టల్ విద్యార్థులకు పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలు పెంచాలి. సొంత భవనాలు నిర్మించి ట్యూటర్లను నియమించాలి.
- రద్దు చేసిన ఎయిడెడ్ విద్యా సంస్థలను తిరిగి ప్రారంభించాలి.
- జిఒ నెంబర్ 77 రద్దు చేసి పిజి విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ కల్పించాలి.
- ఆంధ్ర కేసరి యూనివర్సిటీకి నిధులు కేటాయించి నిర్మాణం చేపట్టాలి.
- విద్యలో కేరళ వామపక్ష ప్రభుత్వం దేశానికి ఆదర్శంగా నిలిచింది. విద్యలో 94 శాతం అక్షరాస్యత సాధిస్తూ అగ్రభాగాన నిలిచింది. కేరళ తరహా విద్యావిధానం మన రాష్ట్రంలో అమలు చేయాలి.

వలంటీర్లతో ఇ-క్రాప్!

(మొదటి పేజీ తరువాయి)

పిలుస్తున్నారు. ఆర్‌బికెలలో పని చేసే వలంటీర్లు ఇంటర్ పాస్ కావడంతో పాటు జీవశాస్త్రం లేక బయాలజీ సబ్జెక్టు చదివి ఉండాలన్నారు.

సూపర్‌వైజరీ వారికే

ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన రివ్యూ మీటింగ్‌లో ఆర్‌బికెలకు కేటాయించిన వలంటీర్లు విధులకు హాజరు కావట్లేదని పలువురు డిఎఒలు ఫిర్యాదు చేసిన దరిమిలా, వలంటీర్ల పారితోషికానికి ఆర్‌బికె సహాయకుల డ్యూటీ/అటెండెన్స్ సర్టిఫికెట్ ఇవ్వాలన్న నిబంధన విధించారు. దాంతో తప్పనిసరిగా వలంటీర్లు ఆర్‌బికె సహాయకులు చెప్పిన పని చేయాల్సి వస్తోంది. ఇ-క్రాప్ సాధన కోసం ఆర్‌బికె సిబ్బంది తమకు అప్పగించిన వలంటీర్లతో ఇ-క్రాప్ చేయిస్తున్నారని ఆరోపణలొస్తున్నాయి. డేటా డౌన్‌లోడ్ చేసిన సిస్టమ్స్‌ను పాస్‌వర్డ్‌లు, లాగిన్ ఐడిలతో సహా వలంటీర్లకు ఇచ్చేస్తున్నారు. విఆర్‌ఒ, ఎ.ఒ., ఆపై అధికారులు సైతం సూపర్‌వైజరీ చెక్స్, తనిఖీలు, పరిశీలనల పనిని చాలా చోట్ల వలంటీర్లకే అప్పగిస్తున్నట్లు ఆరోపణలొస్తున్నాయి. ప్రస్తుతం ఖరీఫ్ పంట నమోదులు నడుస్తున్నాయి. ఈ నెల 18 లోపు పూర్తి చేసి ఆర్‌బికెలలో ముసాయిదా జాబితాలు పెట్టాలని డెడ్‌లైన్ పెట్టారు. బోగస్, నకిలీ, అనర్హులు ఇ-క్రాప్‌లో ఎక్కితే అక్రమాలకు ఆస్కారం ఏర్పడుతుందని, అసలైన రైతులు, కౌలు రైతులు నష్టపోయే ప్రమాదం ఉందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

వైఎస్ విజయమ్మకు తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి-సంతమాగులూరు (బాపట్ల జిల్లా)

సిఎం జగన్‌మోహన్‌రెడ్డి తల్లి వైఎస్.విజయమ్మకు ప్రమాదం తప్పింది. శుక్రవారం ఆమె హైదరాబాద్ నుంచి ఒంగోలుకు కారులో బయలుదేరారు. మార్గమధ్యలో బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలంలోని అడ్డరోడ్డు జంక్షన్ సమీపం వద్దకు రాగానే కారు డ్రైవర్ సడన్‌గా బ్రేక్ వేశాడు.

దీంతో, ఆమె కాన్వాయ్‌లోని మరో కారు వెనుక నుంచి ఢీ కొట్టింది. దీంతో విజయమ్మ ప్రయాణిస్తున్న కారు వెనుక భాగం దెబ్బతిన్నది. విజయమ్మతో పాటు కారులో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి ప్రమాదమూ జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

'మ్యాపింగ్' పూర్తి చేయండి

- గ్రామ, వార్డు సచివాలయాల శాఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఒక సచివాలయం పరిధి నుంచి మరొక సచివాలయం పరిధిలోకి నివాసం మారిన వారికి సంబంధించి హౌస్‌హోల్డ్ క్లస్టర్స్ మ్యాపింగ్ ప్రక్రియ పెండింగ్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపిడిఒలకు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ సూచించింది. ఇందుకు సంబంధించిన సచివాలయాల సిబ్బందికి సూచనలు చేయాలని పేర్కొంది. ఈ మేరకు శుక్రవారం ఆ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. స్పందన కార్యక్రమంలో క్లస్టర్ మ్యాపింగ్ పెండింగ్‌లో ఉన్నట్లు ప్రభుత్వానికి పెద్దయెత్తున ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం హౌస్‌హోల్డ్ క్లస్టర్స్ మ్యాపింగ్ ప్రక్రియ పెండింగ్ లేకుండా చూడాలన్నారు. పెండింగ్ ప్రక్రియ పూర్తి చేయకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

బ్రిటన్‌తో తుది దశలో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం


- వాణిజ్య శాఖ కార్యదర్శి వెల్లడి

న్యూఢిల్లీ : బ్రిటన్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం చర్చలు తుది దశలో ఉన్నాయని వాణిజ్య శాఖ కార్యదర్శి సునీల్ బర్త్వాల్ వెల్లడించారు. ప్రస్తుతం 13వ రౌండ్ చర్చలు జరుగుతున్నాయన్నారు.

ముఖ్యమైన 26 చాప్టర్లకు సంబంధించి ఇరు దేశాల మధ్య చర్చలు పూర్తయ్యాయని తెలిపారు. ఇంకా మిగిలిన అంశాలపై ఉన్నత స్థాయిలో చర్చలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ప్రస్తుతం ఇరు దేశాల మధ్య 20 బిలియన్ డాలర్ల పైగా ఉంది.

కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్న పాలకులు

- ప్రతి కుటుంబానికీ రెండు ఎకరాల సాగు భూమి ఇవ్వాలి
- రాష్ట్ర భూ సదస్సులో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు బి. వెంకట్


సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు బి. వెంకట్

ప్రజాశక్తి -పెనుకొండ (శ్రీ సత్యసాయి జిల్లా)

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ల కొమ్ము కాస్తున్నాయని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్ విమర్శించారు. శ్రీసత్య సాయి జిల్లా పెనుకొండలో సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్ర భూ సదస్సు నిర్వహించారు. తొలుత పట్టణ పురవీధుల్లో భారీ ప్రదర్శన చేపట్టారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ అధ్యక్షతన పేదలకు భూమి, ఇల్లు కోసం రాష్ట్ర సదస్సు నిర్వహించారు. సదస్సులో బి.వెంకట్ మాట్లాడుతూ.. ప్రతి కుటుంబానికి రెండు ఎకరాల సాగు భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు పేదలకు సాగు భూములు పంచడంలో పూర్తి విఫలమయ్యాయన్నారు. భూములు ఇస్తారా? లేక దున్నుకోమంటారా? అని ప్రభుత్వాన్ని నిలదీశారు. సెజ్‌ల పేరుతో భూములను తీసుకుంటూ పేదలకు భూముల్లేకుండా చేస్తున్నారని తెలిపారు. అభివృద్ధికి, పరిశ్రమల ఏర్పాటుకు సిపిఎం వ్యతిరేకం కాదన్నారు. పేదలకు, పెత్తందారులకు మధ్య యుద్ధం జరుగుతోందని, పెత్తందారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొమ్ముకాస్తున్నాయని విమర్శించారు. పేదలకు ఇళ్ల స్థలాలతోపాటు ఇంటి నిర్మాణానికి సంబంధించి కేంద్రం రూ.5 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలు మొత్తం రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేరళలో ఎర్రజెండా ప్రభుత్వం ఇళ్ల నిర్మాణానికి రూ 7,40,000 ఇస్తోందన్నారు. కేరళలో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా 13 రకాల వస్తువులను పంపిణీ చేస్తున్నారని, మన రాష్ట్రంలోనూ ఇలాగే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. పేదలకు భూ పంపిణీ జరిగేంత వరకు ఇళ్ల స్థలాలు దక్కేంతవరకు సిపిఎం వారికి అండగా ఉండి పోరాడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కర్ణాటక రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ముని వెంకటప్ప, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె. ప్రభాకర్ రెడ్డి, వి. రాంభూపాల్, రాష్ట్ర కమిటీ సభ్యులు దడాల సుబ్బారావు, సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ పాల్గొన్నారు.



మోతుగూడెంలో నిరసన తెలుపుతున్న విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు

విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి - సీలేరు, మోతుగూడెం (అల్లూరి సీతారామరాజు జిల్లా)

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అల్లూరి జిల్లా జికె వీధి మండలంలోని సీలేరు, చింతూరు మండలంలోని మోతుగూడెంల్లో సిఐటియు ఆధ్వర్యాన విద్యుత్తు కాంట్రాక్టు కార్మికులు శుక్రవారం ఆందోళనలు చేశారు. తొలుత నిరసన ర్యాలీలు నిర్వహించారు.

ఎపి జెన్‌కో యాజమాన్యం తక్షణమే తమ డిమాండ్లను నెరవేర్చాలని పెద్దపెట్టున నినదించారు. విద్యుత్తు శాఖ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఆయా చోట్ల జరిగిన కార్యక్రమాల్లో సిఐటియు నాయకులు చింతా రాంబాబు, జె రత్నాకర్, బివి రమణ మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. 2002 పిఆర్‌సి ప్రకారం మినిమం స్కేలు అమలు చేయాలని, నేరుగా యాజమాన్యమే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎపి జెన్‌కో ఆస్పత్రిలో ఉచితంగా వైద్య సేవలు అందించాలని, పీస్ వర్క్ విధానాన్ని రద్దుచేసి మ్యాన్ పవర్‌గా మార్చాలని కోరారు. కార్యక్రమాల్లో సంఘం నాయకులు బి లక్ష్మణ్, టి విష్ణు, మల్లేష్, సన్యాసిరావు, సతీష్, మహేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి పొన్నాల రాజీనామా

- అభ్యర్థుల ఎంపికలో అవకతవకలు జరిగాయని ఆరోపణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



కాంగ్రెస్ పార్టీకి సీనియర్ నేత, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య శుక్రవారం రాజీనామా చేశారు. అభ్యర్థుల ఎంపికలో అవకతవకలు జరుగుతున్నట్లు ఆరోపిస్తూ ఆయన పార్టీని వీడారు. పార్టీ అంశాలు చర్చించేందుకైనా అవకాశం ఇవ్వడం లేదని మండిపడ్డారు. పార్టీలో చోటుచేసుకుంటున్న వ్యాపార రాజకీయాలతో తెలంగాణ సమాజంలో కాంగ్రెస్ పరువుపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీలో బిసిలకు అన్యాయం జరుగు తోందని తెలిపారు. ఈ మేరకు ఆయన తన రాజీనామా లేఖను పార్టీ అధిష్ఠానానికి పంపారు. ఈ సందర్భంగా పొన్నాల ఓ ప్రకటన విడుదల చేశారు. కొందరు నేతల వైఖరితో పార్టీ పరువు మట్టిలో కలుస్తోందని తెలిపారు. ఉదయ్‌పూర్ డిక్లరేషన్ అమలు చేయడం లేదని, అవమానాలు ఎదుర్కొని పార్టీలో ఉండలేనని పేర్కొన్నారు. సీనియర్లకు కూడా అధిష్ఠానం నెలల తరబడి అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదన్నారు. అభ్యర్థుల ఎంపికలో అనేక అవకతవకలు జరుగుతున్నట్టు ప్రచారమవుతోందని, పార్టీలో జరుగుతున్న పరిణామాలు ఆ ఆరోపణలకు బలం చేకూరుస్తున్నాయని పేర్కొన్నారు. నాలాంటి ఒక సీనియర్ నాయకుడు పార్టీ అంశాలు చర్చించాలంటే అపాయింట్‌మెంట్ కోసం వేచిచూడడం దురదృష్టకరమన్నారు.

ముఖ గుర్తింపు తప్పనిసరి

- 100 శాతం అమలుకు ప్రభుత్వం ఆదేశం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ముఖ గుర్తింపు ఆధారిత హాజరు (ఎఫ్‌ఆర్‌ఎస్) విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని ప్రభుత్వం తాజాగా ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం 45 నుంచి 50 శాతం మాత్రమే ఎఫ్‌ఆర్‌ఎస్ ద్వారా హాజరు నమోదవుతుందని, దీనిని పూర్తి స్థాయిలో అమలు చేయాలని ఆదేశించారు.

కార్యాలయాలకు వస్తున్న అధికారులు, ఉద్యోగులు కేవలం ఉదయం సమయంలో మాత్రమే హాజరు నమోదు చేస్తున్నారని, సాయంత్రం కార్యాలయాల నుంచి వెళ్లిపోయే సమయంలో 'చెక్ అవుట్' హాజరు నమోదు చేయడం లేదని గుర్తించినట్లు ప్రభుత్వం పేర్కొంది. యాప్‌లో ఉన్న కేజువల్ లీవ్, ఆప్షనల్ హాలిడే నమోదు సదుపాయాలను కూడా వినియోగించడం లేదని తెలిపింది. ఇదే సమయంలో డిడిఒలు, ఒపి, ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగాల ఇన్‌ఛార్జులు హాజరు విధానాన్ని పర్యవేక్షించడంలో విఫలమైనట్లు జిఎడి పేర్కొంది. ఈ నేపథ్యంలోనే అన్ని శాఖల కార్యదర్శులు, శాఖాధిపతులు, జిల్లాల కలెక్టర్లు ముఖ ఆధారిత హాజరుపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరింది.


పోలీస్ స్టేషన్ వద్ద బైఠాయించిన టిడిపి శ్రేణులు

నగరిలో ఉద్రిక్తత

- గాలి భానుప్రకాష్ కారుపై దాడి
- పోలీసు స్టేషన్ ఎదుట ధర్నా

ప్రజాశక్తి - నగరి (చిత్తూరు జిల్లా)

చిత్తూరు జిల్లా నగరిలో ఉద్రిక్తత నెలకొంది. టిడిపి నగరి నియోజకవర్గ అభ్యర్థి గాలి భానుప్రకాష్ కారుపై నగరి ఏరియా ఆస్పత్రి వద్ద దాడి జరిగింది. 'బాబుతో నేను' కార్యక్రమం, కార్యకర్తల పరామర్శ అనంతరం జనసేన- కాపు సంక్షేమ సేన ఆధ్వర్యంలో జరగనున్న కార్యక్రమానికి హాజరయ్యేందుకు వెళుతున్న సమయంలో గాలి భానుప్రకాష్ కారుపై అల్లరి మూకలు దాడి చేశాయి. వైసిపి మూకలే ఈ దాడికి పాల్పడ్డారని ఆరోపిస్తూ టిడిపి శ్రేణులు పోలీసు స్టేషన్‌కు చేరుకున్నాయి. అక్కడే రోడ్డుపై కూర్చుని ధర్నా నిర్వహించాయి. అనంతరం సిఐకు ఫిర్యాదు చేశాయి. ఈ సందర్భంగా గాలి భానుప్రకాష్ మాట్లాడుతూ.. అభివృద్ధి చేయడం చేతగాక, తన కారుపై మంత్రి రోజా దాడి చేయించడం దుర్మార్గమన్నారు. చేతనైతే ఈ మూడు నెలల్లో ఏమైనా అభివృద్ధి చేసి చూపించాలని సవాల్ విసిరారు. ముందస్తు ప్రణాళిక ప్రకారం స్పీడు బ్రేకర్ వద్ద అల్లరి మూకలు కాపుగాచి తన కారుపై దాడి చేశాయని పోలీసులకు చేసిన ఫిర్యాదులో ఆయన పేర్కొన్నారు.

అంగళ్లు కేసులో బాబుకు ముందస్తు బెయిల్

ప్రజాశక్తి-అమరావతి

ప్రాజెక్టుల సందర్శన పేరుతో జరిపిన పర్యటన సందర్భంగా జరిగిన గొడవల నేపథ్యంలో పోలీసులు దాఖలు చేసిన కేసులో టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడుకు హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. అన్నమయ్య జిల్లా, అంగళ్లు వద్ద జరిగిన గొడవల కేసులో చంద్రబాబును పోలీసులు నిందితుడిగా చేర్చారు. ముందస్తు బెయిల్ పిటిషన్‌పై జస్టిస్ కె సురేష్‌రెడ్డి శుక్రవారం తీర్పు చెప్పారు. రూ.లక్ష చొప్పున రెండు పూచీకత్తులు సమర్పించాలని, పోలీసుల దర్యాప్తునకు సహకరించాలని, సాక్ష్యులను ప్రభావితం చేయరాదని షరతులు విధించారు. ఇదే కేసులో ఇతర నిందితులకు బెయిల్‌ను రద్దు చేసేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది.

ఉత్తరాంధ్రకు ఏం చేశారో

శ్వేతపత్రం విడుదల చేయండి : సిపిఎం

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

గడిచిన నాలుగున్నరేళ్లలో ఉత్తరాంధ్రకు ఏం చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం డిమాండ్ చేశారు. ఉత్తరాంధ్ర జిల్లాలు బాగా వెనుకబడిపోయాయని, విశాఖపట్నానికి మకాం మార్చితే ఉత్తరాంధ్ర అభివృద్ధి అవుతుందని ముఖ్యమంత్రి చెప్పడం విడ్డూరంగా ఉందని అన్నారు. సిపిఎం విశాఖ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఉత్తరాంధ్ర ప్రజలకు తాగు, సాగునీరు కోసం తలపెట్టిన సుజల స్రవంతి ప్రాజెక్టు పనుల కోసం ఎంత నిధులు కేటాయించారో, రైతులకు ఏం మేలు చేశారో తెలపాలని డిమాండ్ చేశారు. ఉత్తరాంధ్రలో కో-ఆపరేటివ్ సుగర్ ఫ్యాక్టరీలు, ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలు, జ్యూట్ పరిశ్రమలు మూతపడడానికి కారణం వైసిపి ప్రభుత్వ విధానాలు కాదా? అని ప్రశ్నించారు. మూతపడిన చిన్న, మధ్యతరహా పరిశ్రమలను తెరిపించడానికి ఎటువంటి చర్యలూ తీసుకోలేదన్నారు.

ఆంధ్ర రాష్ట్రానికే తలమానికమైన విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణలో రాష్ట్ర ప్రభుత్వ పాత్ర ఏమిటో చెప్పాలని ప్రశ్నించారు. 974 రోజులుగా జరుగుతున్న ఉక్కు పరిరక్షణ ఉద్యమం కనబడలేదా? అని నిలదీశారు. గంగవరం పోర్టును అదానీకి ఎందుకు కట్టబెట్టారో? విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు రావాల్సిన ముడిసరుకును ఎందుకు ఆపించేశారో చెప్పాలని ప్రశ్నించారు. ఉమ్మడి విశాఖపట్నం ఏజెన్సీలో ఆదిమ తెగ ఉందని, వారు బాగా వెనుకబడినవారని, వారి కోసమే తాను విశాఖపట్నానికి మకాం మార్చుతున్నానని తాజాగా విడుదల చేసిన జిఒలో సిఎం పేర్కొనడాన్ని లోకనాథం ప్రస్తావించారు. గిరిజన ప్రాంతంలో మౌలిక సదుపాయాలు, విద్య, వైద్యం కల్పనలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని తెలిపారు. గిరిజనులకు అంత్యోదయ కార్డుల ద్వారా ఇచ్చే రేషన్‌ను ఎందుకు నిలుపుదల చేశారని, ఎంతమంది గిరిజన యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించారని ప్రశ్నించారు. ల్యాండ్‌పూలింగ్ ద్వారా 6,116 ఎకరాల భూమిని రైతుల నుంచి బలవంతంగా లాక్కున్నారని తెలిపారు. విశాఖకు రైల్వే జోన్, వాల్తేరు డివిజన్, మెట్రో రైలు, గిరిజన యూనివర్సిటీ వంటి విభజన హామీలు, వెనుకబడిన ఉత్తరాంధ్ర జిల్లాలకు కేంద్రం నుంచి ఏటా రావాల్సిన రూ.50 కోట్ల నిధుల కోసం ఏ ప్రయత్నం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. తమ ప్రశ్నలకు సిఎం సమాధానం చెప్పాలన్నారు. ఉత్తరాంధ్రలో కోట్ల రూపాయల విలువైన భూములను దోచుకోవడానికి, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయడానికే సిఎం విశాఖకు మకాం మారుస్తున్నారని విమర్శించారు. ఉత్తరాంధ్ర వెనుకబడింది తప్ప, ఉత్తరాంధ్రలోని రాజకీయ పార్టీల నాయకులు వెనుకబడలేదని లోకనాథం పేర్కొన్నారు. సిఎం క్యాంపు ఆఫీసు వచ్చినంత మాత్రాన అభివృద్ధి జరగదన్నారు. పైగా, చిరువ్యాపారులు, అసంఘటితరంగ కార్మికుల ఉపాధిపోయే ప్రమాదముందని తెలిపారు. అభివృద్ధి వికేంద్రీకరణ జరగాలని, నిధులు మంజూరు చేయాలని, ప్రభుత్వరంగ సంస్థలను రక్షించడంతోపాటు ఉత్పత్తి రంగంలో పెట్టుబడులు పెట్టి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, జిల్లా కమిటీ సభ్యులు కృష్ణారావు పాల్గొన్నారు.

ఎస్‌సిలకు శ్మశాన వాటికలు

- క్రైస్తవ ప్రతినిధులతో సిఎం సమావేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

క్రైస్తవ శ్మశానవాటికలు లేనిచోట ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి క్రైస్తవ ప్రతినిధులకు తెలిపారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ముఖ్యమంత్రిని క్రైస్తవ ప్రతినిధులు కలిశారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ దళిత క్రైస్తవులకు ఎస్‌సి హోదా ఇవ్వాలంటూ అసెంబ్లీలో ఇదివరకే తీర్మానం చేసి పంపించామని, ఈ అంశం న్యాయస్థానం పరిధిలో ఉందని తెలిపారు. శ్మశాన వాటికలపై నివేదిక తెప్పించుకున్నామని, లేనిచోట్ల ఏర్పాటు చేస్తామని చెప్పారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకోవాలి

- సిద్ధార్థ కాలేజ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కన్వీనర్ చుక్కపల్లి అరుణ్‌కుమార్
- ఉత్సాహంగా ముగిసిన సేఫ్ సాంస్కృతికోత్సవాలు



బహుమతులు అందజేస్తున్న చుక్కపల్లి అరుణ్‌కుమార్

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని దానికి అనుగుణంగా కృషి చేయాలని కెవిఎస్ఆర్ సిద్ధార్థ కలేజ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కన్వీనర్ చుక్కపల్లి అరుణ్‌కుమార్ అన్నారు. ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడలోని కెవిఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాల - సేఫ్ (స్టెప్ ఎహెడ్ ఫర్ ఈక్వాలిటీ) సంయుక్త ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా జరుగుతున్న అంతర్ కళాశాలల సాంస్కృతికోత్సవాల ముగింపు సభ శుక్రవారం సిద్ధార్థ ఆడిటోరియంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం అరుణ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులలో ప్రతిభను వెలికితీసేందుకు స్టెప్ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇటువంటి కార్యక్రమాలు తరచుగా జరగాలని, వాటిల్లో విద్యార్థులు కూడా పాల్గొనాలని, అప్పుడే వారిలో సృజనాత్మక శక్తి బయటకు వస్తుందని పేర్కొన్నారు. సిద్ధార్థ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ ఆచంట సునీత మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి మంచి స్పందన వచ్చిందని తెలిపారు.


భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. సేఫ్ అధ్యక్షులు జి.జ్యోత్స్న మాట్లాడుతూ విద్యార్థులలో లింగసమానతపై చైతన్యం కల్పించాలన్న ఆలోచనతో ఈ పోటీలను నిర్వహించామని తెలిపారు. లఘునాటికలు, ఫ్లాస్‌మాబ్, వీధి నాటికలు, ముఖాభినయం, వీధి నాటిక, మిస్ అండ్ మిస్టర్ సేఫ్, ఆత్మరక్షణా ప్రదర్శన, వాద ప్రతివాదన అంశాలలో నిర్వహించిన పోటీలకు 19 కళాశాలల నుండి 500 మందికిపైగా విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారన్నారు. వీరందరికి వివిధ కేటగిరిల వారీగా బహుతులు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సేఫ్ కార్యదర్శి జి.వాణి, తదితరులు పాల్గొన్నారు.

కోలుకోని ఎగుమతులు

- సెప్టెంబర్‌లో 2.6 శాతం తగ్గుదల
- ఎనిమిదో మాసంలోనూ పతనం



న్యూఢిల్లీ : దేశ ఆర్థిక వ్యవస్థకు అత్యంత కీలకమైన ఎగుమతులూ వరుసగా పతనం అవుతున్నాయి. ప్రపంచ మార్కెట్‌లో భారత సరుకులకు డిమాండ్ పడిపోవడం, పోటీపడలేక వరుసగా ఎనిమిదో మాసంలోనూ క్షీణించాయి. మరోవైపు ఎగుమతుల కంటే దిగుమతులు అధికంగా ఉండటంతో భారత వాణిజ్య లోటు పెరిగింది. ప్రస్తుత ఏడాది సెప్టెంబర్‌లో భారత ఎగుమతులు 2.6 శాతం కోల్పోయి 34.47 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయని శుక్రవారం వాణిజ్య మంత్రిత్వ శాఖ గణంకాలు వెల్లడించింది. గతేడాది ఇదే మాసంలో 35.39 బిలియన్ల ఎగుమతులు జరిగాయి. గడిచిన నెలలో దిగుమతులు 15 శాతం తగ్గి 53.84 బిలియన్ డాలర్లుగా చోటు చేసుకున్నాయి. ఎగుమతుల కంటే దిగుమతులు ఎక్కువగా ఉండటంతో దేశ వాణిజ్య లోటు 19.37 బిలియన్ డాలర్లుగా చోటు చేసుకుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ కాలంలో భారత సరుకుల ఎగుమతులు 8.77 శాతం క్షీణించి 211.4 బిలియన్లకు తగ్గగా.. అదే సమయంలో దిగుమతులు 12.23 శాతం తగ్గి 326.98 బిలియన్లుగా చోటు చేసుకున్నాయి. గడిచిన నెలలో రత్నాలు, అభరణాలు, రసాయనాలు, ఇంజనీరింగ్ గూడ్స్, రెడీమేడ్ గార్మెంట్స్ ఉత్పత్తులకు డిమాండ్ సన్నగిల్లింది. ప్రపంచ దేశాల ఉత్పత్తులతో పోటీ పడలేకపోవడం, గ్లోబల్ డిమాండ్‌లోనూ స్తబ్దత నేపథ్యంలో భారత ఎగుమతులు తగ్గిపోతున్నాయని పరిశ్రమ నిపుణులు పేర్కొంటున్నారు.



ఆరేళ్లలో రూ.16వేల కోట్ల పెట్టుబడులు

- కంట్రోల్‌ఎస్ వెల్లడి

హైదరాబాద్ : టెక్నాలజీ సంస్థ కంట్రోల్‌ఎస్ భారీ విస్తరణ ప్రణాళికలు చేపట్టినట్లు పేర్కొంది. ఇందుకోసం వచ్చే ఆరేళ్లలో 2 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.16వేల కోట్ల) పెట్టుబడులు పెట్టనున్నట్లు పేర్కొంది. 2030 కల్లా తమ హైపర్‌స్కేల్ డాటా సెంటర్ సామర్థ్యాన్ని పెంచుకోనున్నట్లు వెల్లడించింది. అదే విధంగా ఉద్యోగుల సంఖ్యను రెట్టింపు చేసుకోవడానికి, కార్బన్ న్యూట్రల్‌గా అవతరించడానికి ఈ పెట్టుబడులను వినియోగించుకోవాలని యోచిస్తోంది. ప్రస్తుతం దేశంలోని ఏడు ప్రధాన నగరాల్లో కంట్రోల్‌ఎస్‌కు 234 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 12 డాటా సెంటర్లున్నాయి. వచ్చే ఆరేళ్లలో 1000కిపైగా ఉద్యోగులను తీసుకోనున్నట్లు పేర్కొంది.

మార్కెట్లోకి ఒప్పో 'ఫైండ్ ఎన్3 ఫ్లిప్'



న్యూఢిల్లీ : స్మార్ట్‌ఫోన్ల తయారీదారు ఒప్పో భారత మార్కెట్లోకి తన కొత్త మోడల్ ఫైండ్ ఎన్3 ఫ్లిప్‌ను విడుదల చేసింది. దీని ధరను 94,999గా నిర్ణయించింది. దీనిని ట్రిపుల్ కెమెరాతో ఆవిష్కరించింది. 50 మెగా పిక్సెల్ సోనీ ఐఎంఎక్స్ 890 ప్రైమరీ సెన్సర్ కెమెరా, 48 మెగా పిక్సెల్ అల్ట్రావైడ్, 32 మెగా పిక్సెల్ టెలిఫొటో లెన్స్ కెమెరా ఉంటాయి.

సెల్ఫీ కోసం 32 మెగా పిక్సెల్ కెమెరాను అమర్చింది. అక్టోబర్ 22 నుంచి ఆన్‌లైన్‌లో ప్రీ బుకింగ్స్‌ను ప్రారంభిస్తున్నట్లు తెలిపింది. 4300 ఎంఎహెచ్ బ్యాటరీ, 12జిబి ర్యామ్, 256జిబి ఇంటర్నల్ స్టోరేజీ కలిగి ఉంది. ఎంపిక చేసిన బ్యాంకుల క్రెడిట్, డెబిట్ కార్డులతో బుక్ చేసుకున్న వారికి రూ.12 వేల వరకు క్యాష్ బ్యాక్ ఆఫర్ అందిస్తున్నట్లు తెలిపింది.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం

- మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు

రైతు సాధికార సంస్థ ద్వారా రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు.

నెల్లూరులోని వి.ఆర్.సి మైదానంలో సింహపురి సేంద్రియ మేళా -2023ను రాష్ట్ర మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి చౌదరితో కలసి శుక్రవారం ఆయన ప్రారంభించారు. ప్రకృతి వ్యవసాయదారుల సంఘం, మత్స్యకార సంక్షేమ సమితి, రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్గానిక్ వ్యవసాయ ఉత్పత్తులు, మత్స్య ఉప ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకం, చిరుధాన్యాల స్టాళ్లను మంత్రి పరిశీలించారు.

అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఆర్గానిక్ వ్యవసాయ ఉత్పత్తులు, మత్స్య ఉపఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలు మూడు రోజుల పాటు జరుగుతాయని తెలిపారు. రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించాలన్న లక్ష్యంతో రైతు సాధికార సంస్థ విభాగాన్ని ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రంలో ప్రకృతి సాగు, సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించినందుకు గాను రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిష్టాత్మకమైన జైవిక్ అవార్డు వచ్చిందని తెలిపారు.

క్వాల్‌కాంలో ఉద్యోగులకు ఉద్వాసన

న్యూయార్క్ : అమెరికన్ చిప్ దిగ్గజం క్వాల్‌కాం వందలాది మంది ఉద్యోగులను ఇంటికి పంపిస్తోంది. దాదాపు 1258 మంది ఉద్యోగులపై వేటు వేయనుంది. ఇది ఆ సంస్థలోని మొత్తం ఉద్యోగుల్లో 2.5 శాతానికి సమానం. ఆర్థిక అనిశ్చితి, సెమీకండక్టర్ పరిశ్రమలో చోటుచేసుకుంటున్న మార్పులకు అనుగుణంగా పునర్వ్యవస్థీకరణపై దృష్టి పెట్టినట్లు క్వాల్‌కాం వెల్లడించింది. ప్రస్తుత ఏడాది డిసెంబర్‌లోనే ఉద్వాసనలు ఉంటాయని స్పష్టం చేసింది. శాండియాగో, శాంటా క్లారా ప్లాంట్స్‌లో ఉద్యోగుల తొలగింపు ఉంటుందని కంపెనీ పేర్కొంది. అయితే ప్లాంట్ల మూసివేత ఉండబోదని వెల్లడించింది.

సంపాదకీయం


ఆకలిరాజ్యం

ప్రపంచ ఆకలి సూచీలో భారత్‌కు 111వ స్థానం లభించడం దేశంలో ప్రజల దీనస్థితికి అద్దం పడుతోంది. 121 దేశాలను పరిగణలోకి తీసుకొని గతేడాది ప్రకటించిన ఇదే జాబితాలో భారత్ 107వ స్థానంలో ఉండగా.. ఇప్పుడు 125 దేశాలతో రూపొందించిన జాబితాలో భారత్ ర్యాంకు 111కు దిగజారడం ప్రజల జీవనోపాధుల క్షీణతను తేటతెల్లం చేస్తోంది. జర్మనీ, ఐర్లండ్ కేంద్రాలుగా పనిచేసే కన్సర్న్ వరల్డ్ వైడ్, వెల్ట్‌హంగర్‌హిల్ఫ్ అనే యూరోపియన్‌యూనియన్‌కు చెందిన స్వచ్ఛంధ సంస్థలు ఉమ్మడి కార్యాచరణతో గ్లోబల్ హంగర్ ఇండెక్స్ (జిహెచ్‌ఐ) నివేదికను ప్రతి యేటా విడుదల చేస్తూ వస్తున్నాయి. ప్రపంచంలో ఆకలితో అలమటించి ఎవ్వరూ చనిపోరాదని, ఇలాంటి నివేదికలు రూపొందిస్తే సంబంధిత ప్రభుత్వాధినేతలు ప్రజల తిండిపై శ్రద్ధపెట్టి తగిన చర్యలు తీసుకునేలా చూడొచ్చని ఆ సంస్థలు భావించాయి. ఈ నివేదికల లక్ష్యం. పోషకాహారలోపం, శిశువుల్లో తీవ్ర పోషకాహారలోపం, వయస్సుకు తగిన ఎత్తులేకపోవడం, శిశు మరణాల రేటు అనే నాలుగు సూచికల ఆధారంగా జిహెచ్‌ఐని కొలుస్తారు. జిహెచ్‌ఐలో 100 పాయింట్లు ఉంటాయి. ఈ పాయింట్ల ఆధారంగానే దేశాల ఆకలి తీవ్రత స్థాయిని లెక్కగడతారు.

ఆకలి సూచిలో మన ఇరుగుపొరుగు దేశాలైన పాకిస్థాన్, శ్రీలంక, బంగ్లాదేశ్‌ల కన్నా వెనుకబడి ఉన్నాం. ఇదీ మన విశ్వగురు ఘనత. ప్రపంచ బాలల్లో అత్యధికంగా భారత్‌లోనే 18.7 శాతం తక్కువ బరువు ఉన్న పిల్లలున్నారని ఆహార సూచీ కుండబద్దలు కొట్టింది. దేశంలో పోషకాహార లోపం 16.6 శాతం ఉండగా, ఐదేళ్ల లోపు పిల్లల్లో మరణాలు 3.1 శాతం, అలాగే యుక్తవయస్సు 15-24 ఏళ్ల మహిళల్లో రక్త హీనత 58.1 శాతం ఉన్నట్లు నివేదించారు. అయితే లోపభూయిష్టమైన 'ఆకలి' కొలమానాల్లో దీన్ని రూపొందించారంటూ గతేడాదిలాగే ఈ దఫా కూడా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కొట్టిపారేసింది. ప్రజా సమస్యలపై నిలదీస్తున్న ప్రత్యామ్నాయ మీడియా గొంతు నులుముతున్న మోడీ సర్కార్‌కు వాస్తవాలు ఒంటబట్టకపోవడంలో ఆశ్చర్యమేముంది. కేంద్ర మహిళా శిశుసంక్షేమ శాఖ సైతం ఈ వాస్తవాలను గుర్తించేందుకు సాహసించలేకపోతోంది. దేశంలో పోషకాలతో కూడిన ఆహారం అందడం లేదని, ఆహార పదార్థాల్లో పోషకాలు జత చేసి (దీనినే ఫోర్టిఫైడ్ అంటారు. ఫోర్టిఫైడ్ బియ్యం అంటే ఇవే) సార్వత్రిక ప్రజా పంపిణీ (పిడిఎస్) దుకాణాల ద్వారా ప్రజలందరికీ తప్పనిసరిగా అందేలా చూడాలని మోడీ సర్కార్ మానస పుత్రిక నీతి అయోగ్ సైతం ఇదివరకే నివేదించింది. బిజెపి ప్రభుత్వం మాత్రం పిడిఎస్‌కు బడ్జెట్‌లో నిధులు తెగ్గోసి మొత్తం వ్యవస్థనే నిర్వీర్యం చేస్తోంది. కోవిడ్ సంక్షోభం నుంచి ప్రజలు ఇంకా తేరుకోకున్నా...నాటి విపత్తు సమయంలో ఇచ్చిన తిండిగింజలకు సైతం పూర్తిగా కోత పెట్టేసింది. గ్రామీణ భారతావనిలో నిరుపేదలకు బతుకు భరోసా కల్పించిన ఉపాధి హామీ పథకంపైనా ఉరితాడు వేలాడదీస్తోంది. అటు నిధులకు కోత పెట్టడమే కాకుండా క్షేత్రస్థాయిలో డిజిటల్ ఆంక్షలు పెడుతూ నిత్యం లబ్దిదారుల సంఖ్యను కుదిస్తూవస్తోంది.

జాతీయత గురించి, దేశభక్తి గురించి నయవంచక నినాదాలతో మభ్యపెట్టే మోడీ సర్కార్ ఇప్పటికైనా నిజమైన దేశభక్తి అంటే ఏమిటో, దేశమంటే ఏమిటో గుర్తెరగాలి. 'దేశమును ప్రేమించుమన్నా..మంచి యన్నది పెంచుమన్నా'..అని గొంతెత్తి దేశభక్తి జ్యోతిని రగిలించిన మహాకవి గురజాడ వేంకట అప్పారావు అదే గేయంలోనే 'దేశమంటే మట్టికాదోయ్..మనుషులోయ్' అని నినదించి..మట్టి కంటే మానవత్వానికి విలువనివ్వాలని ఉద్ఘాటించారు. ఆకలి, దప్పులతో అలమటిస్తూ జీవచ్ఛవంలా బతుకెళ్లదీసే బక్కచిక్కిన శరీరాలుంటే మనిషిగా పరిగణించలేమని పోషకాహార అవసరాన్ని, పాడి పంటల ప్రగతిని ఆకాంక్షించారు. 'తిండి కలిగితే కండ కలుగును..కండ కలవాడేను మనిషోయి' అని నిర్వచించి స్వతంత్ర భారతావని అస్సలు లక్ష్యాలను ఆ మహనీయుడు ఆ నాడే నిర్దేశించారు. అజాదీ అమృత మహోత్సవాలను ఘనంగా నిర్వహించుకున్న 77 ఏళ్ల స్వతంత్ర భారతావనిలో ఆకలి గురించి ఆందోళన స్థితిలో ఉన్నామంటే దానికి కారణం పాలకులే. బడా పెట్టుబడిదారులకు సర్వ సంపదలు దోచిపెడుతూ, నింగినేలా ప్రయివేటీకరిస్తూ సామాన్యులపై పెనుభారాలు మోపుతున్న ప్రభుత్వాల నయా ఉదారవాద విధానాలు రెండు భారతాలను సృష్టిస్తున్నాయి. ఒకటి సంపన్నులు వెలుగుతున్న భారతం, కాగా రెండోది పేదలు నలిగిపోతున్న భారతం. వీటన్నిటికి మూలమైన ఈ వినాశకర విధానాలను తిప్పికొట్టి ప్రత్యామ్నాయ విధానాలను ముందుకు తెచ్చినప్పుడే సామాన్యుడికి తిండి దక్కేది.

మహనీయుల మాట



ఓ మర్రి గింజ
మహా వృక్షమైనట్టే,
చిత్తశుద్ధితో చేసే
చిన్న సత్కార్యం సైతం
మహా ఫలితాన్నిస్తుంది.

- స్టాన్ స్లావిస్కి,
రష్యన్ నటుడు, దర్శకుడు.

వ్యాఖ్య

ఇజ్రాయిల్-గాజా యుద్ధం : ఆక్రమణలకు అంతం పలకాలి!

దక్షిణ ఇజ్రాయిల్‌పై హమాస్ విస్మయ పరిచే రీతిలో దాడులు జరపడం, దానికి ప్రతిగా ఇజ్రాయిల్ గాజాలో క్రూరమైన బాంబు దాడులకు దిగడంతో...ఇజ్రాయిల్ ఆక్రమణ, పాలస్తీనా ప్రజల ప్రతిఘటన చరిత్రలో కొత్త అధ్యాయానికి తెరలేచింది.

ఈ సంపాదకీయం రాస్తున్న సమయానికి (ఘర్షణలు ప్రారంభమై నాలుగు రోజులు గడిచిన తర్వాత) 1200 మంది ఇజ్రాయిలీలు మరణించారు (వారిలో 155 మంది సైనికులు), 2700 మంది గాయపడ్డారు. పాలస్తీనా వైపు చూసినట్లైతే, ఇప్పటివరకు గాజాపై ఇజ్రాయిల్ బాంబు దాడుల్లో 1055 మంది మరణించారు, 5,128 మంది గాయపడ్డారు. ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో 17 మంది పాలస్తీనియనున్ల మరణించగా 80 మంది గాయపడ్డారు.

ఇజ్రాయిల్‌లో హమాస్ దాడుల కారణంగా మహిళలు, చిన్నారులతో సహా పౌరులు ప్రాణాలు కోల్పోవడం, గాజాలో కూడా ప్రజల మరణాలు పెరగడం, అందులోనూ మహిళలు, పిల్లలు మృతి చెందడం కచ్చితంగా గట్టిగా ఖండించాల్సిన విషయం.



అదే సమయంలో, అంతర్జాతీయ కార్పొరేట్ మీడి యా, పశ్చిమ దేశాల పాలక వర్గాలు అందిస్తున్న వర్ణనలతో కూడిన కథనాలను తీవ్రంగా వ్యతిరేకించాల్సిన అవసరం వుంది. ముఖ్యంగా ఇజ్రాయిల్ ఆక్రమణల గురించి అస్సలు ప్రస్తావించకుండా ఇజ్రాయిల్‌పై దారుణమైన తీవ్రవాద దాడి జరిగిందంటూ పేర్కొనడాన్ని వ్యతిరేకించాల్సి వుంది.

దశాబ్దాల తరబడి ఇజ్రాయిల్ ఆక్రమణలు, పాలస్తీనా ప్రజలను లొంగదీసుకోవడం నేపథ్యంలో హమాస్ దాడిని చూడాలి. 1967 యుద్ధం జరిగినప్పటి నుండి ఇజ్రాయిల్ సాయుధ బలగాలు వెస్ట్ బ్యాంక్, గాజాలను తమ స్వాధీనంలోకి తెచ్చుకున్నాయి. గత 56 ఏళ్ళుగా తమ ఆక్రమణలోనే అట్టిపెట్టుకున్నాయి. అంతర్జాతీయ చట్టాలు, ఐక్యరాజ్య సమితి తీర్మానాల మేరకు, ఇవన్నీ ఆక్రమిత ప్రాంతాలు. ఇన్నేళ్ళలో వెస్ట్ బ్యాంక్‌లో అక్రమంగా యూదు ఆవాసాలను ఏర్పాటు చేశారు. సెక్యూరిటీ అడ్డంకుల పేరుతో ఈ ప్రాంతాన్ని ముక్కలు ముక్కలుగా విడగొట్టారు. ఇజ్రాయిల్ నుండి వెస్ట్ బ్యాంక్‌ను వేరు చేస్తూ పెద్ద గోడ నిర్మించారు. వర్ణ వివక్ష వ్యవస్థను అమలు చేశారు. 2022లో బెంజమిన్ నెతన్యాహు నేతృత్వంలో మితవాద ప్రభుత్వం ఏర్పడడంతో పాలస్తీనియన్ల అణచివేత మరింత ఉధృతమైంది. సెటిలర్ల మూకలు, మితవాద ముఠాలు పాలస్తీనియన్లను వారి ఇళ్ల నుండి గెంటివేయడం, గ్రామాల నుండి పారద్రోలడం, ఎలాంటి దయా దాక్షిణ్యాలు లేకుండా చంపేస్తూ పాలస్తీనియన్ల జీవితాలను ఈ అతి జాతీయవాద ప్రభుత్వం దుర్భరం చేసింది. ఘర్షణలకు ముందు ఈ ఒక్క ఏడాదిలోనే ఇజ్రాయిల్ భద్రతా బలగాలు, సెటిలర్ల చేతుల్లో 248మంది పాలస్తీనియన్లు మరణించారు. అంటే సగటున రోజుకో పాలస్తీనియుడు చనిపోయాడన్న మాట. జెరూసలెంలో, పాలస్తీనియన్ల కుటుంబాలను బలవంతంగా తరలించారు. వారి ఇళ్ళను ఆక్రమించుకున్నారు. తూర్పు జెరూసలెంలో జాతి ప్రక్షాళన క్రమం కొనసాగుతోంది. ముస్లిం ప్రపంచానికి మూడో అతి పవిత్ర ప్రదేశమైన అల్ అక్సా మసీదు ఆవరణలో తీవ్రవాదులైన యూదు అల్లరి మూకలు, భద్రతా బలగాలు రెచ్చగొట్టే చర్యలకు పాల్పడ్డారు. మసీదు లోకి ప్రవేశించి, అక్కడ ప్రార్ధనలు చేసుకుంటున్న వారిని చితకబాదారు.



గాజా స్ట్రిప్‌కు సంబంధించినంత వరకు చూసినట్లైతే, 2007లో ఇజ్రాయిల్ తమ సైనిక బలగాలను ఉపసంహరించుకున్న తర్వాత, గాజా ప్రాంతం మొత్తంగా ఆంక్షలను విధించింది. ఈ గాజా ప్రాంతంలో దాదాపు 23 లక్షల మంది జీవిస్తున్నారు. గత 16 ఏళ్ళుగా, గాజా ప్రాంతం దయా దాక్షిణ్యాలు లేని ఆంక్షలను, దిగ్బంధనాలను ఎదుర్కొంటోంది. ఒక రకంగా బహిరంగ జైలుగా మారింది. ఇదే కాలంలో, ఆంక్షలను, దిగ్బంధనాలను ప్రతిఘటించే ప్రయత్నాలు జరిగినపుడు వైమానిక బాంబు దాడులతో విరుచుకుపడిన సందర్భాలు వున్నాయి. ఈ నరకాన్ని అనుభవిస్తూ వచ్చిన హమాస్ అందరినీ సమీకరిస్తూ, సంఘటితపరుస్తూ అనూహ్యమైన రీతిలో తాజా దాడికి దిగింది. దీంతో ఎంతగానో గొప్పగా చెప్పుకునే ఇజ్రాయిల్ ఇంటెలిజెన్స్, మిలటరీ విభాగాలను విస్మయానికి గురిచేసింది. తమకు తాము అజేయమనుకునే ఇజ్రాయిల్ రక్షణ బలగాల ఆలోచనలు చెల్లా చెదురయ్యాయి. ఈ దాడులకు ప్రతీకారంగా, నెతన్యాహు, ఆయన సహచరులు గాజాపై మొత్తంగా యుద్ధానికి దిగాలని నిర్ణయించారు. నెతన్యాహు మాటల్లో చెప్పాలంటే 'గాజాలో వాస్తవికతలను మార్చాలి'. ఇంధనం, ఆహారం, విద్యుత్ సరఫరాలు ఆపివేసి గాజాను మొత్తంగా దిగ్బంధించాల్సిందిగా ఇజ్రాయిల్ రక్షణ మంత్రి గలాంట్ ఆదేశించారు. గాజాలో 'మానవ మృగాల'పై పోరాటం జరపాల్సిందిగా పిలుపిచ్చారు. నాలుగు రోజుల పాటు జరిగిన వైమానిక బాంబు దాడుల్లో దాదాపు 900 మంది మరణించారు. వీరిలో మహిళలు, పిల్లలు వున్నారు. వేలాదిమంది గాయపడ్డారు. చాలా ప్రాంతాల్లో విద్యుత్ లేదు. నీరు, ఆహారం లేదు.

ఈ దిగ్బంధనాన్ని సామూహిక శిక్షగా ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల చీఫ్ వ్యాఖ్యానించారు. ఇది అంతర్జాతీయ చట్టాల ప్రకారం యుద్ధ నేరమేనన్నారు. గాజాతో గల సరిహద్దుల్లో ఇజ్రాయిల్ బలగాలను పెద్ద సంఖ్యలో మోహరించింది. భూతల దాడి తప్పదనే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇక జరగబోయేది వేలాదిమంది ఊచకోతే. ఇజ్రాయిల్ ఇంత పెద్దయెత్తున నాశనం, విధ్వంసానికి తెగబడుతుండడం వల్ల అది, పాలస్తీనా ప్రజలు మరోసారి ప్రతిఘటించడానికే దారి తీస్తుంది. గత ఏడు దశాబ్దాలుగా తమ విముక్తి కోసం పాలస్తీనియన్లు సాగిస్తున్న పోరాటాన్ని వారెన్నడూ విడనాడరు. ఇజ్రాయిల్‌కు ప్రధాన వెన్నెముక అయిన అమెరికా రంగంలోకి దిగింది. మారణాయుధాలను, మందుగుండును ఇజ్రాయిల్‌కు అందచేస్తామని హామీ ఇచ్చింది. ఆ మారణాయుధాలను పాలస్తీనియన్లను ఊచకోత కోయడానికే ఉపయోగిస్తారు.

> ఇజ్రాయిల్ ఇంత పెద్దయెత్తున నాశనం, విధ్వంసానికి తెగబడుతుండడం వల్ల అది పాలస్తీనా ప్రజలు మరోసారి ప్రతిఘటించడానికే దారి తీస్తుంది. గత ఏడు దశాబ్దాలుగా తమ విముక్తి కోసం పాలస్తీనియన్లు సాగిస్తున్న పోరాటాన్ని వారెన్నడూ విడనాడరు. ఇజ్రాయిల్‌కు ప్రధాన వెన్నెముక అయిన అమెరికా రంగంలోకి దిగింది. మారణాయుధాలను, మందుగుండును ఇజ్రాయిల్‌కు అందచేస్తామని హామీ ఇచ్చింది. ఆ మారణాయుధాలను పాలస్తీనియన్లను ఊచకోత కోయడానికే ఉపయోగిస్తారు. రెండు దేశాల ఏర్పాటు ఒక్కటే ఈ సమస్యకు పరిష్కారమని పైపై మాటలు చెబుతున్నప్పటికీ... పాలస్తీనియన్లపై అణచివేతను నివారించడానికి ఇన్నేళ్ళలో అమెరికా, దాని మిత్రపక్షాలు చేసిందేమీ లేదు.

రెండు దేశాల ఏర్పాటు ఒక్కటే ఈ సమస్యకు పరిష్కారమని పైపై మాటలు చెబుతున్నప్పటికీ... పాలస్తీనియన్లపై అణచివేతను నివారించడానికి ఇన్నేళ్ళలో అమెరికా, దాని మిత్రపక్షాలు చేసిందేమీ లేదు.

ప్రస్తుత ఘర్షణల్లో, అమెరికా వైఖరినే నరేంద్ర మోడీ కూడా పునరుద్ఘాటించారు. తీవ్రవాద దాడులను ఖండించారు. ఇజ్రాయిల్‌కు పూర్తి బాసటగా వుంటామని ప్రకటించారు. అంతే తప్ప పాలస్తీనియన్ల ప్రయోజనాలకు మద్దతుగా గానీ రెండు దేశాల ఏర్పాటు పరిష్కారం గురించి కానీ ఎలాంటి ప్రస్తావన లేదు. పాలస్తీనియన్ల భూములు ఆక్రమణలో కొనసాగుతున్నంత కాలమూ, పాలస్తీనియన్లు అణచివేతకు గురవుతున్నంత కాలమూ ఇజ్రాయిల్, పశ్చిమాసియాకు శాశ్వత శాంతి వుండబోదు.

గాంధీజీ నేతృత్వంలో జాతీయోద్యమ కాలం నుండి, భారత్ ఎల్లప్పుడూ పాలస్తీనియన్లకు అండగా, బాసటగానే నిలబడుతూ వచ్చింది. ఈ ప్రతినను మరోసారి పునరుద్ఘాటించాల్సిన సమయం ఇప్పుడు ఆసన్నమైంది.

('పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

కవిత్వం

నిద్దుర పోని యుద్ధ మేఘాలు...!

నిద్దుర పోని యుద్ధ మేఘాలు
నిద్ర రాని లక్షల అశ్రు నయనాలు
పిడుగులు వర్షించే మారణాయుధాలు
పేక మేడలుగా కూలె పెద్ద నగరాలు...!
మానవత్వాన్ని మరచి
దానవత్వాన్ని కరచి ఇరు దేశాలు
దారుణ మారణకాండకు దిగాయి...!!
కారణం లేని రణ రంగంలో
అపారమైన ఆర్థిక నష్టం
వేలాది మంది మరణం
లక్షలాది జనత క్షతగాత్రం
దేశ ప్రగతి తిరోగమనం....!?
ఇరు దేశాల యుద్ధం నేపథ్యం
తరతరాల ఆధిపత్య పోరు
రాజ్య కాంక్ష విస్తరణ హోరు..!
ఇద్దరూ అహంకారాలు వీడి
యుద్ధ శంఖారావాలకు స్వస్తి పలకాలి ..!
ఉభయులు స్నేహ హస్తాలు చాచి
శాంతి కపోతాలను ఎగురు వేయాలి..!
అప్పుడే ప్రపంచానికి ఉప శాంతి
నిఖిల మానవాళికి విశ్వ శాంతి...!

- జి. సూర్యనారాయణ, దివిసీమ.

నీ ఓటే...నీ ఆయుధం

ప్రతి రోజూ
జీవన్మరణ పోరాటం
ఉండనే ఉంటుంది
సమయం ఆసన్నమైనపుడే
మన విజ్ఞతను
పోరాట పటిమను
ప్రదర్శించాల్సి వస్తుంది
గతానుభవాల వేదనలు
గడిచిన గత తాలుకా రోదనలు
పునరావృతం కాకుండా
వివేకంతో
వ్యవహరించాల్సిన తరుణమిది
తాయిలాలకు తలొంచితే
భవిష్యత్ తారుమారౌతుంది
ముడుపులకు మొగ్గు చూపితే
భవితవ్యం అగమ్యమవుతుంది
కానుకలకు ముచ్చట పడితే
ముందుకాలం రాబందువవుతుంది
ఐదు వేలకు ఆశపడితే
ఐదేళ్ళ వరకు
ఐదు వేళ్ళు నోటిలోకి పోక
బతుకు భారమవుతుంది
ప్రశ్నించే గొంతుకను
నిలబడే నిజాయితీని
ఎదుర్కొనే నిబ్బరాన్ని
పోరాడే స్థయిర్యాన్ని
నీ ఓటుతో ఎన్నుకో
మరలా తప్పు చేశామన్న
ఆత్మవంచన నుండి తప్పుకో
వివేకం గల ఓటరునని ఒప్పుకో.

- కయ్యూరు బాలసుబ్రమణ్యం
సెల్ : 7780277240

మృత్యు క్రీడ

ఎర్ర తివాచీని
ఇక్కడ ఎవరు ఆరేశారు?
తెగిపడ్డ మాంసపు ముద్దలను
ఇక్కడ ఎవరు విసిరేశారు?
తారతమ్యం లేకుండా
ఆడవాళ్ళపై అత్యాచారం చేసి
గొంతు పిసికేసిన మానవ మృగాల
నపుంసకుల జాడ ఎక్కడ?
వేలాది శవాల గుట్టలతో
పేరుకుపోయిన నేల మాగాణి దృశ్యం
తాండవం చేస్తున్నది అక్కడ..
రాకెట్ల దాడులతో
బీభత్స సంఘటనలు
వాటి మధ్య భీతిల్లుతున్న
ప్రజానీకం అక్కడ..
బిక్కుబిక్కుమంటూ
ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని
బంకర్లలో తలదాచుకున్న
అభాగ్యులు ఉండేది అక్కడ!
జాత్యహంకారంతో దాడులు
విధ్వంసంతో విభేదాలు
చేస్తున్నారు వికృత చేష్టలు!
ఎగదోస్తున్న అగ్రరాజ్యాలు
రావణకాష్టంగా ఇరుదేశాలు..
మంచితనంతో సయోధ్య నెరపండి
యుద్ధం సమస్యకు
పరిష్కారం కాదని తెలపండి.

- గాదిరాజు రంగరాజు
సెల్ : 8790122275

సమస్య

పాఠశాలల్లో సంస్కరణలు నష్టదాయకం

సమాజ పరివర్తనకు, దారిద్ర్య నిర్మూలనకు, ఆకలిని అంతం చేయడానికి ఒక విప్లవాత్మక సాధనం విద్య. పాలో ఫ్రీర్ అనే విద్యావేత్త విద్య ప్రాముఖ్యతను వివరిస్తూ...మనిషి వ్యక్తిత్వ వికాసం, వ్యక్తి సామర్థ్యాలను పెంచే సాధనం విద్య అన్నారు. అయితే విద్యా రంగంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనేక సంస్కరణలను ప్రవేశపెడుతూ...ఈ సంస్కరణలన్నీ మన పిల్లలను ప్రపంచ స్థాయి విద్యార్థులుగా తీర్చిదిద్దడానికని నమ్మబలుకుతున్నది. కానీ ఇవి మన చిన్నారులను ప్రపంచ స్థాయి విద్యార్థులుగా తయారు చేయడం సంగతి అటుంచి వారిని విద్యకే దూరం చేసేలా వుండడం విచారకరం.



జి. వెంకటేశ్వరరావు

ఎన్.ఇ.పి-2020 అమలు పేరుతో మూడు కిలోమీటర్లలోపు వున్న పాఠశాలలను విలీనం చేయడానికి సిద్ధమైన ప్రభుత్వం విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆందోళనలతో దానిని ఒక కిలోమీటర్‌కు కుదించి అమలు చేశారు. ఈ క్రమంలో తల్లిదండ్రులు, విద్యార్థులు 'మా ఊరు బడి మా ఊరిలోనే ఉండాలి' అని చేసిన తీవ్రమైన ఆందోళనలు, ఎమ్మెల్సీల బస్సు యాత్రలు, ఉపాధ్యాయ సంఘాల ఆందోళనలతో ప్రభుత్వం మొదట ప్రకటించిన అన్ని స్కూళ్లను విలీనం చేయలేకపోయింది. 5,400 ప్రాథమిక పాఠశాలలు, 600 ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేశారు. దీంతో ఇప్పటికే ఏకోపాధ్యాయ పాఠశాలలుగా ఉన్న 8000 పాఠశాలలతో పాటు మరో 4000 పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారాయి. విభజించిన తర్వాత ఒకటి రెండు తరగతులు మిగిలి ఉన్న ప్రాథమిక పాఠశాలల పరిస్థితి దయనీయంగా వుంది. ఇక్కడ 10 లేదా అంతకన్నా తక్కువ విద్యార్థులు, ఒకే ఒక్క ఉపాధ్యాయుడితో...పాఠశాలకు ఉండవలసిన హంగు, ఆర్భాటాలను కోల్పోయి...సహజ మరణం పొందే బడులుగా మారాయి. దీనితో ఆ పాఠశాలలో మిగిలిన విద్యార్థులు చదువు మానేయడం లేదా ప్రైవేటు పాఠశాలలకు తరలిపోవడం తప్ప మరో దిక్కు లేని వారిగా మిగిలిపోయారు. తీరా ఇప్పుడు విలీనం తర్వాత మిగిలిన ఒకటి రెండు తరగతులలో పది లేదా అంతకన్నా తక్కువ విద్యార్థులున్న పాఠశాలలను మూసివేయాలని ప్రభుత్వం ఆలోచన చేస్తున్నది. ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసిన విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను నియమించడానికి రూపొందించిన జీవో-117 నిబంధనలు ఉపాధ్యాయుల కుదింపే లక్ష్యంగా ఉన్నాయి. దీనితో 37 వేల యస్.జి.టి పోస్టులు, 18 వేల స్కూల్ అసిస్టెంట్ పోస్టులు కనుమరుగు అయ్యాయి. ఉపాధ్యాయులను కుదించి ప్రపంచ స్థాయి విద్యార్థులను తయారు చేయడం ఎలా సాధ్యమో పాలకులే చెప్పాలి. ఈ విలీన ప్రక్రియ వలన అందుబాటులో ఉన్న స్కూలు నుండి దూరంగా ఉన్న స్కూలుకు విద్యార్థులను బలవంతంగా తరలించడం వలన విద్యార్థులు చదువు మధ్యలోనే బడి మానేస్తారనే ఆందోళన వ్యక్తం అవుతున్నది. దీనితో అందరికీ విద్య అందించాలనే రాజ్యాంగ లక్ష్యం నెరవేరదు. ఇది 2002లో 86వ రాజ్యాంగ సవరణ ద్వారా ప్రవేశపెట్టిన ఆర్టికల్ 21-ఏ ని ఉల్లంఘించడమే అవుతుంది.

> పాఠశాలల విలీనం, ఇంగ్లీష్ మీడియం, సి.బి.ఎస్.ఇ, బైజూస్, సాల్ట్...పేరు ఏదైనా ప్రభుత్వ విద్యా రంగంలో ప్రవేశపెట్టిన సంస్కరణలన్నీ విద్యార్థుల నమోదు పెంచేదానికి, వారిని ప్రభుత్వ పాఠశాలల్లో నిలిపి ఉంచేందుకు, వారికి నాణ్యమైన విద్య అందించేదానికి ఉపయోగపడలేదనేది అనుభవంలో అర్థమవుతున్నది. ఈ సంస్కరణలన్నీ ఉపాధ్యాయుల కుదింపు, ప్రైవేటీకరణను ప్రోత్సహించే విధంగానే ఉన్నాయనేది స్పష్టం అవుతున్నది. దీనితో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న బడుగు, బలహీన వర్గాల పిల్లలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది.

విలీనం అనంతరం రేషనలైజేషన్ కోసం జీవో-117 ప్రకారం ఉపాధ్యాయ విద్యార్థుల నిష్పత్తిని ప్రాథమిక పాఠశాలలో 1:30, ప్రాథమికోన్నత పాఠశాలలో 1:45, ఉన్నత పాఠశాలలో 1:53గా నిర్ణయించారు. ఇది విద్యా హక్కు చట్టం-2009 నిబంధనలకు విరుద్ధంగా ఉంది. విద్యాహక్కు చట్టం-2009లో ప్రాథమికోన్నత పాఠశాలలో 1:35, ఉన్నత పాఠశాలలో 1:45 ఉండాలని సూచించారు. కానీ దీనికి భిన్నంగా ఉపాధ్యాయుల కుదింపే లక్ష్యంగా జరిగింది. ఇది విద్యార్థుల అభ్యసనా ఫలితాలపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. ఉపాధ్యాయులకు అదనపు భారం మోపడంతో ఆనందకరమైన బోధనా అభ్యసన భారంగా మారే ప్రమాదం ఉంది. ప్రభుత్వం ఈ సంస్కరణలు ప్రవేశపెట్టడానికి సాకుగా చూపుతున్న ఎన్.ఇ.పి-2020లో కూడా 5+3+3+4 అనేది అభ్యసనా దశలుగానే ప్రకటించింది తప్ప దీనికోసం భౌతికపరమైన విభజన అవసరం లేదని స్పష్టంగా ప్రకటించారు. అందువలన ఈ విలీన ప్రక్రియ రాజ్యాంగం లోని ఆర్టికల్ 21-ఎ, విద్యాహక్కు చట్టం-2009, ఎన్.ఇ.పి-2020 లను పూర్తిగా ఉల్లంఘించడమే అవుతుంది.



అభివృద్ధి చెందిన అన్ని దేశాల విద్యా వ్యవస్థలు, చివరికి ఎన్.ఇ.పి-2020 కూడా బోధనా భాషగా మాతభాషను ఒకటి నుండి ఐదు తరగతుల వరకు, అవసరమైతే ఎనిమిదో తరగతి వరకు కొనసాగించడం ద్వారానే పిల్లలలో భావనలు, అభివృద్ధి అర్థవంతంగా ఉంటుందని తెలియజేస్తున్నాయి. ఇంగ్లీష్ భాష నేర్చుకోవడానికి బోధనా భాష ఆటంకం కాదని విద్యావేత్తలు చెప్తున్నారు. కానీ అశాస్త్రీయ పద్ధతిలో బోధనా భాషగా ఇంగ్లీషును ప్రవేశపెట్టి పిల్లలను బలవంతంగా ఇంగ్లీష్ మీడియంలోకి నెట్టడం పిల్లల హక్కులను కాలరాయడమే. కనీసం ఏ భాషలో చదువుకోవాలో నిర్ణయించుకునే అవకాశం కూడా వారికి ఇవ్వకపోవడం పిల్లలపై ప్రభుత్వం చేస్తున్న దాడిగానే పరిగణించాలి. దీనితో పిల్లలు ఇంటి భాషకు, బోధనా భాషకు మధ్య సమన్వయం చేసుకోలేక భావనలను అర్థం చేసుకోవడంలో ఇబ్బందులకు గురవుతుంటే భవిష్యత్తులో ఏ విధంగా విజయవంతం అవుతారో ఏలిన వారికే తెలియాలి. దీనికి భిన్నంగా ప్రైవేటు వ్యవస్థలో కూడా మాతృభాషలో బోధనను తప్పనిసరి చేయడం ద్వారానే పిల్లల జ్ఞానాభివృద్ధి, జ్ఞానతష్ణను తీర్చగలం.

42వ రాజ్యాంగ సవరణ ద్వారా విద్యను కేంద్ర జాబితా నుండి ఉమ్మడి జాబితా లోకి మార్చడం జరిగింది. ఆ యా రాష్ట్రాలలో ఉన్న భౌతిక పరిస్థితులు భౌతిక వనరుల ఆధారంగా విద్యలో కావలసిన మార్పులు, చేర్పులు చేసుకునే అధికారం రాష్ట్రాలకు రాజ్యాంగం కల్పించింది. 2019లో అధికారంలోకి వచ్చిన కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల హక్కులను నిరాకరిస్తూ అన్ని వ్యవస్థలను కేంద్రీకృతం చేస్తుంది. దానిలో భాగంగానే విద్యా రంగంలో కూడా నీట్-2020, ఎన్.ఇ.పి-2020, సిలబస్‌లో చరిత్రను మార్చడం వంటివి చేస్తున్నది. అన్ని రాష్ట్రాలు సిబిఎస్ఇ ప్రవేశపెట్టాలని ఒత్తిడి తెస్తున్నది. రాష్ట్రాలలో ఎస్.సి.ఇ.ఆర్.టి కరికులం, బోధనా పద్ధతులను తయారు చేస్తుంది. సి.బి.ఎస్.ఇ ప్రవేశపెట్టడం ద్వారా కరికులం, బోధనా పద్ధతుల్ని ఎన్.సి.ఇ.ఆర్.టి నిర్ణయిస్తుంది. సి.బి.ఎస్.ఇ ప్రవేశపెట్టడం ద్వారా చరిత్రలో మన రాష్ట్ర సంబంధిత అంశాలు ఉండే అవకాశం ఉండదు. అందువలన దీనిని ఎస్.సి.ఇ.ఆర్.టి పరిధిలోనే ఉంచి సి.బి.ఎస్.ఇ లోని మంచి అంశాలను స్వీకరించవచ్చు. విద్యా వ్యవస్థలో అద్భుత ఫలితాలు సాధించిన ఢిల్లీ ప్రభుత్వం ఇప్పటివరకు ఉన్న సి.బి.ఎస్.ఇ, ఐ.సి.ఎస్.ఇ బోర్డులతో పాటు డి.బి.ఎస్.ఇ ని ప్రారంభించి దాని అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నది. దీనికి భిన్నంగా సిబిఎస్ఇని ప్రవేశపెట్టి ఎస్.సి.ఇ.ఆర్.టి ని నిర్వీర్యం చేయడమనేది రాష్ట్ర ప్రయోజనాలకు తీవ్ర నష్టం. విద్యాబోధనలో టెక్నాలజీని మిళితం చేయడాన్ని ఆహ్వానించాల్సిందే. అయితే ఉపాధ్యాయుల బోధనకు బైజూస్ ప్రత్యామ్నాయం కాదు. కరోనా కాలంలో ఉపాధ్యాయుని ప్రత్యక్ష బోధనకు డిజిటల్ లెర్నింగ్ ప్రత్యామ్నాయం కాదని అందరికీ అనుభవం అయింది. దీనికి భిన్నంగా మంచి ఉపాధ్యాయులను గుర్తించి వారితో డిజిటల్ కంటెంట్ రూపొందించుకుంటే అది ఎక్కువ ఫలితాన్ని ఇచ్చి ఉండేది.

పాఠశాలల విలీనం, ఇంగ్లీష్ మీడియం, సి.బి.ఎస్.ఇ, బైజూస్, సాల్ట్...పేరు ఏదైనా ప్రభుత్వ విద్యా రంగంలో ప్రవేశపెట్టిన సంస్కరణలన్నీ విద్యార్థుల నమోదు పెంచేదానికి, వారిని ప్రభుత్వ పాఠశాలల్లో నిలిపి ఉంచేందుకు, వారికి నాణ్యమైన విద్య అందించేదానికి ఉపయోగపడలేదనేది అనుభవంలో అర్థమవుతున్నది. ఈ సంస్కరణలన్నీ ఉపాధ్యాయుల కుదింపు, ప్రైవేటీకరణను ప్రోత్సహించే విధంగానే ఉన్నాయనేది స్పష్టం అవుతోంది. దీనితో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న బడుగు బలహీన వర్గాల పిల్లలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది.

స్కూళ్ల విలీనం పేరుతో గందరగోళం సృష్టించడంతో, ప్రభుత్వ పాఠశాలల నుండి ప్రైవేటు స్కూళ్లకు ఈ సంవత్సరం లక్షల్లో పిల్లలు తరలి వెళ్లారు. విద్యార్థులలో పఠన సామర్థ్యాలు, గణిత సామర్థ్యాలు 2012 ముందు నాటి స్థితికి పడిపోయాయని 'అసర్ రిపోర్టు-2022' తెలియజేస్తున్నది. ఏకపక్షంగా అమలు చేసిన సంస్కరణలతో విద్యార్థుల చదువు గందరగోళంలో పడింది. ఈ నేపథ్యంలో మన రాష్ట్ర ప్రభుత్వం...ప్రభుత్వ విద్యను బలోపేతం చేసే దిశగా ఆలోచించాలి. లేని పక్షంలో విద్యా రంగంలో సానుకూల ఫలితాల కోసం ప్రజలే పోరు బాట పడతారు.

/ వ్యాసకర్త యుటిఎఫ్ గుంటూరు జిల్లా కార్యదర్శి,
సెల్ : 9966135289 /

'భగవంత్ కేసరి' గుర్తుండిపోయే చిత్రం : శ్రీ లీల



హైదరాబాద్: నందమూరి బాలకృష్ణ హీరోగా డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో షైన్ స్క్రీన్స్ బ్యానర్‌లో నిర్మిస్తున్న చిత్రం 'భగవంత్ కేసరి'. కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. శ్రీలీల కీలక పాత్ర పోషిస్తు న్నారు. దసరా కానుకగా ఈనెల 19న ఈ సినిమా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో శ్రీలీల విలేకరుల సమావేశంలో 'భగవంత్ కేసరి' విశేషాలని పంచుకున్నారు.



నెల్లూరులో శుక్రవారం జరిగిన పాదయాత్ర ముగింపు సభలో మాట్లాడుతున్న ఎంఎ గఫూర్;



ర్యాలీలో మహిళల ఆట, పాట

రాష్ట్రాభివృద్ధి గాలికి

- **వెనుకబడిన ప్రాంతాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీవ్ర నిర్లక్ష్యం**
- **బిజెపి జపం చేస్తున్న వైసిపి, టిడిపి ప్రజలకు సమాధానం చెప్పాలి : గఫూర్**

ప్రజాశక్తి- నెల్లూరు ప్రతినిధి

రాష్ట్రాభివృద్ధిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గాలికి వదిలేశాయని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్ అన్నారు. రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాల ను తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. విభజన చట్టం హామీలను కేంద్ర ప్రభుత్వం విస్మరించిందని, రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాల అభివృ ద్ధికి నిధులు కేటాయించడం లేదని అన్నారు. బిజెపి విధానాలను సమర్థిస్తోన్న రాష్ట్రంలోని అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి ప్రజలకు సమాధానం చెప్పా లని డిమాండ్ చేశారు. నెల్లూరు జిల్లా సమాగ్రాభి వృద్ధి కోసం సిపిఎం ఆధ్వర్యాన 11 రోజులపాటు నిర్వహించిన మూడు పాదయాత్రలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆత్మకూరు బస్టాండ్ నుంచి నర్తకి సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడ జరిగిన బహిరంగ సభలో గఫూర్ మాట్లాడుతూ కేవలం బటన్ నొక్కేందుకే అయితే ముఖ్యమంత్రి అవస రమా? ప్రశ్నించారు. రాష్ట్రాభివృద్ధిని విస్మరించడం తగదన్నారు. గత నాలుగన్నరేళ్లలో రాష్ట్రంలో కొత్తగా ఒక్క పరిశ్రమ కూడా ఏర్పాటు కాలేదని, పైగా, రాష్ట్ర ప్రభుత్వ తీరువల్ల ఉన్న పరిశ్రమలు రాష్ట్రం నుంచి వెళ్లిపోతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు మృగ్యమవడంతో చదువుకున్న యువ త ఉద్యోగాల కోసం చెన్నయ్, బెంగళూరు, పూణే, హైదరాబాద్ వంటి ప్రాంతాలకు వలస వెళ్లాల్సి వస్తోందన్నారు. రాష్ట్ర ప్రజలు పోరాడి సాధించు కున్న విశాఖ ఉక్కు పరిశ్రమను అమ్మివేయాలని, నిర్వీర్యం చేయాలని కేంద్రంలోని మోడీ ప్రభుత్వం చూస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రత్యేక హోదా, విశాఖ రైల్వేజోన్, పోలవరానికి నిధులు రాబట్ట డంతో పూర్తిగా విఫలమైందన్నారు. బిజెపి విధా నాలకు వైసిపి, టిడిపి, జనసేన మద్దతు తెలుపుతూ రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నాయని, దీనిని రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి, సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, ఎం.మోహన్‌రావు, గోగుల శ్రీనివాసులు, కె.అజయ్ కుమార్ తదతరులు పాల్గొన్నారు.

సిఎం ఇంటికెళ్లేందుకు టిడిపి నేతల యత్నం

- **పలువురు అరెస్టు**

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంటికెళ్లేందుకు టిడిపి నేతలు ప్రయత్నించగా, పోలీసులు వారిని అరెస్టు చేశారు. టిడిపి ముఖ్యనేతల సమావేశం టిడిపి కార్యాలయంలో శుక్రవారం జరిగింది. అనంతరం ఆ పార్టీ మాజీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న, పార్టీ అధికార ప్రతినిధి పిల్లి మాణిక్యాలరావు తదితరులు సిఎం ఇంటికెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో పోలీసు లు వారిని తాడేపల్లిలోని సిఎం క్యాంపు కార్యాలయం సమీపంలో అడ్డుకున్నారు. తమ పార్టీ అధినేత చంద్ర బాబు నాయుడు ఆరోగ్య పరిస్థితిపై ముఖ్యమంత్రికి వినతిపత్రం ఇచ్చేందుకు అనుమతివ్వాలని బుద్ధా వెంకన్న, మాణిక్యాలరావు పోలీసులతో చెప్పారు. గతంలో మంత్రి జోగి రమేష్ ఎలాగైతే చంద్రబాబుకు వినతిపత్రం ఇవ్వడానికి వెళ్లారో తాము కూడా అలానే వెళ్తామన్నారు. అనుమతి లేదంటూ పోలీసులు వారిని బలవంతంగా అరెస్టు చేసి దుగ్గిరాల పోలీస్ స్టేషన్‌కు తరలించారు. టిడిపి కార్యాలయంలో జరిగిన ముఖ్యనేతల సమావేశంలో బుద్ధా వెంకన్న సిఎం ఇంటికెళ్లే అంశంపై ప్రస్తావించలేదు. సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడుతున్న సమయంలో సిఎంకు వినతిపత్రం ఇస్తామని చెప్పారు. ఈ అంశంపై మిగిలిన నాయకులు బుద్ధా వెంకన్నతో విబేధించారు. దీంతో కేవలం కొద్దిమందితో మాత్రమే సిఎం ఇంటికెళ్లేందుకు ప్రయత్నించారు.

సజ్జల ప్రభుత్వ సలహాదారా?
జైలు సలహాదారా? : నక్కా ఆనంద్‌బాబు

సజ్జల రామకృష్ణారెడ్డి ప్రభుత్వ సలహాదారా? రాజమండ్రి జైలు సలహాదారా? అని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు నక్కా ఆనంద్‌బాబు శుక్రవారం విలేకరుల సమావేశంలో ప్రశ్నించారు. ఇంటి నుంచి తెప్పించుకునే భోజనంలో చంద్రబాబే ఏదో కలిపించుకుని ఉంటారంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో జైల్లో ఉన్న జగన్ కూడా ఇలానే చేయాలని కుటుంబ సభ్యులకు చెప్పారా? అని ప్రశ్నించారు.

హెలికాప్టర్లకు భారీ డిమాండ్



న్యూఢిల్లీ : ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల వేళ హెలికాప్టర్లకు భారీ డిమాండ్ ఏర్పడింది. రాజకీయ పార్టీలు, నేతలకు మాత్రం హెలికాప్టర్లు అందడం లేదు. ఎన్నికల తేదీ సమీపిస్తున్న కొద్దీ హెలికాప్టర్ చార్జీలు పెరుగుతున్నాయి. సాధారణంగా కొన్ని నెలల క్రితం గంటకు..లక్షన్నర రూపాయలకు అందుబాటులో ఉండే హెలికాప్టర్ ఇప్పుడు గంటకు మూడు నుంచి నాలుగు లక్షల రూపాయలకు పెరిగింది. దేశంలో మొత్తం 350 నుంచి 400 హెలికాప్టర్లు ఉన్నాయని హెలికాప్టర్ ఆపరేటింగ్ కంపెనీలు తెలిపాయి. వీటిలో దాదాపు 25 నుంచి 28 హెలికాప్టర్లు కేదార్‌నాథ్ యాత్రలో నిమగ్నమై ఉన్నాయి.

ముఖ్యంగా ఈ ఎన్నికల్లో మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్ ఎన్నికల్లో హెలికాప్టర్లకు డిమాండ్ పెరుగుతోందని ఎస్ఆర్ఎస్ చోకర్స్ హబ్ ప్రయివేట్ లిమిటెడ్, మహాకాల్ ఏవియేషన్ డైరెక్టర్ సందీప్ శర్మ తెలిపారు. ప్రస్తుతానికి హెలికాప్టర్లను ప్రముఖ పార్టీలు, వారి నాయకులు కొందరు బుక్ చేసుకున్నారు. సెప్టెంబర్ తర్వాత రాజస్థాన్‌లో చార్టర్డ్ హెలికాప్టర్ విమానాల రాకపోకలు పెరిగాయి. జులైలో చార్టర్డ్ విమానాలు 398. ఆగస్టులో 445కి పెరిగింది. సెప్టెంబర్‌లో 945 విమానాల రాకపోకలు నమోదయ్యాయి. అక్టోబర్ నెలలో దాదాపు 1500 నుంచి 2000 చార్టర్డ్ హెలికాప్టర్ విమానాలు అవసరమవుతాయని అంచనా.

ఎన్నికల కోసం కేదార్‌నాథ్ హెలికాప్టర్లు

ప్రస్తుతం కేదార్‌నాథ్‌లో 25 నుంచి 28 హెలికాప్టర్లు మోహరించి ఉన్నాయి. దీపావళి తర్వాత రక్షాబంధన్ వరకు అక్కడ ఉన్న హెలికాప్టర్లు బిజీగా ఉంటాయి. అనంతరం హెలికాప్టర్లకు సాంకేతిక పరమైన పూర్తి చేయాల్సి ఉంటుంది. ఆ. తరువాత విమానయాన శాఖ అధికారులు హెలికాప్టర్లను తనిఖీ చేస్తారు. సర్టిపై చేసిన హెలికాప్టర్‌లు టేకాఫ్‌కు సంబంధించిన సరైన నివేదిక వచ్చాకే.. ఎన్నికల కార్యక్రమాల్లో వినియోగించనున్నారు.

దసరాకు 'గుంటూరు కారం' పాట




హీరో మహేష్‌బాబుతో దర్శకుడు త్రివిక్రమ్ తీస్తున్న సినిమా గుంటూరుకారం. హారిక హాసిని సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఈ సంక్రాంతికి విడుదల కానుంది. దసరా సందర్భంగా తొలి పాటని విడుదల చేయనున్నట్టుగా సమాచారం. తమన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే మూడు పాటలు సిద్ధం చేశారు. అందులోంచి ఓ పాట దసరాకి వినిపిస్తారు. శ్రీలీల, మీనాక్షి చౌదరి కథానాయికలుగా నటిస్తున్నారు. ఓ ప్రత్యేక గీతం కోసం మరో స్టార్ హీరోయిన్‌ని తీసుకొస్తారని చిత్ర పరిశ్రమలో చర్చ నడుస్తోంది.

'గ్యాంగ్‌స్టర్'గా విజయ్ దేవరకొండ



విజయ్ దేవరకొండ వరుసగా రెండు సినిమాల్లో నటిస్తున్నారు. ప్రస్తుతం పరశు రామ్‌తో ఓ చిత్రం చేస్తూనే.. మరోవైపు గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలోనూ మరో సినిమా చేస్తున్నారు. ఈ రెండూ చిత్రీకరణ దశలోనే ఉన్నాయి. వీటి తర్వాత దిల్ రాజు నిర్మాణంలో మరో ప్రాజెక్ట్ చేయనున్నారు. దీన్ని రవికిరణ్ కోలా తెరకెక్కించనున్నారు. 1980ల నేపథ్యంలో సాగే మాఫియా కథాంశంతో ఈ చిత్రం రూపొందనున్నట్లు తెలిసింది.

కష్టపడితేనే నాకు తృప్తి: చిరంజీవి



హైదరాబాద్: సినిమాల్లో ఎంతో కష్టపడి ఒళ్లు హూనం చేసుకుంటేనే తనకు తృప్తి ఉంటుందని సినీ హీరో చిరంజీవి వ్యాఖ్యానించారు. తాజాగా ఓ పుస్తకావిష్కరణ సభకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. ఏ రంగంలోనైనా కష్టపడి పనిచేయాలని చెప్పారు. ఈ సందర్భంగా హీరోయిజం గురించి ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి. 'ప్రతి మనిషి నిరంతరం ప్రయత్నిస్తూనే ఉండాలి. నేను కూడా ఎన్నిరోజులు ఇలా కష్టపడి డ్యాన్సులు, ఫైట్లు చేయాలని ఎప్పుడూ అనుకుంటూ ఉంటాను. నడుచుకుంటూ వెళ్లి కూడా సూపర్ హిట్లు సొంతం చేసుకుంటున్నారు. హాయిగా సెట్‌కు వెళ్లి మేకప్ వేసుకుని నటించి.. వాళ్లు ఇచ్చిన డబ్బులు తీసుకుని జేబులో పెట్టుకుని వచ్చేస్తే బాగుంటుంది. కానీ, అలాంటి పరిస్థితి మనది కాదు. మనం ఆడాలి, నిజంగానే ఫైట్లు చేయాలి. ఒళ్లు హూనం చేసుకోవాలి. అలా చేయకపోతే దర్శక-నిర్మాతలకు, సినిమా చూసే ప్రేక్షకులకు తృప్తి ఉండదు. అలాగే నాకు కూడా తృప్తిగా ఉండదు. అందుకే కష్టపడాలి' అని అన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల (నంద్యాల)

నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం కొండమీదపల్లె (దళవాయి పల్లె) గ్రామానికి చెందిన రైతు గజ్జెల శ్రీనివాసుల రెడ్డి (38) అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు... కొండమీదపల్లె (దళవాయిపల్లె) గ్రామానికి చెందిన రైతు గజ్జెల శ్రీనివాసులరెడ్డి తనకున్న 4 ఎకరాలు పొలాన్ని సాగు చేస్తూ మరో ఐదు ఎకరాలు కౌలుకు తీసుకుని పప్పు శనగ పంటను సాగు చేసేవారు. గత నాలుగేళ్లుగా నుండి పంట సరిగా రాకపోవడం, సాగు కోసం చేసిన అప్పులకు వడ్డీలు పెరిగిపోయాయి. దాదాపు రూ. 20 లక్షలకు పైగా అప్పు ఉండడం, అప్పులు ఇచ్చిన వారు తిరిగి చెల్లించాలని ఒత్తిడి చేయడంతో శ్రీనివాసులు రెడ్డి తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. గురువారం రాత్రి విషపు మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేశారు. వెంటనే కుటుంబ సభ్యులు గమనించి శ్రీనివాసులు రెడ్డిని తాడిపత్రి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందారు. ఈయనకు భార్య విజయలక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. శ్రీనివాస్ రెడ్డి బంధువుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ రమేష్ రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

గాడి తప్పిన పరీక్షలు...

- ప్రశ్నాపత్రాలు సైతం ఇవ్వని విద్యాశాఖ
- బోర్డుపై ప్రశ్నలు చూసి పరీక్ష రాయాల్సిన దుస్థితి
- 45 నిమిషాల్లో రాయాల్సిన పరీక్ష గంటన్నరపైనే



ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

'నాడు-నేడు' అంటూ హడావుడి చేస్తున్న ప్రభుత్వం విద్యార్థులకు అత్యంత ముఖ్యమైన చదువు, పరీక్షల విషయంలో మాత్రం ఏమాత్రం పట్టించుకోని దుస్థితి నెలకొంది. విద్యార్థుల సంఖ్యను తగినట్లుగా ఉపాధ్యాయులు లేక ప్రభుత్వ పాఠశాలల్లో చదువు కునారిల్లుతుండగా పరీక్షల నిర్వహణ విధానం సైతం అస్తవ్యస్తంగా తయారైంది.

ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో ప్రతియేటా ఎఫ్ఎ-1, ఎఫ్ఎ-2, ఎఫ్ఎ-3, ఎఫ్ఎ-4 పరీక్షలతోపాటు, ఎస్ఎ-1, ఎస్ఎ-2 పరీక్షలను విద్యాశాఖ నిర్వహిస్తోంది. పరీక్ష అంటే ప్రశ్నాపత్రాలు ఇస్తే విద్యార్థులు వాటికి సమాధానాలు రాయాలి. అయితే ఎస్ఎ-1, ఎస్ఎ-2 ప్రశ్నాపత్రాలు ఇస్తున్న విద్యాశాఖ, ఎఫ్ఎ-1, ఎఫ్ఎ-4 పరీక్షలకు మాత్రం ప్రశ్నాపత్రాలు ఇవ్వడం లేదు. పరీక్షకు గంటన్నర ముందు వాట్సాప్‌లో ప్రశ్నాపత్రం స్కూళ్లకు పంపుతున్నారు. ఈ పేపర్‌లో ప్రశ్నలను ఉపాధ్యాయులు బోర్డుపై రాస్తే, ఆ ప్రశ్నలను విద్యార్థులు చూసుకుని పరీక్ష రాయాల్సిన పరిస్థితి ఉంది. ఈ నెల మూడో తేదీ నుంచి ఐదో తేదీ వరకూ మూడు రోజులపాటు ఎఫ్ఎ-2 పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షలు రాసేందుకు విద్యార్థులు నానావస్థలు పడ్డారు. ఉమ్మడి కర్నూలు జిల్లావ్యాప్తంగా లెక్కలు తీస్తే ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు మూడు వేలకుపైగా ఉన్నాయి. వీటిలో మూడు లక్షల మందికిపైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. ఎఫ్ఎ పరీక్షలకు సమయం 45 నిమిషాలు మాత్రమే. 20 మార్కులకు నిర్వహిస్తారు. పరీక్షకు సంబంధించిన ప్రశ్నలు బోర్డుపై ఉపాధ్యాయులు రాస్తే వాటిని రాసుకుని పరీక్ష రాయడానికి విద్యార్థులకు గంటన్నరకుపైగా పడుతోంది. ఈ విధానంలో కాపీయింగ్ పెద్దఎత్తున సాగుతోంది. బోర్డుపై రాసేందుకు ఉపాధ్యాయులు సైతం నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రాథమిక పాఠశాలల్లో ఒకరిద్దరు ఉపాధ్యాయులు ఉన్నచోట అన్ని ప్రశ్నాపత్రాలు బోర్డుపై రాయడం కష్టతరంగా మారడంతో ఉపాధ్యాయులు సతమతమవుతున్నారు. ప్రశ్నాపత్రాలు ఇవ్వకుండా నిర్వహిస్తున్న పరీక్షల విధానంపై విద్యార్థుల తల్లిదండ్రులు సైతం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక ఎస్ఎ-1, ఎస్ఎ-2 పరీక్షలకు ప్రశ్నాపత్రం ఇస్తున్నప్పటికీ జవాబులు రాసేందుకు ఇచ్చే తెల్లకాగితాలు విద్యాశాఖ ఇవ్వడం లేదు. పరీక్షలకు సంబంధించి విద్యార్థుల నుంచి ఎటువంటి ఫీజులూ వసూలు చేయరాదని నిబంధనలు చెబుతున్నాయి. ఎక్కడైనా వసూలు చేసేందుకు ప్రయత్నించినా ప్రధానోపాధ్యాయులపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో ఉపాధ్యాయులకు ఏంచేయాలో దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. ఇప్పటికే మూడు, నాలుగు, ఐదు తరగతులను హైస్కూళ్లలో విలీనం చేయడంతో ప్రభుత్వ విద్య పూర్తిగా గాడితప్పింది. ఇప్పుడు పరీక్ష విధానంలో విద్యాశాఖ వ్యవహరిస్తున్న తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పరీక్షలకు సంబంధించి ప్రశ్నాపత్రాలు కూడా ఇవ్వకపోతే విద్యార్థులు ఏవిధంగా పరీక్షలు రాయాలో ప్రభుత్వమే చెప్పాలి. పరీక్ష ప్రశ్నాపత్రాలు కూడా ఇవ్వలేని స్థితిలో ప్రభుత్వం ఉందా అంటూ తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులంతా పేద కుటుంబాలకు చెందినవారే. ఈవిధంగా పరీక్షలు నిర్వహిస్తే విద్యార్థులు ఏవిధంగా చదువులో రాణిస్తారో ప్రభుత్వమే చెప్పాలి. ప్రశ్నాపత్రాలు ఇవ్వకుండా పరీక్షలు నిర్వహించడం పలు గ్రామాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికైనా ప్రభుత్వం పరీక్షలకు సంబంధించి ప్రశ్నాపత్రాలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

వీఆర్‌కు 9 మంది పోలీసులు

- మట్కా, పేకాట నిర్వాహకులతో సంబంధాలే కారణం..

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

మట్కా, పేకాట నిర్వాహకులతో సంబంధాలు కొనసాగించిన 9 మంది పోలీసులపై ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ కొరడా ఝళిపించారు. ఇందులో భాగంగా జిల్లాలోని గుంతకల్లు, కళ్యాణదుర్గం సబ్ డివిజన్ల పరిధిలోని 9మందికి మట్కా, పేకాటలతో సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు తేలడంతో వీఆర్‌కు పంపించారు. వీరిలో ఒక ఎస్ఐ, ముగ్గురు హెడ్ కానిస్టేబుళ్లు, ఐదుగురు కానిస్టేబుళ్లు ఉన్నారు. వీరి అక్రమ వ్యవహారాలపై లోతుగా, సమగ్రంగా విచారించేందుకు డిఎస్పీ స్థాయి అధికారికి బాధ్యతలు అప్పగించారు. సదరు ప్రత్యేక అధికారి విచారణలో అక్రమాలు తేలితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోనున్నారు.

పులివెందుల పోలీసులపై సస్పెన్షన్ వేటు

- వీఆర్‌కు ఎస్ఐ, కానిస్టేబుల్, హోంగార్డు సస్పెన్షన్

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పోలీస్ శాఖలో అక్రమాలు, అవినీతికి పాల్పడిన పోలీసులపై ఎస్పి సిద్దార్థ కౌశల్ కొరడా ఝళిపించారు. ఎస్ఐ సత్యనారాయణను వీఆర్‌కు పంపారు. అలాగే కానిస్టేబుల్ బి. నరసింహారెడ్డి, హోంగార్డు జి.రవికుమార్‌ను సస్పెండ్ చేశారు. పులివెందుల సిఐ రాజు వివరాల మేరకు.. ప్రజలను బెదిరిస్తూ పులివెందుల పట్టణ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ నరసింహారెడ్డి, హోంగార్డు రవికుమార్ బలవంతపు వసూళ్లు చేస్తున్నారన్న ఆరోపణలపై ఎస్పి విచారణకు ఆదేశించారు. విచారణలో వచ్చిన ఆరోపణలను నిజమని నిర్ధారణ కావడంతో వారిపై పులివెందుల పోలీస్ స్టేషన్‌లో 484/2023 గా క్రిమినల్ కేసు నమోదు చేసి వారినీ విధులు నుండి సస్పెండ్ చేశారు.

21 నుంచి ప్రజారక్షణ భేరి

- సీతంపేటలో బస్సుయాత్ర ప్రారంభం
- సిపిఎం రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు సుబ్బరావమ్మ

ప్రజాశక్తి- బెలగాం

రాష్ట్ర సమగ్ర అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఎం ఆధ్వర్యాన ప్రజా రక్షణ భేరి పేరిట ఈనెల 21నుంచి బస్సుయాత్రను ప్రారంభిస్తున్నట్లు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.సుబ్బరావమ్మ తెలిపారు. రాష్ట్రంలో మూడు ప్రాంతాల నుంచి బస్సుయాత్రలు ప్రారంభం కానుండగా, జిల్లాలోని సీతంపేటలో బస్సుయాత్రను సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రారంభిస్తారని తెలిపారు. శుక్రవారం సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ బస్సుయాత్ర అరుకు, పాడేరు, రంపచోడవరం, పశ్చిమగోదావరి జిల్లాల మీదుగా విజయవాడ చేరుతుందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వలన ప్రజలు, గిరిజనులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. ఈ నష్ట నివారణ చర్యలు జరగాలంటే రాష్ట్రంలో సమగ్ర అభివృద్ధి కోసం విద్యావంతులు, మేధావులు, అన్ని రంగాల ప్రజలతో సిపిఎం సదస్సులు నిర్వహిస్తోందన్నారు. ఈ బస్సు యాత్రలో ప్రజలంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

కడపలో రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు

- 13 జిల్లాల నుంచి 550 మంది క్రీడాకారులు రాక

ప్రజాశక్తి - కడప

కడప జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 14 నుంచి 16 వరకు మూడు రోజుల పాటు కడపలోని జిల్లా స్పోర్ట్స్ అథారిటీ మైదానంలో అండర్ -19 బాలుర, సీనియర్ ఉమెన్ విభాగాలలో రాష్ట్రస్థాయి 2023-24 హ్యాండ్ బాల్ ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు లయన్ కె చిన్నపరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక హోటల్ గ్రాండ్ ఇన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్రస్థాయి పోటీల వివరాలను తెలిపారు. ఈనెల 14 నుండి 16 వరకు మూడు రోజులపాటు కడపలోని జిల్లా స్పోర్ట్స్ అథారిటీ మైదానంలో పోటీలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు.

రాష్ట్రంలోని 13 జిల్లాలకు చెందిన 550 మంది క్రీడాకారులు ఈ పోటీలలో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. వీరితోపాటు 40 మంది మేనేజరు, కోచ్‌లు, అబ్జర్వర్లు, టెక్నికల్ అసిస్టెంట్లు కడప వస్తున్నారని తెలిపారు. వీరందరికీ భోజన వసతి సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ ఛాంపియన్ షిప్ పోటీలను ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, వైసిపి జిల్లా అధ్యక్షులు, స్టెప్ సిఇఒ సి. సాయి గ్రేస్, డిఇఒ ప్రారంభిస్తారని తెలిపారు.


శ్రీవారి బ్రహ్మోత్సవాలకు నేడు అంకురార్పణ

ప్రజాశక్తి -తిరుమల

తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు అక్టోబరు 15 నుండి 23వ తేదీ వరకు జరగనున్నాయి. ఇందుకోసం అక్టోబరు 14న అంకురార్పణ నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాల్లో ఉదయం 8 నుండి 10 గంటల వరకు, రాత్రి 7 నుండి 9 గంటల వరకు వాహనసేవలు జరుగనున్నాయి. గరుడవాహనసేవ రాత్రి 6.30 గంటలకు ప్రారంభం కానుంది. శనివారం రాత్రి 7 నుండి 8 గంటల వరకు శాస్త్రోక్తంగా అంకురార్పణం జరగనుంది.

ఎండుతున్న వరి

ఆందోళనలో అన్నదాత



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

పార్వతీపురం మన్యం జిల్లాలో లక్షా 66వేల 886 ఎకరాల్లో వరి, 12,500 ఎకరాల్లో మొక్కజొన్న, 14,480 ఎకరాల్లో పత్తి పంట సాగవుతోంది. జిల్లాలో తోటపల్లి, వెంగళరాయసాగర్, పెద్దగెడ్డ ప్రాజెక్టులున్నప్పటికీ నిర్వహణ సరిగా లేకపోవడం, పిల్లకాలువల పనులు పూర్తిచేయకపోవడం వంటి కారణాల వల్ల అరకొర గానీ నీరు అందుతోంది. అలాగే జంఝావతి, వట్టిగెడ్డ ప్రాజెక్టులున్నా ఇటువంటి ఆటంకాలే ఉన్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో వరుణుడు కూడా ముఖం చాటేయడంతో పంట పొలాలు ఎండిపోతున్నాయి. జూన్‌లో 51.9 మిల్లీమీటర్ల వర్షపాతం లోటు ఉండడంతో నారు వేయడం ఆలస్యమైంది. జులైలో వర్షాలు సహకరించడంతో నారుపోతలు పూర్తయినప్పటికీ ఆగస్టులో తిరిగి లోటు వర్షపాతం నమోదు కావడంతో సెప్టెంబర్ నెలాఖరు వరకూ పడిన వర్షపునీటితోనే రైతులు ఉబాలు పట్టారు. ఉబాలు అయ్యాయంటూ ఊపిరి పీల్చుకునే లోపు తిరిగి అక్టోబర్ 1వ తేదీ నుంచి పూర్తిగా వర్షాలు కురవలేదు. గడిచిన 13రోజుల వ్యవధిలో 63.2 మిల్లీమీటర్ల లోటు వర్షపాతం నమోదైంది. మొత్తం 15 మండలాలకు గాను వీరఘట్టం, జిఎల్‌పురం, కురుపాం, కొమరాడ మండల్లాల్లో వర్షపులోటు ఉంది. సీజన్ మొత్తంగా పరిశీలిస్తే ఈ జిల్లాలోనూ జూన్, ఆగస్టులో వర్షం తక్కువగానే పడింది. ప్రస్తుతం కొమరాడ, పార్వతీపురం, మక్కువ తదితర మండలాల్లో పంట పొలాలు బీటలు వారుతున్నాయి. మరోవైపు ఇటీవల ఎండ తీవ్రత కూడా ఎక్కువగా ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎకరా వరికి రూ.30వేల నుంచి రూ.40వేల వరకు పెట్టుబడులు పెట్టేశామని, ప్రస్తుతం వర్షాలు పడకపోతే మన్నైపోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్కువ వర్షం కురవడంతో చెరువులు పెద్దగా నిండలేదు. మిగిలిన రోజుల్లో తీవ్రమైన ఎండలు కాయడంతో చెరువుల్లో నీరు కూడా పూర్తిస్థాయిలో లేని పరిస్థితి దాపురించింది. ఈనేపథ్యంలో అత్యంత కీలకమైన పొట్టదశలోను, గింజకట్టే దశలోనూ ఉన్న వరి ఎండిపోతోంది.

ప్రతి తడికీ రూ.500

చెప్పుకోవడానికి తోటపల్లి కాలువ ఉందని తప్ప కనీసం చుక్క నీరు రాకపోవడంతో వరుణిపైనా, మోటారుపైనా ఆధారపడి పంటలు సాగు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఎకరాన్నర భూమి ఉంది. దీనికి సుమారు రూ.20వేలు ఖర్చు అయ్యింది. కాలువ ద్వారా నీరు వస్తే పంటల సాగు చేస్తే ఎకరాకు 35 బస్తాలు దిగుబడి వస్తుంది. గంటకు రూ.500 చొప్పున మోటర్ ద్వారా పంటలు సాగు చేస్తున్నాం. దిగుబడి తగ్గితే అప్పులు తప్పవు.

రఘుమండ తాతబాబు,
రైతు, గడగమ్మ , వీరఘట్టం మండలం

అప్పులే మిగులుతున్నాయి

ప్రతి ఏటా వరుణుడిపై ఆశలు పెట్టుకుని పంటలు సాగు చేస్తున్నప్పటికీ గత పది రోజులుగా ఎండ వేడిమి వల్ల పంట నాశనమవుతుంది. వర్షాలు కురవక పంట పూర్తిగా ఎండిపోయిన స్థితికి చేరుకుంది. ప్రస్తుతం పంట పొట్టదశలో ఉన్నందున అధికంగా నీరు అవసరం ఉంది.ప్రతి ఏటా నాలుగు ఎకరాలు సాగు చేస్తున్నాను. ఈ ఏడాది కూడా సాగునీటి సమస్య ఏర్పడింది.

వి.పోలినాయుడు, రైతు, గడగమ్మ,
వీరఘట్టం మండలం

50వేల మంది గర్భిణులకు ఆరోగ్య సేవలు బంద్

- గాజాలో ఇజ్రాయిల్ ఆంక్షల ఫలితం

గాజా: ఇజ్రాయెల్ దాడితో ధ్వంసమైన గాజాలో తాగునీరు, కరెంటు లేకుండా గర్భిణులతో సహా ప్రజలు సంక్షోభంలో ఉన్నారని ఐక్యరాజ్యసమితి సంస్థ పేర్కొంది. ఆహారం, నీరు, విద్యుత్ ఇతర అవసరమైన సామాగ్రి లేకుండా పోతున్నాయని ఐరాస ప్రతినిధి స్టెఫాన్ డుజారిక్ చెప్పారు. ప్రస్తుతం 50,000 మంది గర్భిణులకు అవసరమైన ఆరోగ్య సేవలు అందుబాటులో లేవు. వీరిలో 5,500 మంది మహిళలు ప్రసవానికి దగ్గరగా ఉన్నారు. ఎమర్జెన్సీ షెల్టర్లలో కూడా నీటి సమస్య తీవ్రమవుతోంది.గాజాలోని ఆసుపత్రులు కూలిపోయే దశలో ఉన్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపింది. ఆసుపత్రులకు కొన్ని గంటలపాటు మాత్రమే కరెంటు వస్తుంది. ఇది అవసరమైన చికిత్స కోసం మాత్రమే ఉపయోగించబడుతుంది. మృతుల సంఖ్య పెరగడంతో ఆసుపత్రులు క్షతగాత్రులతో కిక్కిరిసిపోయాయి. మందులతో సహా అత్యవసర సామాగ్రి కొరత కూడా ఆసుపత్రుల బంద్‌కు దారి తీస్తుంది.గాజాలో 34 ఆరోగ్య కేంద్రాలపై దాడులు జరిగాయి. 11 మంది ఆరోగ్య కార్యకర్తలు కూడా మరణించారు. నీటి సరఫరా వ్యవస్థలన్నీ దెబ్బతిన్నాయి. 423,000 మందికి పైగా ప్రజలు ఇప్పటికే ఈ ప్రాంతం నుండి పారిపోయారు. %ఖచీ% నేతత్వంలోని 18 పాఠశాలలతో సహా 88 విద్యాసంస్థలు ధ్వంసమయ్యాయి. వాటిలో రెండు ఎమర్జెన్సీ షెల్టర్లు.ఐక్యరాజ్యసమితి నియమించిన హక్కుల నిపుణులు పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయెల్ ఆంక్షలు అన్యాయమని, ఉద్దేశపూర్వకంగా ఆకలితో చంపడం మానవాళికి వ్యతిరేకంగా నేరమని అన్నారు. అమాయక పౌరులను లక్ష్యంగా చేసుకుని హింసను సమర్థించడం లేదు. ఇది అంతర్జాతీయ చట్టం ప్రకారం నిషేధించబడింది మరియు యుద్ధ నేరం అవుతుంది. ఉద్దేశపూర్వకంగా ఆకలితో చంపడం మానవత్వానికి వ్యతిరేకంగా నేరమని నిపుణులు అంటున్నారు.ఇజ్రాయెల్ పాలస్తీనియన్లను ఒక రోజులో గాజా విడిచిపెట్టమని బెదిరించింది. గురువారం అర్ధరాత్రి ఎమర్జెన్సీ షెల్టర్‌లలో ఉన్నవారితో సహా ప్రజలను ఖాళీ చేయమని అల్టిమేటం జారీ చేసింది. దక్షిణాది ప్రాంతానికి తరలించాలని కోరారు. కానీ వైమానిక దాడిలో తీవ్రంగా గాయపడిన వారితో సహా 10 లక్షల మందిని తరలించడం అసాధ్యమని ఐక్యరాజ్యసమితి పేర్కొంది. గాజాలో ప్రమాదకర పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు.యుద్ధం ప్రారంభమైన వారంలో, గాజాలో ఇజ్రాయెల్ వైమానిక దాడులు 1,799 మంది పాలస్తీనియన్లను చంపాయి. 6,388 మంది గాయపడ్డారు. ఇజ్రాయెల్‌లో మరణించిన వారి సంఖ్య 1,300కి చేరుకుంది 3,000 మందికి పైగా గాయపడ్డారు. ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లోని వివిధ ప్రాంతాలలో ఇజ్రాయెల్ షెల్లింగ్‌లో తొమ్మిది మంది మరణించారు. ఇజ్రాయెల్ 3.5 మిలియన్ల సైనికులు, ట్యాంకులు, ఇతర ఆయుధాలను గాజా సరిహద్దులో మోహరించింది.

పుర్కాయస్థ, అమిత్‌ల పిటిషన్లను తోసిపుచ్చిన కోర్టు

న్యూఢిల్లీ : అక్రమ కార్యకలాపాల నిరోధక చట్టం (యుఎపిఎ) నిబంధనల కింద నమోదు చేసిన కేసులో తమను అరెస్టు చేయడాన్ని, పోలీసు కస్టడీకి ఇవ్వడాన్ని సవాలు చేస్తూ న్యూస్‌క్లిక్ వ్యవస్థాపకుడు ప్రబీర్ పుర్కాయస్థ, హెచ్‌ఆర్ హెడ్ అమిత్ చక్రవర్తి పెట్టుకున్న పిటిషన్లను ఢిల్లీ హైకోర్టు శుక్రవారం తోసిపుచ్చింది. ఆ రెండు పిటిషన్లలో విచారణకు అర్హమైన అంశాలు లేవనిజస్టిస్ తుషార్ రావు గేదెల పేర్కొన్నారు. న్యూస్‌క్లిక్ ప్రధాన కార్యాలయంపైన, ఆ వెబ్ పోర్టల్ సిబ్బంది ఇళ్లపైన ఢిల్లీ పోలీసులు ఈ నెల 3న తెల్లవారు జాము నుంచి రోజంతా దాడి చేసి, వ్యవస్థాపక ఎడిటర్ ప్రబీర్ పుర్కాయస్థను, హెచ్‌ఆర్ విభాగం అధిపతి అమిత్ చక్రవర్తిని అరెస్టు చేశారు. కోర్టు తీర్పుకు సంబంధించిన పూర్తి వివరాలు అందాల్సి వుంది.



బెంగళూరులో రూ. 42 కోట్లు స్వాధీనం

బెంగళూరు: కర్ణాటక రాజధాని బెంగళూరులో ఆదాయపన్ను శాఖ అధికారులు శుక్రవారం రూ.42 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఒక మాజీ మహిళా కార్పొరేటర్ చెందిన భవనంలోని పరుపు కింద దాచి ఉంచిన ఈ భారీ నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక నగల దుకాణాల యజమానులు, ఇతరుల నుంచి ఈ భారీ మొత్తాన్ని మాజీ కార్పొరేటర్, ఆమె భర్త సేకరించినట్లు సమాచారం. ఈ మొత్తాన్ని రాబోయే ఐదు రాష్ట్రాల ఎన్నికల కోసం పంపిణీ చేసేందుకు సిద్ధం చేసినట్లు సమాచారం. ఈ సమాచారం అందుకున్న ఐటీ అధికారులు బెంగళూరు నగరంలో దాడులు నిర్వహించారు.

ఆర్టీ నగర్‌లోని ఆత్మానంద కాలనీలోని ఓ ఫ్లాట్‌లో తనిఖీలు చేపట్టి ఈ మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నారు. పరుపు కింద 23 పెట్టెల్లో దాచిపెట్టిన రూ.500 నోట్ల కట్టలను అధికారులు గుర్తించి పట్టుకున్నారు. ఈ మొత్తం రూ.42 కోట్లుగా లెక్కగట్టారు. అయితే కొంత కాలం నుంచి ఈ ఫ్లాట్ ఖాళీగా ఉందని, ఇక్కడ ఎవరూ నివసించట్లేదని సమాచారం. ఈ మాజీ కార్పొరేటర్ భర్త ఓ కాంట్రాక్టర్ అని తెలుస్తోంది. ఈ ఘటనకు సంబంధించి ఐటీ అధికారులు పూర్తి విచారణ చేపడుతున్నారు.

దారుణమైన దుర్వినియోగం !

- యుఎపిఎ, ఆర్థిక నిబంధనలతో జర్నలిస్టులు, మానవ హక్కుల కార్యకర్తలను తొక్కిపెడుతున్నారు
- అంతర్జాతీయ మానవ హక్కుల గ్రూపుల ఖండన



న్యూఢిల్లీ : జర్నలిస్టులను, మానవ హక్కుల కార్యకర్తలను, సామాజిక కార్యకర్తలను, ప్రభుత్వాన్ని విమర్శించే వారి నోళ్ళను మూయించేందుకు భారత అధికారులు తీవ్రవాద నిరోధక చట్టాలను, ఆర్థిక నిబంధనలను, ఇతర చట్టాలను దుర్వినియోగం చేస్తున్నారంటూ అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థలు తీవ్రంగా విమర్శించాయి. హ్యూమన్ రైట్స్ వాచ్, అమ్నెస్టీ ఇంటర్నేషనల్, మరో 10 అంతర్జాతీయ హక్కుల గ్రూపులు ఈ మేరకు శుక్రవారం సంయుక్తంగా ఒక ప్రకటన జారీ చేశాయి. న్యూస్‌క్లిక్ కార్యాలయాలు, సిబ్బంది నివాసాలపై ఇటీవల దాడులు జరిగిన నేపథ్యంలో వీరి ప్రకటన వెలువడింది. 13ఏళ్ళ నాటి కేసులో రచయిత అరుంధతి రాయ్‌ను ప్రాసిక్యూట్ చేయడానికి ఢిల్లీ లెఫ్టినెంట్ జనరల్ ఇటీవల అనుమతినివ్వడాన్ని కూడా ఆ ప్రకటన ప్రస్తావించింది. న్యూస్‌క్లిక్‌పై జరిగిన దాడులను నిరసిస్తూ జరిగిన నిరసనల్లో అరుంధతి రాయ్ పాల్గొనడమే ఇందుకు కారణమై వుండవచ్చని మానవ హక్కుల గ్రూపులు భావిస్తున్నాయి.

సామాజిక కార్యకర్త తీస్తా సెత్వలాద్‌ను లక్ష్యంగా చేసుకోవడం, బిబిసి ఇండియా కార్యాలయాలపై ఆదాయపన్ను అధికారుల దాడులు, ఢిల్లీ అల్లర్ల కేసులో విద్యార్థి కార్యకర్తలపై రాజకీయ దురుద్దేశపూరితమైన అభియోగాలు మోపడం, కాశ్మీరీ జర్నలిస్టులు ఫహద్ షా, సజద్ గుల్, కాశ్మీరీ మానవ హక్కుల కార్యకర్త ఖుర్రం పర్వేజ్‌లను అరెస్టు చేసి నిర్బంధించడం, బీమా కొరెగావ్ కేసులో దళితులు, ఆదివాసీలు, బహుజన కార్యకర్తల నిర్బంధాన్ని కొనసాగించడం వంటి చర్యలను ఆ ప్రకటన ప్రముఖంగా ప్రస్తావించింది.

అణచివేత ఉధృతం

"మానవ హక్కులను పరిరక్షించడంలో విఫలమైనందుకు బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించే న్యూస్‌క్లిక్‌పై దాడులు, అరెస్టులు ఈ క్రమంలో స్వతంత్ర జర్నలిస్టులను వేధించేందుకు, వారిని బెదిరించేందుకు అధికారులు చేపట్టిన తాజా ప్రయత్నాలు" అని ఆ ప్రకటన పేర్కొంది.

రిపోర్టర్స్ విత్‌అవుట్ బోర్డర్స్, కమిటీ టు ప్రొటెక్ట్ జర్నలిస్ట్స్, ఫ్రంట్‌లైన్ డిఫెండర్స్, ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ జర్నలిస్ట్స్, ఇంటర్నేషనల్ సర్వీస్ ఫర్ హ్యూమన్ రైట్స్, ఆసియన్ ఫోరమ్ ఫర్ హ్యూమన్ రైట్స్ అండ్ డెవలప్‌మెంట్ (ఫోరమ్-ఆసియా) తదితర సంస్థలు ఈ ప్రకటనను జారీ చేశాయి. "2014లో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి, మీడియా, పౌర సమాజంపై అధికారుల దాడులు, అణచివేత చర్యలు ఎక్కువైపోయాయి." అని ఆ ప్రకటన పేర్కొంది. ముఖ్యంగా మైనారిటీ గ్రూపులకు చెందిన జర్నలిస్టులు, కార్యకర్తలకు ముప్పు ఎక్కువగా వుందని పేర్కొంది.

రాజకీయ దురుద్దేశ్యంతోమోపిన కేసుల్లో అరెస్టు చేసిన జర్నలిస్టులు, మానవ హక్కుల కార్యకర్తలు, సమాజిక కార్యకర్తలు, విమర్శకులు అందరినీ తక్షణమే, బేషరతుగా విడుదల చేయాలని మానవ హక్కుల సంస్థలు కోరాయి. వారిపై మోపిన అభియోగాలన్నింటినీ ఉపసంహరించాలని, క్రిమినల్ ప్రాసిక్యూషన్ ద్వారా వారిని బెదిరించడం, వేధించడం, నిరోధించడం ఆపాలని కోరాయి.

యుఎపిఎ దుర్వినియోగం

"బూటకమైన తీవ్రవాదం, ఇతర క్రిమినల్ అభియోగాలపై వారు జర్నలిస్టులను అరెస్టు చేశారు. ఆర్థికపరమైన అవకతవకలు జరిగాయన్న ఆరోపణలతో విమర్శకులను, స్వతంత్ర వార్తా సంస్థలను లక్ష్యంగా పెట్టుకుంటున్నారు. అలాగే, వారు తీవ్రవాద నిరోధక చట్టాన్ని, జాతీయ భద్రతా చట్టాలను, విదేశీ నిధుల చట్టాలను, ఆదాయపన్ను నిబంధనలను ఉపయోగించి మానవ హక్కుల కార్యకర్తలను, శాంతియుత ఆందోళనకారులను లక్ష్యంగా చేసుకుని, వేధిస్తున్నారు." అని ఆ ప్రకటన పేర్కొంది.

యుఎపిఎను ఉపయోగించడం పెరిగినప్పటికీ, కేవలం 2016 నుండి 2019 వరకు ఈ చట్టం కింద నమోదైన కేసుల్లో కేవలం 2.2శాతం కేసుల్లో మాత్రమే నేర నిరూపణ జరిగిందని, 11శాతం కేసులు సాక్ష్యాధారాలు లేక మూతబడ్డాయని అమ్నెస్టీ ఇంటర్నేషనల్ చేసిన విశ్లేషణను కూడా ఆ ప్రకటన ఉదహరించింది.

"ఈ కేసుల్లో అభియోగాల నమోదులో జాప్యం జరగడం, అనేకమందిని నిర్దోషులుగా విడిచిపెట్టడం చూస్తుంటే తీవ్రవాద నిరోధక చట్టాన్ని ఏళ్ళ తరబడి విమర్శకుల నోళ్ళు మూయించడానికి వాడుతున్నట్లు అర్థమవుతోంది. మాట్లాడాలనుకునేవారికి ఒళ్ళు గగుర్పొడిచేలా సందేశం పంపడానికి, వేధింపులు, శిక్షకు న్యాయ క్రమాన్ని ఒక సాధనంగా వాడేందుకు వాడుతున్నారు." అని ఆ ప్రకటన పేర్కొంది. జర్నలిస్టులను, మానవ హక్కుల పరిరక్షకులను, ఇతర విమర్శకులను లక్ష్యంగా చేసుకోవడానికి యుఎపిఎను పదే పదే ఉపయోగించడాన్ని ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల నిపుణులు పదే పదే ఖండిస్తున్నారని పేర్కొంది.

"అంతర్జాతీయ మానవ హక్కుల ప్రమాణాలకు అనుగుణంగా అక్రమ కార్యకలాపాల నిరోధక చట్టాన్ని ప్రభుత్వం సవరించాలి. ఆ సవరణ జరిగేంతవరకు, విమర్శకులను లక్ష్యంగా చేసుకోవడానికి ప్రభుత్వం దీన్ని ఉపయోగించుకోవడం ఆపాలి" అని ఆ గ్రూపులు పేర్కొన్నాయి.

క్షేమంగా స్వదేశానికి.. !

ఇజ్రాయిల్ నుంచి 212 మంది రాక

న్యూఢిల్లీ : హమాస్‌తో యుద్ధం నేపథ్యంలో ఇజ్రాయిల్‌లో చిక్కుకున్న భారతీయులను స్వదేశానికి తీసుకొచ్చే 'ఆపరేషన్ అజయ్' ప్రారంభమైంది. ఇందులో భాగంగా 212 మంది భారతీయులతో టెల్ అవీవ్ నుంచి బయలుదేరిన తొలి బ్యాచ్ ప్రత్యేక విమానం శుక్రవారం తెల్లవారుజామున ఢిల్లీకి చేరుకుంది. స్వదేశం చేరుకున్న భారతీయులకు కేంద్రమంత్రి రాజీవ్ చంద్రశేఖర్ విమానాశ్రయంలో స్వాగతం పలికారు. వచ్చిన వారిలో కొందరు విద్యార్థులు కూడా ఉన్నారు. 'ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్' ఆధారంగా వీరిని స్వదేశానికి తీసుకొచ్చారు. 'ఇజ్రాయిల్‌లో సాధారణ పరిస్థితులు లేవు. ప్రజలు భయం గుప్పిట్లో బతుకుతున్నారు. మేం బయల్దేరే సమయంలో కూడా సైరన్లు మోగుతూనే ఉన్నాయి. ఆ సైరన్ల మోత ఇంకా మా చెవుల్లో మార్మోగుతూనే ఉంది. ఆ భయానక పరిస్థితులను వర్ణించలేం' అని స్వదేశానికి వచ్చిన భారతీయులు తెలిపారు. కాగా, భారత రాయబార కార్యాలయం వివరాల ప్రకారం ఇజ్రాయిల్‌లో దాదాపు 18వేల మంది భారతీయులున్నారు. వారిలో దాదాపు 14వేల మంది కేర్‌టేకర్లే. వీరితోపాటు విద్యార్థులు, ఐటీ ఉద్యోగులు, వజ్రాల వ్యాపారులు తదితరులున్నారు. వీరిని వెనక్కి తీసుకొచ్చేందుకు కేంద్రం 'ఆపరేషన్ అజయ్' ప్రారంభించింది. వీరి ప్రయాణ ఖర్చులను ప్రభుత్వమే భరించనుంది.

క్షేమంగా తిరిగొచ్చిన 10 మంది రాష్ట్ర వాసులు

'అపరేషన్ అజయ్' ద్వారా శుక్రవారం స్వదేశానికి చేరుకున్న భారతీయుల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన 10 మంది ఉన్నారని ఎపిఎన్ఆర్‌టిఎస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు కార్యాలయం పేర్కొంది. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. స్వదేశానికి రావాలనుకునే వారు రాయబార కార్యాలయంలో వారి వివరాలను హెల్ప్‌లైన్ డెస్క్ నెంబరు ప్లస్ 972 35226748కి ఫోన్ చేసి తెలిపింది.

ఢిల్లీకి రానున్న వారి ప్రయాణఖర్చులు భరించలేని విద్యార్థులు, ఇతర వలసదారులకు రాష్ట్ర ప్రభుత్వం తరపున విమాన చార్జీలు పెట్టి వారిని రాష్ట్రానికి పంపాలని ఢిల్లీలోని ఎపి రెసిడెంట్ భవన్ అధికారులకు సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు.

ప్రత్యేక హెల్ప్ లైన్

ఇజ్రాయిల్‌లో భారత పౌరులు అత్యవసర పరిస్థితుల్లో సహాయం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక హెల్ప్ లైన్ ఏర్పాటు చేసింది. ఎపిఎన్ఆర్‌టిఎస్ 24/7 హెల్ప్‌లైన్ నెంబర్లు ప్లస్ 918500027678 (వాట్సాప్), 0863 2340678ను సంప్రదించాలని పేర్కొన్నారు. అదే విధంగా కుటుంబ సభ్యులు,మిత్రులు ఎవరైనా ఇజ్రాయిల్‌లో ఉంటే ఎపిఎన్ఆర్‌టిఎస్ 24/7 హెల్ప్‌లైన్ నంబర్లను సంప్రదించి వివరాలు తెలపాలని కోరారు.

భారతదేశ గర్భస్రావ చట్టం చాలా ఉదారమైనది


- సిజెఐ చంద్రచూడ్ వ్యాఖ్య

న్యూఢిల్లీ : భారతదేశంలోని గర్భస్రావ చట్టం చాలా ఉదారమైనదని, ఇతర దేశాల కన్నా చాలా ముందున్నదని, మనకు అనుకూలమైన విధానం ఎంపిక చేసుకోవచ్చని, భారత ప్రధాన న్యాయమూర్తి డి.వై.చంద్రచూడ్ వ్యాఖ్యానించారు. తన 26వారాల గర్భాన్ని వైద్యపరంగా తొలగించుకోవాలని కోరుకుంటున్న ఒక మహిళ పిటిషన్‌ను విచారిస్తూ చంద్రచూడ్ శుక్రవారం పై వ్యాఖ్యలు చేశారు. "మన గర్భస్రావ చట్టం ఇతర దేశాల చట్టాల కంటే చాలా ముందుంది అందులో ఎలాంటి సందేహం లేదు. రో వర్సెస్ వాడె పరిస్థితి మనకు ఇక్కడ లేదు. మన చట్టం చాలా ఉదారమైనది, మనకు అనుకూలమైన విధానాన్ని ఎంపిక చేసుకోవచ్చు." అని చంద్రచూడ్ పేర్కొన్నారు. గర్భస్రావ హక్కును దేశ రాజ్యాంగం పరిరక్షిస్తుందని అమెరికా సుప్రీం కోర్టు 1973లో రో వర్సెస్ వాడె కేసులో పేర్కొంది.

గర్భం కొనసాగిస్తే తల్లి ప్రాణానికి ముప్పు వుందని లేదా గర్భస్థ శిశువులో అసాధారణమైన వైద్య సమస్యలు, లోపాలు వున్నాయని డాక్టర్ల బోర్డు అంగీకరించిన పక్షంలో 24వారాలు దాటిన తర్వాత కూడా గర్భస్రావం చేయడానికి మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ యాక్ట్ నిబంధనలు అనుమతిస్తున్నాయని అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్యా భాటి చేసిన వాదనలను ప్రస్తావిస్తూ చీఫ్ జస్టిస్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ కేసులో మహిళ వివాహిత అని, మూడవసారి ఆమె గర్భం ధరించిందని, ఒకవేళ ఆమె తన గర్భాన్ని కొనసాగించినట్లైతే లోపల వున్న శిశువు కూడా చక్కగానే వుందని డాక్టర్లు చెప్పిన విషయాన్ని భాటి ప్రస్తావించారు. పిటిషనరు తరపు న్యాయవాది మాత్రం తన క్లయింట్ గతేడాది రెండవ కాన్పు తర్వాత అక్టోబరు నుండి ప్రసవానంతర మానసిక సమస్యలతో బాధపడుతోందని, అందుకోసం వాడిన మందులు గర్భాన్ని కొనసాగించేందుకు అనుకూలంగా లేవని పేర్కొంటున్నారు. దాంతో ఆ డాక్టర్ ప్రిస్కిప్షన్లను పరిశీలన నిమిత్తం ఎయిమ్స్ మెడికల్ బోర్డుకు నివేదించారు. తల్లి లోపల వున్న బిడ్డ ఇరువురూ ఇబ్బంది పడకుండా వుండేలా ప్రత్యామ్నాయ వైద్య విధానం ఏమైనా వుందేమో పరిశీలించాల్సిందిగా కోర్టు, మెడికల్ బోర్డును కోరింది. దీనిపై విచారణను 16వ తేదీకి వాయిదా వేసింది.

మానవ సంక్షేమమే లక్ష్యంగా ముందుకు..

- జి 20 పార్లమెంట్ స్పీకర్ల సదస్సులో ప్రధాని మోడీ



న్యూఢిల్లీ : తీవ్రవాదం ఎక్కడ చోటు చేసుకున్నా, ఏ కారణంతో జరిగినా అది మానవాళికి, మానవత్వానికి విరుద్ధమైనదేనని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. ఇక్కడ యశోభూమి కన్వెన్షన్ సెంటర్‌లో జి 20 పార్లమెంటరీ స్పీకర్స్ 9వ సదస్సును మోడీ ప్రారంభించారు. జి 20 దేశాల పార్లమెంటరీ స్పీకర్ల సదస్సు ప్రారంభ సమావేశంలో మోడీ ప్రసంగిస్తూ, ఐక్యరాజ్య సమితిలో కూడా ఉగ్రవాదానికి నిర్వచనంపై ఏకాభిప్రాయం లేదన్నారు. ఈనాడు ప్రపంచ దేశాలు ఎదుర్కొంటున్న సంఘర్షణలు, అల్లర్లతో ఏ ఒక్కరికీ ప్రయోజనం చేకూరదని ఆయన హెచ్చరించారు. మానవ సంక్షేమమే లక్ష్యంగా ప్రపంచం ముందుకు సాగాల్సి వుందన్నారు. ప్రపంచ దేశాల విశ్వాసం పొందే మార్గంలో గల అడ్డంకులన్నింటినీ మనం తొలగించాల్సి వుందన్నారు. శాంతి, సోదర భావంతో మనందరం కలిసికట్టుగా ముందుకు సాగాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఇజ్రాయిల్, పాలస్తీనా మధ్య యుద్ధం జరుగుతున్న వేళ ప్రధాని వ్యాఖ్యలు వెలువడ్డాయి. ఇప్పటివరకు ఈ యుద్ధంలో ఇరు పక్షాలవైపు 2800మంది మరణించారు. 4,23,000మందికి పైగా నిర్వాసితులయ్యారని ఐక్యరాజ్య సమితి పేర్కొంది. 2001లో భారత పార్లమెంట్‌పై జరిగిన తీవ్రవాద దాడిని మోడీ ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. సీమాంతర తీవ్రవాదంతో భారత్ సుదీర్ఘకాలంగా పోరాడుతోందన్నారు. పార్లమెంట్ సభ్యులను బందీలుగా చేసేందుకు తీవ్రవాదులు కుట్ర పన్నారని అన్నారు. వచ్చే ఏడాది జరగనున్న ఎన్నికల గురించి ప్రస్తావిస్తూ, సార్వత్రిక ఎన్నికలనేవి భారత్‌లో పెద్ద పండగ అని వ్యాఖ్యానించారు. వంద కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకుంటారని అన్నారు. వచ్చే ఏడాది ఎన్నికల ప్రక్రియను చూసేందుకు రావాల్సిందిగా ఆహ్వానిస్తున్నానని ఆయన ప్రతినిధులను కోరారు.

వసుంధర రాజేకు మొండిచెయ్యి

- తొలి జాబితాలో ఆమెకు, ఆమె మద్దతుదారులకు దక్కని చోటు



జైపూర్ : రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల కోసం 41 మంది అభ్యర్థులతో బిజెపి విడుదల చేసిన మొదటి జాబితాను విడుదల చేసింది.అయితే మాజీ సీఎం వసుంధరా రాజేను పక్కన బెట్టడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

ముఖ్యమంత్రి పదవి కోసం ఏ నాయకుడి ముఖాన్ని ప్రదర్శించకుండా రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తుందని నడ్డా-షా సమావేశంలో ప్రకటించినపుడే వసుంధరా సీటుపైనే అనుమానాలు తలెత్తాయి.

ఈ జాబితాలో ప్రకటించిన 41 మంది అభ్యర్థుల్లో 31 మంది కొత్త ముఖాలు. మహారాణి దియా కుమారి, రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్ పేర్లతో సహా ఏడుగురు ఎంపీలకు కూడా పార్టీ టిక్కెట్లు ఇచ్చింది. అదే సమయంలో టికెట్ ఆశించిన మాజీ ముఖ్యమంత్రి వసుంధర రాజే మద్దతుదారులు చాలా మంది నిరాశకు గురయ్యారు. దీనిపై రాజస్థాన్ రాజకీయాల్లో కలకలం రేగింది. టికెట్ రద్దుపై ఆగ్రహంతో అరడజను మందికి పైగా నాయకులు లేదా వారి మద్దతుదారులు బహిరంగ నిరసనకు దిగారు. జైపూర్‌లోని జోత్వారా స్థానం నుంచి రాజ్‌పాల్ సింగ్ షెకావత్‌ను కాదని కేంద్ర మాజీ మంత్రి రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్‌కు టికెట్ ఇచ్చింది. రాథోడ్‌కు టికెట్ ఇవ్వడాన్ని జోత్వారా బీజేపీ కార్యకర్తలు వ్యతిరేకించారు.

సంచోర్ స్థానం నుంచి ఎంపీ దేవ్‌జీ పటేల్‌కు బీజేపీ టికెట్ ఇచ్చింది. సంచోర్‌లో కూడా దేవ్‌జీని వ్యతిరేకిస్తున్నారు. నివేదికల ప్రకారం, దేవ్‌జీ పటేల్ కాన్వాయ్‌లో ఉన్న వాహనాలపై రాళ్లు రువ్వడం , ధ్వంసం చేసిన సంఘటన కూడా జరిగింది. ఈ ఘటన వెనుక తన ప్రత్యర్థుల కుట్ర ఉంటుందన్న భయాన్ని దేవ్‌జీ వ్యక్తం చేశారు.

టికెట్లు రాని అనితా సింగ్, రాజ్‌పాల్ సింగ్ షెకావత్‌లు కూడా మాజీ సీఎం వసుంధరను కలిశారు. వసుంధరతో పలువురు నేతలు కూడా భేటీ అయినట్లు చర్చ జరుగుతోంది. రాజస్థాన్‌లో టిక్కెట్ల పంపిణీ వసుంధర రాజేకి నిజంగా ఎదురుదెబ్బ కాదా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ముఖ్యమంత్రి అభ్యర్థి లేకుండా చేస్తామని బిజెపి ఇప్పటికే ప్రకటించినందున ఈ ప్రశ్నలు కూడా తలెత్తుతున్నాయి. 1998 తర్వాత రాష్ట్ర రాజకీయాల్లో బిజెపి ఈ విధంగా చేయడం ఇదే మొదటిసారి.

మరోవైపు తనకు, తన మద్దతుదారుల టిక్కెట్లు కోతపడడంతో వసుంధర ఆగ్రహంతో ఉన్నట్టు చెబుతున్నారు. అయితే వసుంధర ఈ విషయాన్ని బహిరంగంగా చెప్పలేదు, అసహనం వ్యక్తం చేయలేదు. తొలి జాబితాలో చోటు దక్కని నేతలను వసుంధర రాజే సముదాయించే ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో రాజస్థాన్‌లో రాజకీయాలు వేడెక్కాయి.

సర్వం వదిలి.. సహాయక శిబిరాలకు..

- ఇజ్రాయిల్ అల్టిమేటంతో గాజాను వీడుతున్న లక్షలాదిమంది ప్రజలు
- పెను విపత్తు : ఐక్యరాజ్య సమితి


పిల్లలతో కలిసి ఐరాస సహాయక శిబిరానికి వెళ్తున్న మహిళ

గాజా సిటీ : గాజా ప్రాంతంలోని పాలస్తీనా పౌరులందరూ 24గంటల్లోగా సురక్షిత ప్రాంతాలకు వెళ్ళిపోవాలంటూ ఇజ్రాయిల్ అల్టిమేటమ్ జారీ చేసిన నేపథ్యంలో ఉత్తర గాజా ప్రాంతాన్ని పలువురు వీడుతున్నారు. ఉత్తర గాజాలో హమాస్ తీవ్రవాదులు సొరంగాల్లో దాక్కున్నారని, వారిని పట్టుకునేందుకే ఈ ఆదేశాలు జారీ చేశామని శుక్రవారం ఇజ్రాయిల్ రక్షణ బలగాలు (ఐడిఎఫ్) తెలిపాయి. దాదాపు సగానికి సగం గాజా ప్రాంతం ఖాళీ అవుతుండడంతో ఐక్యరాజ్య సమితి ఇదొక పెను విపత్తు కాగలదంటూ హెచ్చరించింది. కాగా హమాస్ మాత్రం ఇజ్రాయిల్ హెచ్చరికలను తోసిపుచ్చుతోంది. ఇదంతా పెద్ద కుట్ర అని, ప్రజలు ఇళ్ళలోనే వుండాలని కోరుతోంది. ఖాళీ చేసేందుకు కేవలం 24గంటలే గడువు ఇచ్చినందున మానవతా సంస్థలు పది లక్షల మందికిపైగా ప్రజల కన్నా సాయం చేయలేవని అంతర్జాతీయ రెడ్ క్రాస్ కమిటీ (ఐసిఆర్‌సి) పేర్కొంది. ఇదిలా వుండగా, ఇలా బలవంతపు తరలింపులను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని పాలస్తీనా అధ్యక్షుడు మహ్మద్ అబ్బాస్ అమెరికా విదేశాంగ మంత్రి బ్లింకెన్‌కు తెలిపారు. మానవతా విపత్తును తప్పించడానికి వెంటనే మానవతా కారిడార్లు ఏర్పాటు చేయాలని కోరారు.

ఇజ్రాయిల్ కాల్పుల్లో 9 మంది మృతి

యుద్ధంతో అతలాకుతలమవుతున్న గాజాకు సంఘీభావంగా వెస్ట్ బ్యాంక్‌లో ర్యాలీలు జరుపుతుండగా ఇజ్రాయిల్ కాల్పులు జరిపింది. ఈ కాల్పుల్లో 9మంది మరణించారని పాలస్తీనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇప్పటివరకు 1799మంది పాలస్తీనియన్లు మరణించగా, 6388మంది గాయపడ్డారని గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ అధికారులు తెలిపారు. ఇజ్రాయిల్ వైపు మృతుల సంఖ్య 1300 దాటిందని సైన్యం ప్రకటించింది. 3200మందిక పైగా గాయపడ్డారని తెలిపింది. మరోవైపు గాజాలో వైట్ ఫాస్పరస్ బాంబులను ఉపయోగిస్తున్నామని వచ్చిన ఆరోపణలను ఇజ్రాయిల్ మిలటరీ ఖండించింది.

అవసరమైతే మరింత సాయం చేసేందుకు సంసిద్ధంగా వున్నామంటూ అమెరికా రక్షణ మంత్రి లాయిడ్ ఆస్టిన్ శుక్రవారం తెలిపారు. కాగా పాలస్తీనియన్లకు మద్దతుగా పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు జరిగాయి. కరాచి, లాహోర్, పెషావర్, ఇస్లామాబాద్ లతో సహా పలు నగరాలు, పట్టణాల్లో రాజకీయ, మత పరమైన పార్టీలు డజన్ల సంఖ్యలో ప్రదర్శనలు నిర్వహించాయి. బాగ్దాద్‌లో వేలాదిమంది ఇరాకీలు పాలస్తీనియన్లకు మద్దతుగా ప్రదర్శన నిర్వహించారు.

మిజోరంలో కౌంటింగ్ తేదీ మార్చండి

- అన్ని పార్టీల డిమాండ్

ఇంఫాల్ : క్రిస్టియన్ కమ్యూనిటీ ప్రాబల్యం ఉన్న మిజోరాంలో ఓట్ల లెక్కింపు తేదీని మార్చాలన్న డిమాండ్ మొదలైంది. బిజెపి, కాంగ్రెస్, అధికార ఎంఎన్‌ఎఫ్‌తో సహా అన్ని రాజకీయ పార్టీలు ఈ డిమాండ్‌కు అంగీకరించాయి. డిసెంబర్ 3న అంటే ఆదివారం ఓట్ల లెక్కింపు ఉంటుందని పార్టీలు చెబుతున్నాయి. ఆదివారం క్రైస్తవులకు పవిత్రమైన రోజు కాబట్టి కౌంటింగ్ తేదీని మార్చాలని కోరుతున్నాయి.. ఈ డిమాండ్‌పై అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల సంఘానికి లేఖ కూడా రాశాయి. మిజో ప్రజలు ఆదివారాల్లో ప్రార్థనల్లో పూర్తిగా అంకితమవుతారని లేఖలో పేర్కొన్నారు. ఈ లేఖలో అన్ని రాజకీయ పార్టీలు, ఎన్జీవోల అధ్యక్షుల సంతకాలు కూడా ఉన్నాయి. మిజోరంలో ఆదివారం ఎలాంటి అధికారిక కార్యక్రమం నిర్వహించడం లేదని కూడా లేఖలో ప్రస్తావించారు.

లేఖ పంపిన పార్టీల్లో అధికార ఎంఎన్‌ఎఫ్, బిజెపి, కాంగ్రెస్, జోరామ్ పీపుల్స్ మూవ్‌మెంట్, పీపుల్స్ కాన్ఫరెన్స్ ఉన్నాయి. ఈమేరకు ఎన్నికల సంఘానికి లేఖ పంపారు. రాష్ట్రంలోని ప్రముఖ చర్చిల సమూహం మిజోరాం కొహ్రాన్ హ్రుయుట్ కమిటీ (ఎంకేహెచ్‌సీ) కూడా కౌంటింగ్ తేదీని మార్చాలని కోరుతూ ఎన్నికల కమిషన్‌కు లేఖ పంపింది.

40 మంది సభ్యులున్న మిజోరాం అసెంబ్లీకి నవంబర్ 7న ఒకే దశలో పోలింగ్ జరగనుంది. ఐదు రాష్ట్రాల ఓట్ల లెక్కింపును డిసెంబర్ 3న ఖరారు చేశారు. ఆదివారం క్రైస్తవులకు పవిత్రమైన రోజు అని, ఆ రోజు అన్ని పట్టణాలు, గ్రామాల్లో మతపరమైన కార్యక్రమాలు జరుగుతాయని ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్‌కు రాసిన లేఖలో ఎంకేహెచ్‌సీ పేర్కొంది.

కొత్తవారికి కొలువులు

- ఇసి ఆదేశాల మేరకు తెలంగాణ సిఎస్ ఉత్తర్వులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర ఎన్నికల సంఘం వేటువేసిన ఐఎఎస్, ఐపిఎస్ అధికారుల స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం కొత్తవారిని నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలలోగా బాధ్యతలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

ఇసికి అందిన సమాచారం మేరకు హైదరాబాద్, వరంగల్, నిజామాబాద్ పోలీస్ కమిషనర్లతో పాటు పలు జిల్లాల ఎస్‌పిలను, రంగారెడ్డి, మేడ్చల్, యాదాద్రి, నిర్మల్ జిల్లాల కలెక్టర్లపై ఇసి వేటు వేసింది. వారి స్థానంలో కొత్తవారి నియామకానికి ఒక్కో పోస్టుకు మూడు పేర్లతో సిఎస్ పంపిన జాబితాను పరిశీలించిన సిఇసి శుక్రవారం ఫైనల్ చేసింది. ఆ మేరకు సిఎస్ ఉత్తర్వులు విడుదల చేశారు. రంగారెడ్డి కలెక్టర్‌గా భారతి హోలికేరి, మేడ్చల్ మల్కాజ్‌గిరి కలెక్టర్‌గా గౌతమ్ పోట్రు, యాదాద్రి భువనగిరి కలెక్టర్‌గా జెందగె హనుమంత్ కొండిబ, నిర్మల్ కలెక్టర్‌గా ఆశిష్ సంగ్వాన్ నియమితులయ్యారు.

రవాణా శాఖ ముఖ్య కార్యదర్శిగా ఎ వాణి ప్రసాద్, వాణిజ్యపన్నుల శాఖ స్పెషల్ సిఎస్‌గా సునీల్ శర్మ, ఆబ్కారీ శాఖ కమిషనర్‌గా డా జ్యోతి బుద్ధప్రసాద్, వాణిజ్య పన్నుల కమిషనర్‌గా డా క్రిస్టినా చొంగ్తులను బదిలీచేశారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా సందీప్ శాండిల్యా, వరంగల్ పోలీస్ కమిషనర్‌గా అంబర్ కిషోర్ ఝా, నిజామాబాద్ ఎస్‌పిగా కమలేశ్వర్ సింగెన్వార్, సంగారెడ్డి ఎస్‌పిగా రూపేశ్, కామారెడ్డి ఎస్‌పిగా సింధు శర్మ, జగిత్యాల ఎస్‌పిగా సన్‌ప్రీత్ సింగ్, మహబూబ్‌నగర్ ఎస్‌పిగా హర్షవర్ధన్, నాగర్ కర్నూల్ ఎస్‌పిగా గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, జోగులాంబ గద్వాల ఎస్‌పిగా రితిరాజ్, మహబూబాబాద్ ఎస్‌పిగా డా. పాటిల్ సంగ్రామ్ సింగ్, నారాయణపేట్ ఎస్‌పిగా యోగేశ్ గౌతమ్, జయశంకర్ భూపాలపల్లి ఎస్‌పిగా ఖరే కిరణ్ ప్రభాకర్, సూర్యాపేట ఎస్‌పిగా బికె రాహుల్ హెగ్డేలు నియమితులయ్యారు.

దత్తత ప్రక్రియలో జాప్యంపై సుప్రీం అసహనం

న్యూఢిల్లీ : దేశంలో చిన్నారులను దత్తత తీసుకునే ప్రక్రియలో తీవ్ర జాప్యం చోటు చేసుకోవడంపై సుప్రీంకోర్టు మరోసారి అసహనం వ్యక్తం చేసింది. దత్తతను మానవతా విషయంగా అభివర్ణించిన న్యాయస్థానం మెరుగైన జీవితం కోసం ఎంతో మంది చిన్నారులు వేచిచూస్తున్నారని పేర్కొంది. దత్తత స్వీకరణ, ప్రక్రియ సరళీకరణపై దాఖలైన పిటిషన్ల విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ విధంగా వ్యాఖ్యానించింది.

దేశంలో చిన్నారుల దత్తత ప్రక్రియ నిలిచిపోయిందని ఒక పిటిషన్, ఈ ప్రక్రియను సరళీకరించాలని కోరుతూ మరోక పిటిషన్ సుప్రీంకోర్టులో దాఖలయ్యాయి. వీటిని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ నేతృత్వంలోని జస్టిస్ పార్థీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారించింది. దత్తత ప్రక్రియలో తీవ్ర జాప్యం జరుగుతోందంటూ అసహనం వ్యక్తం చేసింది. 'దత్తత ప్రక్రియను సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ (సిఎఆర్ఎ) ఎందుకు నిలిపివేస్తున్నారు? ఎందుకు ఆ ప్రక్రియ చేపట్టడం లేదు. మెరుగైన జీవితం కోసం వందలాది మంది చిన్నారులు దత్తత కోసం వేచిచూస్తున్నారు' అని చీఫ్ జస్టిస్ ప్రశ్నించారు. గత మూడేళ్లలో దత్తత కోసం వేచి చూస్తున్న పిల్లలు, దత్తత పూర్తైన వారి సంఖ్యను తెలియజేయాలని కేంద్రాన్ని ప్రభుత్వాన్ని ఆదేశించారు. తదుపరి విచారణను ఈ న ఎల 30కి వాయిదా వేసింది.

కిర్గిజిస్తాన్‌లో పర్యటిస్తున్న పుతిన్

బిషక్ : కిర్గిజిస్తాన్‌తో సైనిక సంబంధాలు బలోపేతం చేసుకోవాలని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ పిలుపునిచ్చారు. ప్రస్తుతం ఆయన కిర్గిజిస్తాన్‌లో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా కిర్గిజ్ అధ్యక్షుడు సదిర్ జపరోవ్‌తో ఆయన చర్చలు జరిపారు. జపరోవ్ పంపిన ఆహ్వానానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సోవియట్ అనంతర స్వతంత్ర కామన్వెల్త్ దేశాల సదస్సులో పాల్గొనేందుకు ఆయన కిర్గిజ్ రాజధాని బిషక్ చేరుకున్నారు. రష్యా, కిర్గిజిస్తాన్‌ల మధ్య సైనిక, సైనిక-సాంకేతిక సహకారాన్ని బలోపేతం చేసుకోవాల్సి వుందని, విస్తరించుకోవాల్సి వుందని అన్నారు. రష్యా నేతృత్వంలోని పూర్వపు సోవియట్ రాష్ట్రాల కూటమి అయిన కలెక్టివ్ సెక్యూరిటీ ట్రియటీ ఆర్గనైజేషన్‌లో కిర్గిజిస్తాన్ భాగస్వామిగా వుంది. ఉక్రెయినియన్ చిన్నారులను బలవంతంగా తరలించినందుకుగాను అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు (ఐసిసి) పుతిన్‌ను అరెస్టు చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేసింది. మార్చిలో పుతిన్ అరెస్టు వారంటు జారీ తర్వాత ఆయన తొలి విదేశీ పర్యటన ఇదే.

అదాని మరో మోసం

(మొదటి పేజీ తరువాయి)

మా పరిశీలనలో తేలింది.


2019-2021 మధ్య 32 నెలల పాటు అదానీ కంపెనీ ఇండోనేషియా నుండి భారత్‌కు చేసుకున్న 30 సార్లు బొగ్గు రవాణాను ఫైనాన్సియల్ టైమ్స్ పరిశీలించింది. అన్ని సందర్భాల్లోనూ దిగుమతి రికార్డులలో ధరలు సంబంధిత ఎగుమతి ప్రకటనల కంటే చాలా ఎక్కువగా ఉన్నాయని వెల్లడయ్యింది. ఆర్థిక నేరాలను నియంత్రించే భారత ఆర్థిక మంత్రిత్వ శాఖ దర్యాప్తు విభాగం డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డిఆర్ఐ) ఏడేళ్ల క్రితం చేసిన దర్యాప్తులో కృత్రిమంగా ఇంధన ధరల పెంపు బయటపడింది. బొగ్గు విలువను కృత్రిమంగా పెంచి విదేశాలకు డబ్బు తరలించడం, మరోవైపు దేశీయంగా విద్యుత్ కంపెనీలకు అధిక ధరలకు బొగ్గును విక్రయిస్తున్నారని డిఆర్ఐ విచారణలో తేలింది. దీనికి సంబంధించి 2016లో 40 మంది దిగుమతిదారులకు డిఆర్ఐ నోటీసులు జారీ చేసింది. ఇందులో ఐదు అదానీ కంపెనీలు సహా ఆ గ్రూపునకు సరఫరా చేసిన మరో ఐదు సంస్థలు ఉన్నాయి. రికార్డుల ప్రకారం.. దిగుమతి ధరలు 50 శాతం నుంచి 100 శాతం వరకు ఎక్కువగా ఉన్నాయని డిఆర్ఐ గుర్తించింది. అధిక ధరలకు దిగుమతి చేసుకున్న బొగ్గుతో ఇంధన ధరలు భారీగా పెరిగాయి. విద్యుత్ ఛార్జీలు పెంచి.. ప్రజలపై భారం మోపుతున్నారని 2018 నుంచి గుజరాత్‌లోని ప్రతిపక్ష పార్టీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. కాగా.. బొగ్గు దిగుమతుల్లో తాము ఎలాంటి తప్పు చేయలేదని అదానీ గ్రూపు పేర్కొంది.



మీకోసం
అల్లంతో చేసిన టీని వేడిగా తాగడం వల్ల దగ్గు, జలుబు నుంచి ఉపశమనం కలుగుతుంది.

జీవన సౌరభం
విద్య, వివేకం, పరిజ్ఞానం బావిలో నీళ్లలాంటివి. వాడుతున్న కొద్దీ ఊరుతూనే ఉంటాయి.

ఫలించిన ఉపాయం..!



ఒక అడవిలో ఒక రోజు కుందేలుకు దాహంగా ఉంటే నీటిని తాగడానికి చెరువు వద్దకు వెళ్లింది. ఆ చెరువు పక్కనే ఎత్తైన చెట్లు ఉన్నాయి. అక్కడి నుంచి ఒక శబ్దం వినిపించింది. కుందేలు అటువైపుగా వెళ్లి చూస్తే అక్కడ మనుషులు కనిపించారు. వాళ్ళు చెట్లను నరుకుతూ ఉన్నారు.

వాళ్ల దగ్గర ఆయుధాలు చూసి కుందేలు భయపడింది. పరుగెత్తుకుంటూ వెళ్లి, మృగరాజుకు ఫిర్యాదు చేసింది. ఏమి చేయాలో తెలియక అడవిలోని జంతువులను పిలిచి మృగరాజు సమావేశం నిర్వహించింది.

'ఇలాగే సాగితే, కొంతకాలం తర్వాత మనం ఉండడానికి అడవులు కరువైపోతాయి. ఈ మనుషులు అడవుల్లోకి రాకుండా ఏం చేయాలో ఆలోచించి ఒక నిర్ణయం చెప్పండి' అని సమావేశానికి వచ్చిన జంతువులతో సింహం అన్నది.

అప్పుడు సభలో ఉన్న నెమలి ఒక ఆలోచన చేసింది. 'మనం కూడా మనుషుల్లాగా వాళ్ళ ఉన్నచోటికి వెళ్దాం. అలా చేస్తే వాళ్ళు ఇక్కడికి రావడం మానేస్తారు' అన్నది. నెమలి ఆలోచన అన్నిటికీ బాగా నచ్చింది.


మృగరాజు, నక్క, పులి మిగిలిన జంతువులన్నీ ఊరి మీదికి వెళ్లడం ప్రారంభించాయి. వాటిని చూసిన ప్రజలు భయపడ్డారు. ఎప్పుడూ లేనిది జంతువులన్నీ ఊరు మీదికి ఎందుకు వస్తున్నాయో అర్థంకాక గందరగోళపడ్డారు. వెంటనే ఊరి ప్రజలంతా ఓ సమావేశం ఏర్పాటు చేసుకున్నారు.

ఆ ఊరి పెద్ద పెద్దయ్య మాట్లాడుతూ 'మీరు అడవుల్లోకి వెళ్లి చెట్లను నరికేస్తున్నారు. కాబట్టి అవి ఊర్లోకి వస్తున్నాయి. అడవులు మనకు తల్లుల లాంటివి. అక్కడ ఉన్న పండ్లు ఫలాలను మాత్రమే తెచ్చుకోండి. చెట్లను నరకకండి' అని చెప్పారు.

తమ తప్పు తెలుసుకున్న గ్రామస్తులు ఆ రోజు నుండి అడవిలో ఉన్న చెట్లను నరకడం మానేశారు. మనుషులు అడవికి రాకపోవడంతో జంతువులన్నీ చాలా సంతోషించాయి. ఉపాయం ఫలించినందుకు నెమలిని అభినందించాయి.

పత్తెపు సతీష్,
10వ తరగతి,
63053 93291.

చూసి చెప్పండి



పిల్లలూ ఇక్కడ సంకలనం చేసిన అంకెలకు ఎదురుగా వాటి సమాధానాలు రాయాలి. అయితే అవి తికమక స్థానాల్లో ఉన్నాయి. మధ్యలో ఉన్న పజిల్ గుండా వెళ్లి ఏ సంకలనానికి ఏ సమాధానమో కొంచెం చూసి చెప్పండి.

నేను గీసిన బొమ్మ



తాలాడ అనికేత్ శరణ్,
7వ తరగతి,
పి.యన్.కాలనీ, శ్రీకాకుళం.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com



పండగ ఖర్చు ఎంతంటే..

పండగొచ్చిందంటే చాలు, ఎక్కడలేని ఖర్చు మీదపడిపోతుందని సామాన్యులు బెంబేలెత్తిపోతారు. ఒకప్పుడైతే కొత్త బట్టలు, పిండివంటలు ఉండేవి. మరి ఇప్పుడో.. బట్టలు, నగలతో పాటు కొత్త టీవీ, కొత్త ఫ్రిజ్, వాషింగ్‌మెషిన్.. వీటన్నింటికంటే ముందు కొత్త కొత్త ఫీచర్లు ఉన్న మొబైల్ ఫోన్లు జాబితాలో వచ్చి చేరాయి. ఈ నేపథ్యంలో ఒకసారి గడిచిన నాలుగేళ్ల నుండి గమనిస్తే, ఈ ఏడాది పండగకి ఒకింత ప్రత్యేకత ఉంది. 2019 చివర నుండి 2021 చివరి వరకు కరోనా భూతంతో హడలెత్తిపోయిన జనం పండగల జోలికే వెళ్లలేదు. దీంతో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ మార్కెట్లు వెలవెలబోయాయి. బతికుంటే బలుసాకైనా తినొచ్చు అనే ధోరణిలో ప్రతి ఒక్కరూ బిక్కుబిక్కుమంటూ జీవించారు. ఇప్పుడు పరిస్థితి మారింది. తాజా నివేదిక ప్రకారం ఈసారి పండక్కి మన భారతీయులు ఎక్కువే ఖర్చుపెడుతున్నారు. ఈ సంవత్సరం గతేడాది కంటే 2.5 రెట్లు ఎక్కువ ఖర్చు పెడుతున్నామని నివేదిక తేల్చి చెప్పింది. అంతేకాదు, ఏఏ పద్ధతుల్లో ఎంతమంది ఖర్చు పెడుతున్నారో కూడా లెక్కలు వేసింది. అవేంటో ఒకసారి చూద్దామా..

సోషల్‌మీడియాలో సంక్షిప్త సమాచారం అందించే భారతీయ ఆన్‌లైన్ ఫ్లాట్‌ఫామ్‌లైన మోజ్, షేర్‌చాట్ అందించిన సమాచారం ప్రకారం భారతీయుల్లో 47 శాతం మంది జనాభా ఈ ఏడాది రూ.10 వేలకు పైగా పండగ ఖర్చు పెడుతున్నారు. ఇక దాదాపు సగం జనాభా అంటే 48 శాతం ప్రజలు రూ.10 వేల నుండి రూ.20 వేలు, అంతకంటే ఎక్కువే ఖర్చు చేస్తున్నారు.

వేటికి ఖర్చు చేస్తున్నారంటే..

పండగ ఖర్చుల్లో ముఖ్యంగా మూడు విభాగాల్లో ఖర్చు ఎక్కువ పెడుతున్నారని నివేదికలో పేర్కొన్నారు. ప్రముఖ కొనుగోళ్లు.. దుస్తులు, ఫోన్ల విక్రయాలతో పాటు గృహపునర్నిర్మాణానికి కూడా ఈసారి ఖర్చు ఎక్కువ పెడుతున్నారు. ఈ ఖర్చు కోసం 66 శాతం మంది తమ నిధులను వినియోగిస్తున్నారు. 59 శాతం మంది వినియోగదారుల్లో ముఖ్యంగా 26 నుండి 35 ఏళ్ల మధ్య వారు ప్రముఖ బ్రాండింగ్ వస్తువుల వైపు మొగ్గు చూపుతున్నారు.

ఈ నివేదిక 2,355 మంది సభ్యుల ప్రత్యక్ష సమాచారం ఆధారంగా తయారుచేశారు. 20 నుండి 50 ఏళ్ల మధ్య ఇందులో పాల్గొన్నారు. సర్వేలో పాల్గొన్న వారిలో 19 శాతం మంది పండక్కి కొత్త టీవీ కొనుక్కోవాలని ఆశపడ్డారు. 18 శాతం మంది వాషింగ్‌మెషిన్ వైపు మొగ్గు చూపారు. కొత్త మొబైల్ ఫోన్‌ను కొనుగోలు చేయాలనుకునే వినియోగదారుల్లో 44 శాతం మంది మెరుగైన కెమెరా కోసం కొంటున్నారు. 34 శాతం మంది సాంకేతికతను అందిపుచ్చుకోవాలని చెబుతూ 5జిని ఎంచుకున్నట్లు నివేదిక తేల్చింది.

ఇదండీ సంగతి.. వీళ్లల్లో మీరు ఎక్కడ ఉన్నారో వెతుక్కోకండి.. ఏం కొనాలో ఆలోచించకండి.. ఆదాయాలు కుదుటపడి ఇప్పుడిప్పుడే సగటు మనిషి కోలుకునే పరిస్థితులు కనిపించడం లేదు. హంగులు, ఆర్భాటాలకు పోయి, మార్కెట్ ప్రలోభాలకు లోబడి జేబు ఖాళీ చేసుకోకండి. పండగ రోజున ఎంచక్కా కుటుంబంతో కలిసి ఎంజాయ్ చేయండి చాలు..

ఏడుస్తూ పోలీస్ స్టేషన్‌కి..

ఆ రోజు బాంధవి ఏడ్చుకుంటూ పోలీస్‌స్టేషనుకు వెళ్లింది. ఎందుకొచ్చావని, ఏం జరిగిందని పోలీసులు అడిగారు? సమాధానం చెప్పలేదు. అదేపనిగా ఏడుస్తూ ఉంది. ఎవరైనా ఏమైనా అన్నారా? స్కూల్లో, చుట్టుపక్కల ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించారా? అని ఎన్నిసార్లు ఎన్ని ప్రశ్నలు వేసినా సమాధానం చెప్పడం లేదు. ఏడుస్తూనే ఉంది. ఎంత సేపో బుజ్జగించాక అసలు విషయం చెప్పింది. 'మా ఇంటి పక్కనే ఉండే షాపులో క్రితం రోజు నేను ఓ పుస్తకం కొన్నాను. ఆ పుస్తకం తీసుకుని స్కూలుకు వెళితే దాన్ని చాలా తక్కువ ధరకే కొన్నామని నా స్నేహితులు చెప్పారు. షాపు యజమాని నాకు రూ.85 ఎక్కువకి అమ్మాడు. నేను వెంటనే వెళ్లి అడిగాను. పుస్తకం అసలు ధర కంటే అతను తీసుకున్న ఎక్కువ డబ్బులు ఇవ్వమని నిలదీశాను. కానీ యజమాని ఒప్పుకోలేదు. పుస్తకం తిరిగి ఇచ్చేస్తా, నా డబ్బులు ఇచ్చేయమన్నాను. కుదరదని కసురుకున్నాడు. ఏం చేయాలో తెలియడం లేదు' అని వెక్కిళ్లు పడుతూ చెప్పింది.



రూ.85 కోసం ఆ పాప ఎందుకంతలా ఏడ్చిందంటే.. ఉత్తరప్రదేశ్ హరదోయిలో రోజు కూలీ చేసుకునే తండ్రి, తన భార్య, ఐదుగురు సంతానంతో ఓ చిన్న ఇంట్లో ఉంటున్నాడు. బాంధవి అతని నాలుగో సంతానం. సంపాదన తక్కువైనా పిల్లలను బడి మాన్పించకుండా చదివించుకుంటున్నాడు ఆ తండ్రి. 9వ తరగతి చదువుతున్న బాంధవి పుస్తకం కోసం డబ్బులు అడిగిన రోజు, అతను కొన్ని గంటలు అదనంగా పనిచేశాడు. ఆ పిల్లలకు తండ్రి కష్టం తెలుసు. అందుకే తక్కువ ధర ఉన్న పుస్తకాన్ని షాపు యజమాని ఎక్కువ ధరకు అమ్మాడని తెలిసి బాంధవి తట్టుకోలేకపోయింది. షాపు యజమానిని నిలదీసింది. అతను ససేమిరా అనడంతో పోలీసులను ఆశ్రయించింది. చదువు విలువతో పాటు తండ్రి కష్టం తెలిసిన బాంధవి, పోలీసులను ఆశ్రయించడం, వారి సాయంతో షాపు యజమానిని నిలదీస్తున్న వీడియో ప్రస్తుతం సోషల్‌మీడియాలో వైరల్ అవుతోంది.

గుడ్లు ఎక్కువ రోజులు నిల్వ ఉండాలంటే



గుడ్డులో మంచి పోషక విలువలు, ప్రోటీన్స్ ఉంటాయి. ఇంట్లో పిల్లలు, పెద్దలు వీటిని తింటుంటారు. దీంతో ఎక్కువమొత్తంలో కొనుగోలు చేస్తుంటాం. అయితే సరైన పద్ధతిలో వాటిని నిల్వ చేసుకోకపోతే త్వరగా పాడైపోతాయి. అలా పాడవ్వకుండా ఎక్కువ రోజులు నిల్వ ఉండాలంటే ఏం చేయాలో చూద్దాం.

- సాల్మొనెల్లా బ్యాక్టీరియా గుడ్ల షెల్, లోపల ఉంటుంది. ఈ బ్యాక్టీరియా పెరుగుదల గది ఉష్ణోగ్రత కంటే చల్లగా ఉంటుంది. ఫ్రిజ్లో పెడితే బ్యాక్టీరియా గుడ్డుపైనే కాకుండా మిగతా పదార్థాలపై కూడా వ్యాపిస్తుంది.. అందుకే వీటిని ఎట్టి పరిస్థితులలో ఫ్రిజ్‌లో పెట్టకూడదు.
- కోడి గుడ్డు ఎక్కువకాలం తాజాగా ఉండాలంటే వాటిని ఎక్కువగా కదపకూడదు. వెడల్పుగా ఉండే భాగాన్ని పైకి వచ్చేలా వెడల్పు తక్కువ ఉండే భాగాన్ని కిందికి వచ్చేలా ఉంచాలి.
- అలాగే గుడ్ల పైన పెంకుపై కొద్దిగా నూనె రాసి పెడితే, కనీసం 10 నుండి 12 రోజుల వరకూ తాజాగా ఉంటాయి.
- టిష్యూ పేపర్లలో చుట్టి నిల్వ చేసుకున్నా ఎక్కువ రోజులు తాజాగా ఉంటాయి.

ఢీ.. అంటే ఢీ...

నేడు భారత్ × పాకిస్తాన్ వన్డే మ్యాచ్



మధ్యాహ్నం 2.00గం॥ల నుంచి

అహ్మదాబాద్: భారత్, పాకిస్తాన్ జట్ల మధ్య నరేంద్ర మోడీ స్టేడియంలో జరిగే మ్యాచ్‌కు సర్వం సిద్ధమైంది. ప్రపంచంలోని అతిపెద్ద మైదానాల్లో ఒకటైన ఈ స్టేడియంలో శనివారం జరిగే మ్యాచ్‌కు సంబంధించి ఏర్పాట్లన్నీ ఇప్పటికే పూర్తయ్యాయి. ఈ మ్యాచ్‌ను ఎప్పుడెప్పుడు వీక్షిస్తామా? అని యావత్ ప్రపంచ క్రీడాభిమానులంతా ఆతృతతో ఎదురు చూస్తున్నారు. పాకిస్తాన్ జట్టు ఏడేళ్ల తర్వాత భారత్‌లో క్రికెట్ మ్యాచ్ ఆడేందుకు అడుగు పెట్టింది. ఇక వన్డే ప్రపంచకప్‌లో భారత్‌కు అద్భుతమైన ట్రాక్ రికార్డు ఉంది. వన్డే ప్రపంచకప్‌లో టీమిండియా.. పాకిస్తాన్ చేతిలో ఓడిన దాఖలాలు లేవు. వన్డే ప్రపంచకప్‌లో ఇరుజట్లు ఇప్పటివరకు ఏడుసార్లు తలపడగా.. అన్నిట్లోనూ భారత్ జయకేతనం ఎగురవేసింది.



అదే రికార్డును ఇక్కడా కొనసాగించాలని టీమిండియా భావిస్తోంది. ఇక వన్డే వరల్డ్‌కప్-2023లో భారత్, పాకిస్తాన్ జట్లు ఆడిన తొలి రెండు లీగ్ మ్యాచుల్లో గెలుపొందడంతో ఈ మ్యాచ్‌పై క్రీడాభిమానుల్లో ఉత్కంఠ నెలకొంది. పాకిస్తాన్ జట్టు నెదర్లాండ్స్‌పై చెమటోడ్చి నెగ్గినా.. రెండో లీగ్ మ్యాచ్‌లో శ్రీలంకపై 345 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించిన ఉత్సాహంతో బరిలోకి దిగుతోంది. ఈ క్రమంలో ఇరుజట్ల మధ్య జరిగే ఈ మ్యాచ్ ప్రాధాన్యత సంతరించుకోగా.. అభిమానుల్లో ఏ జట్టు గెలుస్తుందా? అనే టెన్షన్ నెలకొంది.

శుభ్‌మన్‌కు చోటు దక్కేనా..?

డెంగీ కారణంగా తొలి రెండు మ్యాచ్‌లకు దూరమైన టీమిండియా ఓపెనర్ శుభ్‌మన్ గిల్ కోలుకున్నాడు. గురువారం నుంచే నెట్స్‌లో ప్రాక్టీస్ మొదలుపెట్టాడు. 100% ఫిట్‌నెట్ సాధిస్తేనే అతడికి తుదిజట్టులో చోటు దక్కనుంది. అదే జరిగితే ఇషాన్ కిషన్ స్థానాన్ని అతడు భర్తీ చేస్తాడు. అహ్మదాబాద్‌లో అద్భుతమైన రికార్డు ఉన్న గిల్‌ను ఆడిస్తారో.. లేక ఆసియా వన్డే కప్-2023లో పాకిస్తాన్‌పై 82 పరుగుల అద్భుత ఇన్నింగ్స్ రాణించిన కిషాన్ వైపు మొగ్గుచూపుతారో మరికొద్ది గంటల్లో తేలిపోనుంది.

మొత్తం ప్రపంచకప్‌లలో ఇరుజట్ల రికార్డు..	భారత్	పాకిస్తాన్
ఆడినవి	86	81
గెలుపు	55	47
ఓటమి	29	32
టై	1	0
ఫలితం రానివి	1	2
గెలుపుశాతం	65.29	59.49

జట్లు(అంచనా)..

భారత్: రోహిత్ శర్మ(కెప్టెన్), కెఎల్ రాహుల్(వికెట్ కీపర్), ఇషాన్/శుబ్‌మన్, శ్రేయస్, కోహ్లి, హార్దిక్, జడేజా, శ్రేయస్, కుల్దీప్, బుమ్రా, సిరాజ్.

పాకిస్తాన్: బాబర్(కెప్టెన్), రిజ్వాన్(వికెట్ కీపర్), షాద్ షకీల్, ఫకర్ జమాన్, ఇఫ్తికార్ అహ్మద్, షాదాబ్ ఖాన్, మహ్మద్ నవాజ్, హసన్ అలీ, షాహిన్‌షా అఫ్రిది, రవూఫ్, ఇమామ్-ఉల్-హక్/ అబ్దుల్లా షఫీక్,

ఎదురులేని న్యూజిలాండ్

వరుసగా మూడో మ్యాచ్‌లోనూ గెలుపు



చెన్నై: ఐసిసి వన్డే ప్రపంచకప్‌లో న్యూజిలాండ్ జట్టు వరుసగా మూడో మ్యాచ్‌లోనూ విజయం సాధించింది. ఎంఎ చిదంబరం స్టేడియంలో శుక్రవారం బంగ్లాదేశ్‌పై 8 వికెట్ల తేడాతో న్యూజిలాండ్ జట్టు గెలిచింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి 245పరుగులు చేయగా.. ఆ లక్ష్యాన్ని న్యూజిలాండ్ జట్టు 42.5ఓవర్లలో కేవలం 2వికెట్లు మాత్రమే కోల్పోయి ఛేదించింది. ఈ మ్యాచ్‌లో న్యూజిలాండ్ ఆల్ రౌండ్ షో కనబర్చింది. కివీస్ జట్టులోకి పునరాగమనం చేసిన కెప్టెన్ కేన్ విలియమ్సన్ 78 పరుగులు చేశాడు. విలియమ్సన్ స్కోరులో 8 ఫోర్లు, ఒక సిక్సర్ ఉన్నాయి. ఆ తర్వాత ఎడమ చేయి బొటనవేలికి గాయం కావడంతో విలియమ్సన్ రిటైర్డ్ హర్ట్‌గా మైదానాన్ని వీడాడు. మరో ఎండ్ లో డారిల్ మిచెల్ 67 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్స్‌లతో 89 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. గ్లెన్ ఫిలిప్స్(16నాటౌట్) మ్యాచ్ ముగించాడు. ఓపెనర్ డెవాన్ కాన్వే (45) రచిన్ రవీంద్ర (9) నిరాశపరిచాడు. ఈ టోర్నీలో బంగ్లాదేశ్‌కు ఇది రెండో పరాజయం.

విశాఖలో మరో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)



శ్రీకర్ భరత్‌ను సత్కరిస్తున్న అమర్‌నాథ్, వైవి.సుబ్బారెడ్డి

అహ్మదాబాద్‌లోని క్రికెట్ స్టేడియాన్ని తలదన్నేలా రూ.300 కోట్లతో విశాఖపట్నంలో మరో క్రికెట్ స్టేడియాన్ని నిర్మించనున్నట్టు రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. ఇప్పటికే ఉమ్మడి విశాఖ జిల్లాలో నాలుగు స్టేడియాల నిర్మాణానికి అవసరమైన స్థలాలను గుర్తించామన్నారు. అంతర్జాతీయ స్థాయిలో టెస్టుల్లో వికెట్ కీపర్‌గా, బ్యాటర్‌గా ఇండియా తరుపున రాణిస్తున్న విశాఖకు చెందిన కోన శ్రీకర్ భరత్‌ను శుక్రవారం నగరంలోని ఓ హోటల్‌లో సన్మానించారు.

ముఖ్య అతిథిగా హాజరైన అమర్‌నాథ్ మాట్లాడుతూ.. బిసిసిఐ నుంచి స్టేడియానికి అనుమతి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేస్తారని తెలిపారు. క్రీడలకు తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు. అందులో భాగంగా రాష్ట్రంలోని 15 వేల సచివాలయాల పరిధిలో 'ఆడుదాం-ఆంధ్ర' పేరుతో క్రీడల పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. దీనిలో భాగంగా ఐదు లక్షల క్రికెట్ కిట్లను క్రీడాకారులకు ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వైసిపి ఉత్తరాంధ్ర జిల్లాల కో - ఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డి, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్ఆర్.గోపీనాథ్ రెడ్డి, డాక్టర్ ఎస్.ఆదినారాయణ, గ్రే హౌండ్స్ ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు పాల్గొన్నారు.

2028 ఒలింపిక్స్‌లో క్రికెట్‌కు చోటు

అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ ఆమోదం



ముంబయి: 2028 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌లో క్రికెట్‌కు చోటు దక్కింది. ముంబయిలో శనివారం జరిగిన అధ్యక్షులు థామస్ బాచ్ అధ్యక్షతన జరిగిన అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ(ఐఓసి) సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. సమావేశం ముగిసిన తర్వాత థామస్ బాచ్ మాట్లాడుతూ.. క్రికెట్‌తోపాటు మరో నాలుగు క్రీడాంశాలకూ 2028 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌లో చోటు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. వీటిలో క్రికెట్, ఫ్లాగ్ ఫుట్‌బాల్, లాక్రోసే, స్క్వాష్, బేస్‌బాల్-సాఫ్ట్‌బాల్ క్రీడలు ఉన్నట్లు తెలిపారు. ఒలింపిక్ ప్రోగ్రామ్ కమిషన్ సమీక్షించి ఓటింగ్ ద్వారా ఆమోద ముద్ర వేస్తే అధికారికంగా ఒలింపిక్స్‌లో ఈ క్రీడలకు ఆమోదం లభించినట్లేనని ఆయన తెలిపారు. అదే జరిగితే ఇకపై ప్రపంచ కప్, ఆసియా కప్, ఛాంపియన్స్ ట్రోఫీ వంటి బహుళ దేశాల టోర్నీలను వీక్షించే అభిమానులకు ఒలింపిక్స్ రూపంలో మరో మెగా సంబరం ఆస్వాదించే అవకాశం కలిగినట్టే. క్రికెట్‌ను చివరిసారిగా 1900 పారిస్ ఒలింపిక్స్‌లో ఆడించారు. ఆ ఏడాది ఫైనల్లో బ్రిటన్ జట్టు ఫ్రాన్స్‌పై గెలిచి స్వర్ణ పతకం కైవసం చేసుకుంది. ఇక ఐఓసి క్రికెట్‌ను ఒలింపిక్స్‌లో చేర్చడం ద్వారా భారత్‌లో ప్రసార హక్కుల నుంచి భారీగా మొత్తంలో సొమ్మును రాబట్టాలని చూస్తోంది. ప్రస్తుతం ఒలింపిక్స్ ప్రసార హక్కుల వేలం ద్వారా రూ.158 వేల కోట్ల వరకు ఐఓసి వస్తోంది. క్రికెట్‌ను ఒలింపిక్స్‌లో చేరిస్తే అదనంగా మరో రూ.15 వేల కోట్లు ప్రసార హక్కుల రానున్నట్లు సమాచారం.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68